ఆదివారం
21-12-2025
విజయవాడ ప్రచురణ
సంపుటి : 74, సంచిక : 180
పేజీలు : 12, వెల: రూ.6.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

మల్టీకలర్ ప్రింటింగ్
ఇప్పుడు మన విశాలాంధ్రలో
మ్యాగ్జైన్స్
లామినేషన్
గమ్ బైండింగ్
బుక్ వర్క్స్
మరియు
పోస్టర్లు
పాంప్లేట్స్
ప్రింట్ చేయబడును
సంప్రదించండి : 94405 73343

భూ సేకరణ చట్టం ఉల్లంఘన

- షెడ్యూల్డ్ ప్రాంతాల్లో కఠినంగా అమలు చేయాలి
- కాగితాలకు పరిమితమైన గ్రామసభల అనుమతులు
- పార్లమెంటరీ కమిటీ నివేదిక

న్యూదిల్లీ: షెడ్యూల్డ్ ప్రాంతాల్లో న్యాయమైన పరిహారం, పారదర్శక భూసేకరణ, పునరావాస చట్టం 2013 (ఎల్ఏఆర్ఆర్ యాక్ట్) కఠినంగా అమలు చేయాలని పార్లమెంటరీ కమిటీ స్పష్టంచేసింది. ఈ చట్టనిబంధనల అతిక్రమణపై ఆందోళన వ్యక్తంచేసింది. కాంగ్రెస్ ఎంపీ సప్తగిరి శంకర్ ఉలాఖా నేతృత్వంలోని గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ పార్లమెంటరీ స్థాయి సంఘం ఇటీవల పార్లమెంటుకు ఓ నివేదిక సమర్పించింది. తప్పనిసరిగా అమలు చేయాల్సిన నిబంధనలు ఉన్నప్పటికీ భూసేకరణ చట్టం ముఖ్యంగా మార్కెట్ లావాదేవీలు కట్టడి చేసిన షెడ్యూల్డ్ ప్రాంతాల్లో తరచూ అతిక్రమణకు గురవుతోందని పేర్కొంది. గిరిజన జనాభా అధికంగా ఉండి... రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్ పరిధిలో గిరిజన సంక్షేమానికి ప్రత్యేక పాలనాధికారం కల్పించిన ప్రాంతాలను షెడ్యూల్డ్ ఏరియాలు అంటారు. ప్రాంతీయ భాషల్లో సంబంధిత వివరాలు తెలియజేసే పత్రాలు లేకపోవడం, గ్రామసభల సంప్రదింపులలో తీవ్రజాప్యం లేదా నామమాత్రంగా జరుగుతుండటంతో పాటు నిజమైన బాధితులతో సంప్రదింపులు లేకుండా యాంత్రికంగా పత్రాలు జారీ చేయడంపై కమిటీ

- మిగతా 2 లో



ఎప్‌స్టీన్ సంచలనం

అమెరికాలో రాజకీయ ప్రకంపనలు

క్లింటన్, ట్రంప్ ఫొటోలు బహిర్గతం

మసాజ్ టెక్నిక్ ప్రస్తావన

వాషింగ్టన్: అమెరికాలో ఎప్‌స్టీన్ ఫైళ్లు సంచలనంగా మారాయి. ఇక్కడి రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టించాయి. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్, పాప్ గాయకుడు మైఖేల్ జాక్సన్ వంటి ప్రముఖుల పేర్లు, ఫొటోలు బహిర్గతమయ్యాయి. మసాజ్ టెక్నిక్... ఆయుర్వేదం ప్రస్తావన కూడా ఆ ఫైళ్లలో ఉన్నది. 200 మంది ప్రముఖులు, వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకుల గురించి ఈ ఫైళ్లలో ఉన్నట్లు మీడియా తెలిపింది. లైంగిక నేరస్తుడు జెఫ్రీ ఎప్‌స్టీన్ ఫైళ్లను 30 రోజుల్లోగా విడుదల చేయాలని గత నెలలో ఒక బిల్లుపై అధ్యక్షుడు ట్రంప్ సంతకం చేశాడు. దీంతో వేలాది ఫైళ్లను అమెరికా న్యాయశాఖ తాజాగా విడుదల చేసింది. వీటిలో ప్రపంచ ప్రముఖుల పేర్లు, ఫొటోలు ఉన్నాయి. ట్రంప్ ప్రభుత్వం ఎంపిక చేసిన కొన్ని ఫైళ్లు మాత్రమే విడుదల చేసినట్లు డెమొక్రాట్లు ఆరోపించారు. అన్ని ఫైళ్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఫైళ్ల ద్వారా ఎప్‌స్టీన్ అధ్వర్యంలో జరిగిన దారుణాలన్నీ ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఎప్‌స్టీన్‌తో ట్రంప్ చాలాకాలం స్నేహంగా ఉన్నారు. ఆ తర్వాత ఇద్దరి మధ్య విభేదాలు వచ్చాయి. ఇది రాజకీయ వివాదానికి దారి తీసింది. తాజా ఫైళ్లలో ట్రంప్ ఫొటోలు తక్కువగా ఉన్నాయని న్యాయశాఖ తెలిపింది. ఆయుర్వేదం, మసాజ్ టెక్నిక్కుల గురించి ఈ ఫైళ్లలో ప్రస్తావన ఉన్నది. భారత్‌కు సంబంధించి ఐదు వేల ఏళ్ల నాటి సహజ వైద్య విధానం గురించి, నువ్వుల నూనెతో డీటాక్సిఫికేషన్ మసాజ్ పద్ధతులను ఈ ఫైళ్లు వివరించాయి. పాశ్చాత్య దేశాలలో

- మిగతా 2 లో

గగన్‌యాన్ మరో కీలక పరీక్ష సక్సెస్

బెంగళూరు: గగన్‌యాన్ మిషన్‌కు సంబంధించిన మరో కీలక పరీక్షను భారత అంతరిక్ష పరిశోధన కేంద్రం (ఇస్రో) విజయవంతంగా నిర్వహించింది. క్రూ మాడ్యూల్ ల్యాండింగ్ పారాచూట్‌లను పరీక్షించింది. తొలి అంతరిక్ష ప్రయాణానికి ఇస్రో సన్నద్ధమవుతున్నది. 2026లో సిబ్బంది లేకుండా గగన్‌యాన్ మిషన్ చేపట్టనున్నది. దీని కోసం అన్ని పరీక్షలు నిర్వహిస్తున్నది. ఈనెల 18, 19న చండీగఢ్‌లోని డీఆర్డీవో టెర్మినల్ బాలిస్టిక్స్ రీసెర్చ్ లేబరేటరీలోని రైల్ ట్రాక్‌పై ఈ పరీక్ష చేపట్టింది. రాకెట్ స్లెడ్ సహాయంతో పారాచూట్‌లకు సంబంధించిన ట్రయల్స్‌ను విజయవంతంగా నిర్వహించింది.

మెస్సీకి రూ.89 కోట్లు ఇచ్చాం

న్యూదిల్లీ: ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీ భారత పర్యటన కోసం నిర్వహకులు రూ.89 కోట్లు చెల్లించారు. ఇందులో భారత ప్రభుత్వానికి రూ.11 కోట్లు పన్నుగా చెల్లించామని ప్రస్తుతం కస్టడీలో ఉన్న ఈవెంట్ నిర్వాహకుడు శతాద్రు దత్తా వెల్లడించినట్లు తెలిసింది. ఈ పర్యటన మొత్తం ఖర్చు రూ.100 కోట్లు కాగా ఇందులో 30 శాతం నిధులను స్పాన్సర్ల నుంచి, మరో 30 శాతం టికెట్ల అమ్మకాల ద్వారా సేకరించినట్లు ఆయన చెప్పినట్లు సమాచారం. దత్తాకు సంబంధించి ఇటీవల ఫ్రీజ్ చేసిన అకౌంట్లలో

- మిగతా 2 లో

గుడ్డు సురక్షితమే

న్యూదిల్లీ: గుడ్లతో కేన్సర్ ముప్పు అన్న అపోహ వద్దంటూ ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్‌ఎస్ఎస్ఏఐ) స్పష్టంచేసింది. నెట్టింట వచ్చేవి తప్పుదోవ పట్టించేవిగా పేర్కొంది. దేశంలో లభ్యమవుతోన్న గుడ్లు సురక్షితమైనవని శనివారం ఒక ప్రకటన చేసింది. వాటిల్లో కేన్సర్ కారక పదార్థాలు ఉన్నాయని చెప్పేందుకు ఎలాంటి శాస్త్రీయ ఆధారాలు లేవని పేర్కొంది. భారత్‌లో విక్రయించే గుడ్లలో నైట్రోఫ్యూరాన్ మెటబాలైట్స్‌ను గుర్తించినట్లు కొన్ని రోజులుగా పోస్టులు వచ్చాయి. 2011లో తీసుకువచ్చిన ఆహార భద్రత నిబంధలన ప్రకారం పౌల్ట్రీ, ఎగ్ ప్రొడక్షన్ జరిగే అన్ని దశల్లో నైట్రోఫ్యూరాన్ల వాడకాన్ని పూర్తిగా నిషేధించినట్లు ఎఫ్ఎస్ఎస్ఏఐ అధికారులు వెల్లడించారు.

పార్లమెంటులో అణు బిల్లు 'బుల్డోజ్'

స్నేహితుడు ట్రంప్ కోసమే 'శాంతి బిల్లు'

కాంగ్రెస్ నేత జైరాం రమేశ్

9లో

స్వచ్ఛాంధ్రతోనే స్వర్ణాంధ్ర

- రాష్ట్రాభివృద్ధి యజ్ఞానికి రాక్షసులు అడ్డంకులు
- అయినా మూడేళ్లలో ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టులు పూర్తి
- 2026 జూన్‌నాటికి ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా ఏపీ
- స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర- తాళ్లపాలెం: స్వచ్ఛాంధ్రతోనే స్వర్ణాంధ్ర సాధ్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఇది కేవలం ఒక కార్యక్రమంలా కాకుండా ప్రజల జీవన విధానంలో భాగం కావాలన్నారు. 2026 జూన్ నాటికి ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా ఏపీ తయారు కావాలని, గ్రామాలు పరిశుభ్రంగా ఉండటమే కాకుండా ఆలోచనలు కూడా స్వచ్ఛంగా ఉండాలని సీఎం ఉద్ఘాటించారు. అనకాపల్లి జిల్లా తాళ్లపాలెంలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ముఖ్యమంత్రి శనివారం పాల్గొన్నారు. ముందుగా పారిశుద్ధ్య కార్మికులతో ముచ్చటించి... ఆ తర్వాత కంపోస్ట్ తయారీ యార్డును సందర్శించారు. అనంతరం ప్రజావేదిక సభలో ప్రసంగించారు. అభివృద్ధి, సంక్షేమంతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తుంటే కొందరు రాక్షసులు వివిధ రూపాల్లో అభివృద్ధి అడ్డుకుంటున్నారని ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా... రాష్ట్రాభివృద్ధి యజ్ఞం ఆగదని సీఎం స్పష్టం చేశారు. రుషికొండ ప్యాలెస్ కోసం రూ.500 కోట్లు దుర్వినియోగం చేసిన వాళ్లు...ప్రజారోగ్యం కోసం యోగా నిర్వహించిన తమపై విష ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. తాడేపల్లి ప్యాలెస్, రంగు రాళ్లపై బొమ్మల కోసం వందల కోట్ల ప్రజాధనం దుర్వినియోగం చేశారే కానీ ఒక్క మెడికల్ కాలేజీ అయినా కట్టారా అని చంద్రబాబు ప్రశ్నించారు. పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీలు కడుతుంటే జైల్లో పెడతామని బెదిరించడం వారి రాక్షసత్వానికి నిదర్శనమన్నారు. ఈ ఉద్యమంలో ముందుండి నడిపిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానన్నారు. ఈసారి పర్యావరణంలో అవకాశాలు అందుకోవడం థీమ్‌గా తీసుకున్నామన్నారు. 'పర్యావరణం మనకు జీవనోపాధి కల్పిస్తుంది. సమగ్ర ఆర్థిక వృద్ధికి దోహదపడుతుంది. వ్యర్థాలు-మురుగు నీటి నిర్వహణ, రీసైక్లింగ్ యూనిట్లు, కంపోస్టింగ్, పారిశుధ్య సేవలు, హరిత ఉత్పత్తులు, సర్క్యులర్ ఎకానమీ కార్యకలాపాలు...ఇవన్నీ స్థానికంగా ఉపాధి కల్పించేవే. ఆంధ్రప్రదేశ్ సర్క్యులర్ ఎకానమీ, వ్యర్థాల రీసైక్లింగ్ పాలసీ 2025

- మిగతా 2 లో

24న శ్రీహరికోట నుంచి అమెరికా ఉపగ్రహ ప్రయోగం

విశాలాంధ్ర-సూళ్లూరుపేట: భారత అంతరిక్ష చరిత్రలో అత్యంత ప్రతిష్టాత్మకమైన శ్రీహరికోట నుంచి అమెరికా భారీ ఉపగ్రహ ప్రయోగం డిసెంబర్ 24 బుధవారం ఉదయం 8.54 గంటలకు జరగనుంది. దేశ శాస్త్రీయ సామర్థ్యాన్ని ప్రపంచానికి ఘనంగా చాటే ఈ చారిత్రక అంతర్జాతీయ ప్రయోగం శ్రీహరికోట సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి జరగడం ద్వారా మరోసారి ప్రపంచ దృష్టిని ఆకర్షించనుంది. ప్రభుత్వ రంగ సంస్థ న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్ బాధ్యతగా నిర్వహిస్తున్న ఈ మిషన్ ద్వారా అమెరికాకు చెందిన భారీ వాణిజ్య శాటిలైట్ బ్లూ బర్డ్ బ్లాక్-2ను భూమి చుట్టూ నిరంతరం పరిభ్రమించే కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టనున్నారు. భారతదేశంలో అత్యంత శక్తివంతమైన గగన్‌యాన్ శ్రేణికి చెందిన ఎల్‌బీఎం-3 రాకెట్ ద్వారా నిర్వహించే ఈ ప్రయోగాన్ని ఎల్‌వీఎం-3 ఎం-6 మిషన్‌గా పిలుస్తున్నారు. రెండో ప్రయోగం వేదిక నుంచి చేపట్టనున్న ఈ మిషన్‌లో ప్రయోగించే శాటిలైట్ బరువు సుమారు 6,500 కిలోలు ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా సాధారణ స్మార్ట్‌ఫోన్‌లకు నేరుగా హై స్పీడ్ సెల్యులర్ బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ శాటిలైట్‌ను రూపొందించారు. దాదాపు 2400 చదరపు అడుగుల విస్తీర్ణం గల అత్యాధునిక కమ్యూనికేషన్ అరేలు ఇందులో ఉండటం

- మిగతా 2 లో

పేదలపై ప్రత్యక్ష దాడి

నల్ల చట్టాన్ని రద్దు చేసే వరకు పోరు: సోనియా గాంధీ



న్యూదిల్లీ: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజీఎన్ఆర్ఈజీఏ)ను మోదీ ప్రభుత్వం బుల్డోజ్ చేసిందని, ఇది పేదలపై ప్రత్యక్ష దాడి అని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ విమర్శించారు. గ్రామీణ ఉపాధి హామీ ఉద్దేశాన్ని నీరుగార్చేలా తీసుకొచ్చిన నల్ల చట్టాన్ని ప్రతిఘటిస్తామని, దానిని రద్దు చేసేంత వరకు పోరాడతామని ప్రకటించారు. ఈమేరకు ఆమె శనివారం ఒక వీడియో విడుదల చేశారు. దేశ రైతులు, కార్మికులు, భూములు లేని పేదల ప్రయోజనాలపై మోదీ ప్రభుత్వం ప్రత్యక్షంగా దాడి చేసిందని ఆరోపించారు. గత 11 ఏళ్లుగా గ్రామీణ నిరుద్యోగులు, పేదల ప్రయోజనాలను మోదీ సర్కారు విస్మరిస్తోందని దుయ్యబట్టారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చేందుకు యత్నించిందన్నారు. కోవిడ్ సమయంలోనూ పేదలకు జీవనరేఖగా ఎంజీఎన్ఆర్ఈజీఏ ఉన్నట్లు తెలిపారు. ఈ నల్ల చట్టానికి వ్యతిరేకంగా పోరాడేందుకు లక్షల మంది కాంగ్రెస్ కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని సోనియాగాంధీ తెలిపారు. ఎంజీఎన్ఆర్ఈజీఏకు భిన్నంగా కొత్త చట్టాన్ని మోదీ ప్రభుత్వం

- మిగతా 2 లో

స్థానిక పోరుకు గ్రామాభివృద్ధి బాట

- ఎన్నికలకు ముందే సుందరంగా రహదారులు
- రూ.4 వేల కోట్లతో ప్రణాళికలు
- పంచాయతీల వైభవానికి ప్రణాళిక

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న వేళ గ్రామాల్లో కూటమి సర్కార్ అభివృద్ధి బాటలు వేసేందుకు సిద్ధమైంది. వైసీపీ ప్రభుత్వంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన పంచాయతీలకు నూతన వైభవం తీసుకొచ్చే విధంగా ముందుకు సాగుతోంది. ప్రస్తుత పంచాయతీల పాలకవర్గ గడువు వచ్చే ఏడాది ఏప్రిల్ రెండో తేదీతో ముగుస్తున్న నేపథ్యంలో వెనువెంటనే ఎన్నికలు నిర్వహించాలని భావిస్తోంది. అయితే... ఎన్నికల కంటే ముందుగా పంచాయతీల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టారు. పూర్తిస్థాయిలో రహదారుల నిర్మాణానికి అవసరమైన నిధుల సమీకరణ ఇప్పటికే పూర్తయింది. స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ కేపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ (సాస్కి) కింద కొద్ది రోజుల క్రితం కేంద్రం రూ.2,120 కోట్లను మంజూరు చేసింది. ఈ నిధులను గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణానికి వెచ్చించనున్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు మరో రూ.900 కోట్లు, ఉపాధి హామీ పథకం కింద రూ.రెండు వేల కోట్ల వరకు కేంద్రం నుంచి నిధులు వచ్చే అవకాశం ఉంది. ఈ నిధులతో గ్రామాల ముఖ చిత్రం మార్చాలని ప్రభుత్వం భావిస్తోంది. రాబోయే మూడు నెలల్లో అంటే మార్చి నాటికి గ్రామాల్లో అధికశాతం రోడ్ల నిర్మాణాలను పూర్తి చేయాలన్నదే లక్ష్యంగా పెట్టుకుంది. 2024 -25 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి నిధులు రూ.రెండు వేల కోట్లు వెచ్చించి నాలుగు వేల కిలో మీటర్ల మేర రహదారులను నిర్మించారు. 2025 -26లో మరో రూ.రెండు వేల కోట్లతో రోడ్ల నిర్మాణం జరుగుతోంది. పల్లె పండుగ పనులకు సంబంధించి మరో రూ.200 కోట్ల బకాయిలను త్వరలో విడుదల చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. పంచాయతీలను బలోపేతం చేసే లక్ష్యంగా

- మిగతా 2 లో

సంపద సృష్టి సంకల్పం నెరవేరేనా?

- ప్రయత్నాలు ఘనం... ఆచరణ శూన్యం
- అధికారుల్లో కొరవడుతున్న చిత్తశుద్ధి
- కానరాని డంపింగ్ యార్డులు
- గ్రామాలు, పట్టణాల్లో నిర్వహణ దొల్ల
- రహదారులు, ఖాళీ ప్రదేశాల్లో పేరుకుపోతున్న చెత్త

విశాలాంధ్ర - సచివాలయం: మనం పారేసిన చెత్త నుంచి సంపద సృష్టించే స్థాయికి సాంకేతికత దోహదపడుతోంది. కూటమి ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ అధ్వర్యంలో చెత్తశుద్ధికి ప్రాధాన్యతనిస్తూ చెత్త నుంచి సంపదను సృష్టించే దిశలో అడుగులు వేస్తూ ఇందుకోసం వందల కోట్లు ఖర్చు పెడుతుంది. చెత్తను రీసైక్లింగ్ చేస్తూ చెత్త ... సిరి సృష్టించే వ్యవస్థగా మారిస్తే బంగారం లభ్యమౌనట్టు ఉంటుంది. ఇదంతా కేవలం మాటల్లోనే. వాస్తవాలను పరిశీలిస్తే పట్టణాలు, గ్రామాల్లో చెత్త నిర్వహణ సక్రమంగా లేదు. సంపద సృష్టి అంతకన్నా లేదు. వివిధ పంచాయతీల్లో చెత్త నుంచి సందప కేంద్రాలు ఉన్నా నిరుపయోగంగా మారాయి. మెజార్టీ పంచాయతీల్లో చెత్తను శివార్లకు తరలించి దహనం చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో డంపింగ్ యార్డులు కూడా లేవు. చెత్తకు మూల కారణమైన ప్లాస్టిక్ నిషేధంపై చర్యలు లేవు. ప్రజలకు ఇప్పటికీ అవగాహన కరువవడంతో పాటు బాధ్యతా రాహిత్యం కూడా చెత్త సమస్యకు కారణమౌతుంది. ప్రభుత్వ ప్రయత్నం మాత్రం ఘనంగా ఉంది గానీ ఆచరణలో మాత్రం ఫలితాలు రావడం లేదు. దీనికంతటికీ అధికారుల నిర్లక్ష్యమే కారణం. ఆంధ్రప్రదేశను జీరో వేస్ట్-క్లీన్ ఎనర్జీ

- మిగతా 2 లో

నిరుద్యోగ భారతం

- 187 హోంగార్డు ఉద్యోగాలకు 10 వేల అర్జీలు
- పరీక్షా కేంద్రంగా ఎయిర్‌స్ట్రిప్
- డ్రోన్లతో పర్యవేక్షణ : హాజరైన ఎనిమిది వేల మంది
- ఒడిశా సంబల్‌పూర్ జిల్లాలో ఘటన

భువనేశ్వర్: అభివృద్ధి పథంలో దూసుకెళుతూ అనేక కొలువులు సృష్టిస్తున్నట్లు మోదీ ప్రభుత్వం చెప్పుకునే మాటల్లో డొల్లతనం తాజాగా బయటపడింది. డబుల్ ఇంజిన్ పాలనలో రాష్ట్రాలలో పురోగతికి కొదవ ఉండదనే హామీ నీట మూటని స్పష్టమైంది. మోదీ పాలనలో దేశం నిరుద్యోగ భారతంగా మారిందని మరోసారి రుజువు అయింది. ఒడిశాలో 187 హోంగార్డ్ పోస్టులు పడ్డాయి. అయితే ఎనిమిది వేల మంది అభ్యర్థులు వచ్చారు. ఇంత భారీ సంఖ్యలో వచ్చిన నిరుద్యోగులకు పరీక్ష నిర్వహించడం... సాధారణ స్కూళ్లలో సాధ్యం కాదని భావించిన పోలీస్ అధికారులు ఇందుకోసం జమాదర్‌పాలి ఎయిర్‌స్ట్రిప్ రన్‌వేను పరీక్షా కేంద్రంగా మార్చారు. 5వ తరగతి అర్హత ఉన్న ఈ ఉద్యోగాల కోసం బీటెక్, ఎంబీఏలు చదివిన వారు రావడం, రన్‌వేపై కూర్చుని పరీక్ష రాయడం, చర్చనీయాంశంగా మారింది. సంబంధిత చిత్రాలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టాయి. సంబల్‌పూర్ జిల్లాలోని 24 పోలీస్ స్టేషన్ల పరిధిలో ఖాళీగా ఉన్న 187 హోంగార్డు పోస్టుల కోసం సుమారు 10 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. పరీక్షకు ఎనిమిది వేల మందికి పైగా హాజరయ్యారు. జిల్లా కేంద్రంలో 20 పాఠశాలల్లో పరీక్ష పెడితే అభ్యర్థుల రద్దీని నియంత్రించడం కష్టమని భావించి, అధికారులు వినూత్నంగా ఎయిర్‌స్ట్రిప్‌ను పరీక్షకు వేదికగా మార్చారు. అభ్యర్థులందరినీ రన్ వేపై కూర్చోబెట్టిన డ్రోన్ల ద్వారా పరీక్షను పర్యవేక్షించారు. పరీక్ష సమయం 90 నిమిషాలు కాగా... గరిష్ఠ మార్కులు 50గా నిర్ణయించారు. ఐదవ తరగతి ఉంటే సరిపోయే ఈ ఉద్యోగాల కోసం డిగ్రీలు, పీజీలు, పీహెచ్‌డీలు, బీటెక్, ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ చదివిన వారు రావడం గమనార్హం. ఉన్నత విద్యావంతులు అర్హతకు తగిన ఉద్యోగం లభించక, రోజువారీ వేతనంపై పనిచేసే ఉద్యోగం కోసం పోటీ పడటంతో దేశంలో నిరుద్యోగం ఏ స్థాయికి చేరిందో అర్థం చేసుకోవచ్చు. ఒడిశాలో హోంగార్డుకు రోజుకు సుమారు రూ.612 వేతనమిస్తారు. ఇది కాంట్రాక్ట్ ఉద్యోగం. ప్రైవేట్ రంగంలో అవకాశాలు లేక... ప్రభుత్వ ఉద్యోగం ద్వారా లభించే భద్రత కోసం యువత ఈ పోస్టులకు పోటీ పడే పరిస్థితి ఏర్పడిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

గువహతిలో వెంకటేశ్వర ఆలయానికి 25 ఎకరాలు

గువహతి: అసోం రాజధాని గువాహతిలో 10.8 ఎకరాల భూమికి బదులుగా 25 ఎకరాల భూమిని వెంకటేశ్వర స్వామి ఆలయం కోసం కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలిపింది. కామ్రూప్ మెట్రోపాలిటన్ జిల్లాలో 10.8 ఎకరాల భూమిని కేటాయించేందుకు గతంలోనే అంగీకరించింది కానీ ఇప్పుడు దానిని 25 ఎకరాలకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఈనెల 7న రాష్ట్ర ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి కేకే ద్వివేది... టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడుకు లేఖ రాస్తూ కామ్రూప్ మెట్రోపాలిటన్ జిల్లాలో టీటీడీ వెంకటేశ్వర ఆలయం నిర్మిస్తే, అక్కడ ఉన్న ఆలయ ప్రయోజనాలకు భంగం కలగవచ్చని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న సిల్చార్, డిబ్రూగఢ్ నగరాల్లో ఆలయం ఏర్పాటు చేయాలని సూచించారు. సిల్చార్ లేదా డిబ్రూగఢ్ బదులుగా గువహతిలోనే టీటీడీకి 25 ఎకరాల భూమి కేటాయించాలని ఏపీ సీఎం చంద్రబాబు కోరడంతో అసోం ప్రభుత్వం అందుకు అంగీకరించింది. దీంతో ఆంధ్రప్రదేశ్, అసోం ముఖ్యమంత్రులకు టీటీడీ చైర్మన్ కృతజ్ఞతలు తెలిపారు.

చొరబాటుదారులను రక్షిస్తున్న దేశద్రోహులు

కాంగ్రెస్‌పై మోదీ విమర్శలు

గువహతి: కాంగ్రెస్ పార్టీపై ప్రధాని నరేంద్రమోదీ విమర్శలు గుప్పించారు. గువహతి విమానాశ్రయం కొత్త టెర్మినల్‌ను శనివారం ప్రధాని ప్రారంభించారు. అనంతరం మోదీ మాట్లాడుతూ అధికారంలో ఉన్నంత కాలం అసోం సహా ఈశాన్య రాష్ట్రాలను కాంగ్రెస్ నిర్లక్ష్యం చేసిందని, ఈ ప్రాంత భద్రత, గుర్తింపును పణంగా పెట్టి చొరబాటుదారులను రక్షించిందని ఆరోపించారు. ఎన్నికల కమిషన్ ఓటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) చొరబాటుదారులను ప్రజాస్వామ్య ప్రక్రియ నుండి దూరంగా ఉంచడమే లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు. అయితే, దేశద్రోహులు వారిని రక్షించడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. చొరబాట్లను ఆపడానికి కేంద్రం కఠిన చర్యలు తీసుకుంటుందని ప్రధాని అన్నారు. అసోం, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి కాంగ్రెస్ ఎజెండాలో భాగం కాదని ప్రధాని అన్నారు. చొరబాటుదారులు అడవులు, భూమిని ఆక్రమించుకోవడానికి అనుమతించిందని, ఇది భద్రత, గుర్తింపుకు ముప్పు కలిగిస్తుందని ఆయన అన్నారు. ఈ ప్రాంతంలో కాంగ్రెస్ దశాబ్దాలుగా చేసిన తప్పులను బీజేపీ ప్రభుత్వం సరిదిద్దుతోందన్నారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అసోం నిరంతర అభివృద్ధికి సాయపడుతోందని అన్నారు. అసోం, ఈశాన్య భారత అభివృద్ధికి ద్వారంగా పనిచేస్తుందని అన్నారు.

బీజేపీ గూటికి సినీనటి ఆమని

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలుగు సినీనటి ఆమని రాజకీయ రంగప్రవేశం చేశారు. బీజేపీ తెలంగాణ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సమక్షంలో ఆమె శనివారం కాషాయ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆమని మీడియాతో మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయాలన్న లక్ష్యంతోనే రాజకీయాల్లోకి అడుగుపెట్టానన్నారు. ప్రధాని మోదీ నాయకత్వాన్ని ఆమని ప్రశంసించారు. మోదీ ఎన్నో మంచి పనులు చేస్తున్నారని, భారతీయులమని చెప్పుకోవడానికి గర్వంగా ఉందన్నారు. మోదీ అడుగుజాడల్లో నడవాలని కోరుకుంటున్నానన్నారు. సనాతన ధర్మ పరిరక్షణ కోసం మోదీ కృషి చేస్తున్నారని ఆమె వ్యాఖ్యానించారు.

దేశ వ్యతిరేక శక్తులతో చేతులు కలుపుతారా?

రాహుల్ విదేశీ పర్యటనపై బీజేపీ ధ్వజం

న్యూఢిల్లీ: జర్మనీ పర్యటనలో ఉన్న కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ మరో వివాదానికి కారణమయ్యారు. భారతదేశాన్ని అస్థిరపరచాలని భావించే జార్జ్ సోరోస్ సన్నిహితురాలు ప్రొఫెసర్ డాక్టర్ కార్నెలియా వోల్‌ను రాహుల్ కలిశారు. సోరోస్‌కు చెందిన ఓపెన్ సొసైటీ ఫౌండేషన్, సెంట్రల్ యూరోపియన్ యూనివర్సిటీలను ప్రస్తావిస్తూ కాంగ్రెస్ నేతపై బీజేపీ తీవ్ర విమర్శలు చేసింది. రాహుల్ గాంధీ విదేశీ పర్యటనల్లో భారతదేశాన్ని అపఖ్యాతి పాలు చేస్తున్నారని బీజేపీ నేత గౌరవ్ భాటియా శనివారం ఆరోపించారు. రాహుల్ గాంధీ విదేశాల్లో భారత వ్యతిరేక శక్తులతో కలుస్తున్నారని, జాతీయ ప్రయోజనాల వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొంటున్నారని ఆయన ఆరోపించారు. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నప్పుడు రాహుల్ గాంధీ విదేశీ పర్యటనకు వెళ్లారని, ఆయన అక్కడ హెర్టీ స్కూల్‌కు వెళ్లి ప్రొఫెసర్ కార్నెలియా వోల్‌ను కలిశారని, ఇది ఆయన ఎజెండా, ఉద్దేశాలను లేవనెత్తుతోందని భాటియా అన్నారు. రాహుల్ గాంధీ, జార్జ్ సోరోస్ రెండు శరీరాలు... ఒకే ఆత్మ అని, ఇది మరోసారి రుజువైందని అన్నారు. రాహుల్ గాంధీ భారత వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొనడం ఇది మొదటిసారి కాదని ఆయన చెప్పారు. రాహుల్ గాంధీ విదేశాలకు వెళ్లి భారత శత్రువులను, భారత్ అంటే గిట్టని వాళ్లను కలుస్తారని, ఇది ఎలాంటి ఎజెండా? ప్రతిపక్ష నేత అలాంటి శక్తులతో కలుస్తూ దేశానికి వ్యతిరేకంగా కుట్ర పన్నుతున్నాడా అని ఆయన ప్రశ్నించారు.

మెస్సీకి రూ.89 కోట్లు ఇచ్చాం

(మొదటిపేజీ తరువాయి)

రూ.20 కోట్లు ఉన్నట్లు సిట్ అధికారులు గుర్తించారు. ఇవి కోల్‌కతా, హైదరాబాద్ ఈవెంట్ల టికెట్ల అమ్మకాలు, స్పాన్సర్ల నుంచి సేకరించిన మొత్తంగా విచారణ సందర్భంగా దత్తా చెప్పినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈనెల 19న దత్తా ఇంట్లో నిర్వహించిన సోదాల్లో కొన్ని పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మెస్సీ కోల్‌కతాలోని సాల్ట్ లేక్ స్టేడియానికి వచ్చినప్పటి నుంచి ఆ రాష్ట్ర క్రీడా మంత్రి అరూప్ బిస్వాస్ అత్యుత్సాహం ప్రదర్శించడం, మెస్సీ నడుముపై చేయి వేసి ఫొటోలకు పోజులిచ్చిన వీడియోలు వైరల్‌గా మారాయి. పలుకుబడి ఉపయోగించి ఆయన కుటుంబ సభ్యులు, పరిచయస్తులను మెస్సీ దగ్గరకు తీసుకొచ్చినట్లు తెలిసింది. దీనిపై తీవ్ర విమర్శలు రావడంతో అరూప్ తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. మైదానంలో ఉన్నప్పుడు మెస్సీ చికాకు పడ్డారు. అసౌకర్యానికి గురయ్యారు. జనసమూహాన్ని అదుపు చేయాలని పదే పదే చెప్పినా ఫలితం లేకుండా పోయింది. మెస్సీని కొందరు చుట్టుముట్టి, ఆలింగనం చేసుకున్న విధానం ఆమోదయోగ్యం కాదని అని దర్యాప్తు అధికారులకు దత్తా చెప్పినట్లు తెలిసింది.

గ్రౌండ్‌లోకి వచ్చేందుకు 150 పాసులు ఇచ్చినప్పటికీ అంతకుమించి మూడింతల మంది రావడంతో పరిస్థితి చేజారిందని నిర్వాహకులు తెలిపారు. ఇదిలావుంటే, మెస్సీ పర్యటన వేళ కోల్‌కతాలో జరిగిన ఘటనలపై దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. దత్తాను ప్రత్యేక దర్యాప్తు బృందం విచారిస్తోంది. స్టేడియంలోకి రాగానే అనేకమంది తాకడం, కౌగిలించుకోవడంతో మెస్సీ తీవ్రంగా అసౌకర్యానికి గురయ్యారని, నిర్దేశిత సమయానికి ముందే ఆయన అక్కడ నుంచి వెళ్లిపోయారని దర్యాప్తు అధికారులతో దత్తా చెప్పారు. ఈ పర్యటన ఖర్చు, మెస్సీకి చెల్లించిన నగదు వివరాలనూ ఆయన వెల్లడించారు.

భూ సేకరణ చట్టం ఉల్లంఘన

(మొదటిపేజీ తరువాయి)

ఆందోళన వ్యక్తం చేస్తూ ఈనెల 18న పార్లమెంటుకు నివేదిక సమర్పించింది. ఎల్ఏఆర్ఆర్ చట్టంలో గ్రామసభలకున్న ప్రాధాన్యత గుర్తుచేసింది. గ్రామ సభల అనుమతి కాగితాలకే పరిమితమైన సందర్భాలు అనేకమని పార్లమెంటు దృష్టికి తీసుకెళ్లింది. అటవీ హక్కుల చట్టం (ఎఫ్ఆర్ఏ) 2006 నిబంధనలను అతిక్రమించడం ద్వారా అటవీ భూములు సేకరించిన సందర్భాలు కోకొల్లలు అని తెలిపింది. అడవి బిడ్డల భూమి-వనరుల హక్కు పరిరక్షణకు ఎల్ఏఆర్ఆర్ చట్టంతో ఎఫ్ఆర్ఏను ముడిపెట్టాలని సూచించింది. కొన్ని కేసుల్లో సామాజిక ప్రభావం అంచనా (ఎస్ఐఏ), పర్యావరణ ప్రభావం అంచనా (ఈఐఏ) కూడా సేకరణదారులకు అనుకూలంగా ఉంటున్నట్లు వెల్లడించింది. భూమికి న్యాయంగా విలువ కట్టాలని చట్టం సూచిస్తుంటే.... చాలాసార్లు మార్కెట్ విలువ కంటే తక్కువకు సేకరించినట్లు తెలిసిందని పార్లమెంటరీ కమిటీ పేర్కొంది. జాతీయ పర్యవేక్షణ కమిటీ (ఎన్ఎంసీ) పనితీరునూ ప్రశ్నించింది. కెన్-బెట్వా లింక్, పోలవరం వంటి ప్రాజెక్టులపై జరిపే సమీక్షలు సెట్లర్లను సంతృప్తిపర్చలేకపోయాయని వ్యాఖ్యానించింది. వ్యవస్థీకృత యంత్రాంగాలు ఉన్నప్పటికీ భూ సేకరణ, పరిహారం, పునరావాసం, రీసెటిల్మెంట్‌కు సంబంధించిన ఫిర్యాదులు తగ్గడం లేదని, ముఖ్యంగా ఇంటర్-బేసిన్ నదుల అనుసంధాన ప్రాజెక్టుల విషయంలో ఇది సమస్యగా మారిందని కమిటీ నివేదిక తెలిపింది. ఇలాంటి పరిస్థితుల దృష్ట్యా భూ సేకరణ చట్టం అమలు మరింత సమర్థంగా, పారదర్శకంగా, పటిష్ఠంగా ఉండాలని పేర్కొంది.

స్వచ్ఛాంధ్రతోనే స్వర్ణాంధ్ర

(మొదటిపేజీ తరువాయి)

తీసుకువచ్చాం. పొడి, తడి చెత్త వేరు చేయడంపై చాలామందిలో అవగాహన వచ్చిందని పారిశుధ్య కార్మికులు స్వయంగా నాకు చెప్పారు. వ్యర్థాలను వనరుగా, సంపదగా మారుస్తూ సర్క్యులర్ ఎకానమీకి అసలైన అర్థాన్నిచ్చాం. స్వచ్ఛాంధ్ర ఉద్యమంలో పారిశుధ్య కార్మికులే నిజమైన సైనికులు. అందుకే వారి గౌరవం పెరిగేలా, వారి ఆరోగ్యానికి భద్రత కల్పించేలా చర్యలు తీసుకున్నాం. ఈ కార్యక్రమంలో అత్యుత్తమ సేవలు అందించిన వారికి 21 విభాగాల్లో 69 రాష్ట్రస్థాయి, 1,257 జిల్లాస్థాయి స్వచ్ఛాంధ్ర అవార్డులు ఇచ్చాం' అని ముఖ్యమంత్రి చెప్పారు.

ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా ఏపీ

'గత పాలకులు చెత్తపై పన్ను వేయడమే కాకుండా 86 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను మనకు వారసత్వంగా ఇచ్చారు. కూటమి ప్రభుత్వం వచ్చాక చెత్త మొత్తం తొలగించాం. 2026, జూన్ నాటికి ప్లాస్టిక్ రహిత ఏపీ చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు, రీసైక్లింగ్ యూనిట్లు, కంపోస్ట్ తయారీతో ఏ రోజు చెత్త ఆరోజు ప్రాసెస్ చేస్తున్నాం. జనవరి 26 నాటికి రాష్ట్రంలో రోడ్డుపై చెత్త అనేది కనపడకూడదు. ఫిబ్రవరి 15 నాటికి గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రతి ఇంటి దగ్గర చెత్త సేకరించేలా ఏర్పాట్లు చేస్తాం. అక్టోబర్ 26 నాటికి పొడి, తడి చెత్త వేరు చేయడం 100 శాతం పూర్తి కావాలి' అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. 'గ్రామాల్లో 10 లక్షల ఇళ్లల్లో కంపోస్ట్ తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇంటి వ్యర్థాలను కంపోస్ట్‌గా తయారు చేసుకొని కూరగాయలు పండించుకోవచ్చు. వీలైనంత వరకూ కిచెన్ గార్డెన్లు ఏర్పాటు చేసుకోవాలి. వచ్చే ఏడాది అక్టోబర్ 2 తర్వాత ఎక్కడా ప్లాస్టిక్ కనపడకూడదు. ఇంట్లో చెత్త తీసి రోడ్డుపై వేసే అలవాట్లు మానుకోవాలి. అందరిలో సామాజిక స్పృహ రావాలి' అని సీఎం పిలుపునిచ్చారు.

పరిశ్రమల హబ్‌గా అనకాపల్లి

'అనకాపల్లి జిల్లాను పరిశ్రమల హబ్‌గా తీర్చిదిద్దుతున్నాం. ఇప్పటికే పరిశ్రమల కోసం రాంబిల్లి, పూడి, నక్కపల్లి, వల్లూరు, మాకవరపాలెంలో 24,843 ఎకరాలు అభివృద్ధి చేస్తున్నాం. కోడూరు, పరవాడ, అచ్యుతాపురంలో ఎంఎస్ఎంఈ పార్కులు తెస్తున్నాం. జిల్లాలో తొలి ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్క్ నక్కపల్లిలో 93 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటవుతోంది. మహిళలకు ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కోసం 32 ఎకరాలు కేటాయించాం. జిల్లాలో 46 భారీ పరిశ్రమలు నిర్మాణ దశలో ఉన్నాయి. దేశంలోనే రెండో అతిపెద్ద బెల్లం మార్కెట్ ఇక్కడ ఉంది. అనకాపల్లి బెల్లాన్ని ప్రమోట్ చేస్తాం. ఉత్తరాంధ్రలో అన్ని ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తిచేస్తాం. ఇటీవల ఢిల్లీ పర్యటనలో ఉత్తరాంధ్ర అభివృద్ధికి పూర్వోదయ కింద కేంద్రాన్ని నిధులు కోరాం. అరకు కాఫీకి ప్రపంచ గుర్తింపు తెచ్చాం. కేజీ అరకు కాఫీ రూ.10,000కు కొనుగోలు చేశారంటే ఎంత డిమాండ్ ఉందో అర్థం చేసుకోవచ్చు' అని సీఎం అన్నారు.

ప్రపంచమంతా విశాఖ వైపు చూస్తోంది

'కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రపంచమంతా విశాఖ వైపే చూస్తోంది. పోర్టులు, ఎయిర్ పోర్టులు, హైవేలు, అంతర్జాతీయ స్థాయి ప్రాజెక్టులతో ఉత్తరాంధ్ర రూపు రేఖలు మారబోతున్నాయి. ఇటీవల విశాఖలో నిర్వహించిన పెట్టుబడుల సదస్సు ద్వారా రూ.13.26 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించి 610 ఎంవోయూలు కుదిరాయి. వీటి ద్వారా మొత్తం 23 లక్షల ఉద్యోగాలు రానున్నాయి. భాగస్వామ్య సదస్సులో అనకాపల్లి జిల్లాకు సంబంధించి 11 ఎంఓయూలు కుదిరాయి. విశాఖకు గూగుల్ వస్తోంది. ఇప్పటికే కాగ్నిజెంట్ వచ్చింది. టీసీఎస్ సహా అనేక ప్రతిష్ఠాత్మక సంస్థలు ఇక్కడ కార్యకలాపాలు మొదలు పెడుతున్నాయి. ఆర్సెలర్ మిత్తల్ - నిప్పాన్ స్టీల్ లాంటి ప్రపంచస్థాయి సంస్థ జిల్లాలో పెట్టుబడి పెడుతోంది. రూ.1.85 లక్షల కోట్లతో గ్రీన్ ఎనర్జీ సంస్థ ద్వారా 20 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్ట్ ఏర్పాటు చేస్తోంది. టూరిజం, టెక్నాలజీ, నాలెడ్జ్‌కు విశాఖ కేంద్రం కాబోతోంది. ఇప్పటికే రాష్ట్రాన్ని మూడు రీజియన్లుగా అభివృద్ధి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశాం' అని ముఖ్యమంత్రి తెలిపారు.

అమెరికా ఉపగ్రహ ప్రయోగం

(మొదటిపేజీ తరువాయి)

గమనార్హం. భూ కక్ష్యలో ఇప్పటివరకు ప్రయోగించిన వాణిజ్య శాటిలైట్‌లలో ఇదే అతిపెద్ద ప్రయోగంగా నిలవనుంది. ఒకప్పుడు ఇతర దేశాల సహకారంపై ఆధారపడిన భారత అంతరిక్ష కార్యక్రమం నేడు అమెరికా వంటి అగ్రశ్రేణి దేశాల శాటిలైట్లను స్వదేశీ రాకెట్ ద్వారా ప్రయోగించే స్థాయికి ఎదగడం దేశ శాస్త్రీయ శక్తికి స్పష్టమైన నిదర్శనంగా నిలుస్తోంది. ఈ మిషన్ ద్వారా అంతర్జాతీయ వాణిజ్య అంతరిక్ష రంగంలో భారత్ విశ్వసనీయత మరింత పెరిగి ప్రపంచంలో భారత స్థానం మరింత బలపడనుంది.

స్థానిక పోరుకు 'గ్రామాభివృద్ధి' బాట

(మొదటిపేజీ తరువాయి)

ఉప ముఖ్యమంత్రి విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చారు. గతంలో పంచాయతీల్లో ఇంటి పన్ను వసూళ్లు, తదితర లావాదేవీలు అన్నీ మాన్యువల్ వ్యవస్థలో ఉండేవి. దీనివల్ల అవినీతికి ఆస్కారం ఏర్పడటంతో పాటు ప్రజలకూ తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి ఉండేది. ఇటీవల స్వర్ణ పంచాయతీ పోర్టల్ అందుబాటులోకి తీసుకురావడంతో అవినీతికి చెక్ పడనుంది. కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకే పరిమితమైన ఆన్‌లైన్ వ్యవస్థను గ్రామాల్లోకి అందుబాటులోకి తీసుకువచ్చారు. ఇంటి పన్నులు, ఖాళీ స్థలాల పన్నులు, లేఔట్‌ల అభివృద్ధి చార్జీలు వంటి వాటిని ఆన్‌లైన్ ద్వారా చెల్లించే వెసులుబాటు ఈ పోర్టల్ ద్వారా జరుగుతున్నాయి. గతంలో ఒకే కార్యదర్శి మూడు, నాలుగు పంచాయతీల బాధ్యతలను నిర్వర్తించేవారు. దీంతో పంచాయతీల్లో పాలన ఇబ్బందికరంగా ఉండేది. పంచాయతీల పాలనను మరింత మెరుగుపర్చేందుకు వాటిని రీగ్రూపింగ్ చేయడంపై పవన్ కల్యాణ్ ప్రత్యేక దృష్టి పెట్టారు. అందులో భాగంగా పంచాయతీలను నాలుగు గ్రేడ్లుగా విభజించి ప్రతి పంచాయతీకి ప్రత్యేక కార్యదర్శి స్థాయి అధికారిని నియమించాలని నిర్ణయించారు. డివిజన్ స్థాయిలోనూ పంచాయతీరాజ్ వ్యవస్థను మెరుగుపర్చేందుకు డివిజన్ డెవలప్‌మెంట్ ఆఫీసులను(డీడీవో) ప్రారంభించారు. ఒకేసారి 10 వేలమంది పంచాయతీరాజ్ సిబ్బందికి పదోన్నతులు కల్పించారు. డీడీవోలను మినీ కలెక్టరేట్లుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో పవన్ కల్యాణ్ ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 13,390 పంచాయతీల్లో ఒకేసారి గ్రామసభలు నిర్వహించడం ద్వారా ప్రపంచ రికార్డును నెలకొల్పిన పవన్ ... గాడి తప్పిన పంచాయతీ పాలనను గాడిలో పెడుతున్నారు. తద్వారా రాబోయే పంచాయతీ ఎన్నికల్లో కూటమి గెలుపునకు బాటలు వేయడానికి వ్యూహాత్మక అడుగులు వేస్తున్నారు.

పేదలపై ప్రత్యక్ష దాడి

(మొదటిపేజీ తరువాయి)

తీసుకొచ్చింది. పూర్వం కేంద్రమే పూర్తిగా నిధులు సమకూర్చాల్సి ఉండేది కానీ కొత్త బిల్లు ప్రకారం కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు వాటా పంచుకోవాల్సి ఉంటుంది. కొత్త చట్టంలో మరిన్ని కీలక మార్పులు జరిగాయి. ఇదే క్రమంలో సోనియా గాంధీ మాట్లాడుతూ 20 ఏళ్ల కిందట పార్లమెంటులో ఎంజీఎన్ఆర్ఈజీఏను ఆమోదించిన రోజు ఇప్పటికీ గుర్తుందని, అప్పట్లో మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నారని అన్నారు. అణగారిన వర్గాలకు, శ్రమ దోపిడీకి గురయ్యే వారికి, ముఖ్యంగా పేదలకు జీవనోపాధి కల్పించే దిశగా అదొక విప్లవాత్మక అడుగని ఎంజీఎన్ఆర్ఈజీఏను వర్ణించారు. ఉపాధి హామీ చట్టం అమల్లోకి వచ్చాక పని కోసం వలసలు తగ్గాయని అన్నారు. ఉపాధి పొందడం న్యాయమైన హక్కుగా మారిందని, తద్వారా గ్రామ పంచాయతీలు సాధికారత సాధించగలిగాయని తెలిపారు. మహాత్మా గాంధీ 'గ్రామ స్వరాజ్' విజన్ ఆధారంగా భారత్ కల నెరవేర్చే దిశగా ఎంజీఎన్ఆర్ఈజీఏ ద్వారా పటిష్ఠ ముందడుగు పడింది కానీ, మోదీ ప్రభుత్వం దానిని నిర్వీర్యం చేసిందని సోనియా గాంధీ విమర్శించారు. మహాత్మాగాంధీ పేరు తొలగించడమే కాదు, చట్టం స్వరూపాన్నే మార్చి వేశారని ఆమె ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ మార్పులపై సర్కారు ఎవరితో సర్కారులు చర్చించలేదు... ప్రతిపక్ష సభ్యుల సలహాలు, సూచనలు కోరలేదని తెలిపారు. ఓ మంచి ఉద్దేశంతో తెచ్చిన చట్టాన్ని మోదీ ప్రభుత్వం ఏకపక్షంగా నీరుగార్చిందని సోనియా గాంధీ విమర్శించారు. ఎంజీఎన్ఆర్ఈజీఏ ఎప్పుడు కూడా పార్టీకి సంబంధించినది కాదని, ప్రజా ప్రయోజనాల కోసం రూపొందిందని, 20 ఏళ్ల కిందట ఉపాధి హామీ కోసం పాటుపడ్డాను... ఇప్పుడూ నల్ల చట్టానికి వ్యతిరేక పోరాటానికి కట్టుబడి ఉన్నాను అని సోనియా గాంధీ ప్రకటించారు. కాగా, పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో ఆమోదించిన వీజీ ఆర్ఏఎం జీ బిల్లు (వికసిత్ భారత్ రోజ్‌గార్, అజీవిక మిషన్ (గ్రామీణ))ను రాష్ట్రపతి ఆమోదిస్తే అది చట్టమవుతుంది. కొత్త బిల్లును వ్యతిరేకించే క్రమంలో ఏ విధంగా ముందుకెళ్లాలనే దానిపై నిర్ణయించేందుకుగాను కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) ఈనెల 27న సమావేశం కాబోతోందని కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి.

ఎప్‌స్టీన్ సంచలనం

(మొదటిపేజీ తరువాయి)



చాలామంది వైద్యులు ఈ సహజ వైద్య వ్యవస్థ ఆధారంగా మసాజ్, ఇతర చికిత్సలు అందిస్తున్నారని ఫైళ్లు చెబుతున్నాయి. 'ది ఆర్ట్ ఆఫ్ గివింగ్ మసాజ్' అనే శీర్షికతో కథనాలు ఇందులో ఉన్నాయి. వాస్తవానికి ఈ కేసులో జెఫ్రీ ఎప్‌స్టీన్, అతని భాగస్వామి ఘిస్లైన్ మాక్స్‌వెల్ ప్రధాన నిందితులు. 2002-05 మధ్య జరిగిన సెక్స్ కుంభకోణంలో అనేకమంది యువతులకు డబ్బు ఎర వేసి జెఫ్రీ లైంగిక దాడులు చేయడమే కాకుండా, అమెరికా ప్రముఖులకు మైనర్ అమ్మాయిలను సరఫరా చేసినట్లు ఆరోపణలున్నాయి. దీనిపై బాధితుల్లో ఒకరైన వర్జీనియా గియుఫ్రే 2015లో సివిల్ దావా వేయడంతో ఈ పత్రాలు వెలుగులోకి వచ్చాయి. ఈ ఫైళ్లలో అమెరికా రాజకీయ నాయకుల నుంచి ప్రముఖ వ్యాపారవేత్తల పేర్లు ఉన్నాయి.

ఎప్‌స్టీన్ సెక్స్ ట్రాఫికింగ్‌కు అనేకమంది సహకరించినట్లు ఈ ఫైల్స్ పేర్కొన్నాయి. యుక్త వయస్సు బాలికలను ఈ దందాలోకి ఎప్‌స్టీన్ ఏ విధంగా దించారనే వివరాలు అందులో ఉన్నట్లు తెలుస్తోంది. 2019, జులైలో ఎప్‌స్టీన్‌పై సెక్స్ ట్రాఫికింగ్ అభియోగాలు మోపారు. అతడు విచారణకు ముందే మాన్‌హటన్ జైలులో ఆత్మహత్య చేసుకున్నాడు. సెక్స్ ట్రాఫికింగ్ కేసులో మాక్స్‌వెల్ 20 ఏళ్ల శిక్ష అనుభవిస్తున్నాడు.

సంపద సృష్టి సంకల్పం నెరవేరేనా?

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రంగా మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వం పక్కా ప్రణాళికతో అడుగులు వేస్తోంది. ఘన వ్యర్థాల నిర్వహణ, విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడానికి ప్రభుత్వం వ్యర్థాల నుంచి ఇంధనం తయారీ ప్రాజెక్టులను వేగవంతం చేస్తోంది. అందులో భాగంగా రాష్ట్రంలో కొత్తగా ఆరు వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లను ఏర్పాటు చేయనుంది. నెల్లూరు, రాజమండ్రి, కర్నూల్, వైయస్ఆర్ కడప, విజయవాడ, తిరుపతి పట్టణాల్లో నెలకొల్పడానికి చర్యలు తీసుకుంటున్నారు. నెల్లూరులో 12 మెగావాట్ల విద్యుత్ ఉత్పతి లక్ష్యంగా వేస్టు ఎనర్జీ ప్లాంట్ ను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. రాజమండ్రిలో 15 మెగావాట్లు, కర్నూలులో 15 మెగావాట్లు, కడపలో 15 మెగావాట్లు, విజయవాడలో 15 మెగావాట్లు, తిరుపతిలో 12 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా ప్రతిపాదించారు. వీటి నిర్మాణానికి సంబంధించి ఇప్పటికీ కొన్ని ప్రాజెక్టులకు టెండర్లు కూడా పిలిచారు. మరికొన్నింటికి టెండర్లు ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియ అంతటా ముగిసిన తర్వాత పనులు ప్రారంభించి, 2027 కల్లా పూర్తి చేసి, వినియోగంలోకి తేవాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉంది. ఆ తర్వాత మరికొన్ని జిల్లాలకు కూడా ఈ తరహా ఎనర్జీ ప్లాంట్లను విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోంది. అయితే రాష్ట్రంలో ఘన వ్యర్థాల నిర్వహణ మెరుగుపర్చడంతో పాటు విద్యుత్ ఉత్పత్తి చేస్తూ సంపద సృష్టి లక్ష్యానికి చేరుకున్నారు. ఇందుకుగాను ప్రభుత్వం రాష్ట్రంలో ప్రాథమికంగా రెండు చోట్ల వేస్టు ఎనర్జీ ప్లాంట్లు నెలకొల్పింది. ఈ రెండు చోట్ల ఎంతో సమర్థవంతంగా చెత్త వ్యర్థాలను ఉపయోగించి, పెద్ద ఎత్తున విద్యుత్ ఉత్పత్తి తయారు చేస్తూ ముందు కుపోతున్నారు. ఈ రెండు ప్లాంట్లలో ఒకటి విశాఖపట్నంలోను, మరొకటి గుంటూరులో ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేశారు. ఈ రెండు చోట్ల ఏర్పాటు చేసిన ప్లాంట్లు ఎంతో సమర్థవంతంగా విజయవంతంగా పని చేస్తుండడంతో ప్రభుత్వం వీటి విస్తరణకు పక్కా ప్రణాళికలు రూపొందిస్తుంది. ఇదిలా ఉండగా... రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అనేక పంచాయతీలలో చెత్తను డంప్ చేయడానికి ఖాళీ స్థలాలు లేవు. అనేకచోట్ల లేఅవుట్లలోని కామన్ సైట్లు, కాలువగట్లు, శ్మశానవాటిక పరిసర ప్రాంతాలలో డంప్ చేస్తున్నారు. ఈసమస్యను గుర్తించిన ఉన్నతాధికారులు మేజర్ పంచాయతీలకు స్థలాలను కేటాయించారు. అయినప్పటికీ స్థానిక అధికారులు వాటిని సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. డంపింగ్ యార్డులను కేటాయించిన పంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలో కూడా రహదారుల పక్కన, ఖాళీ ప్రదేశాలు, కాలువలు, నదులలో చెత్త, వ్యర్థాలను డంప్ చేస్తూ పర్యావరణం, వాతావరణ కాలుష్యానికి కారకులవుతున్నారు. నిత్యం పారిశుధ్య డ్రైవ్స్ నిర్వహించి రహదారుల వెంబడి, ఖాళీ ప్రదేశాలలో డంప్ చేస్తున్న చెత్తను తొలగించి ఆయా ప్రాంతాల్లో చెత్త డంప్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

ఫలితంగా రహదారులు, కోట్లాది రూపాయలు విలువ చేసే ఖాళీ స్థలాలు వ్యర్థాలమయమవుతున్నాయి. నిత్యం మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు ప్రయాణించే అమరావతి రాజధాని రహదారుల వెంబడి చెత్త డంపింగ్ యార్డులు దర్శనమివ్వడం దీనికి నిదర్శనం. విజయవాడ నగరం, పరిసరప్రాంతాలు, కృష్ణానది తీరంలో చెత్త, వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. ప్రజారోగ్యంతో పాటు పర్యావరణానికి ముప్పు ఏర్పడుతుందనడంలో ఎలాంటి సందేహం ఉండదు. జనాభా పెరుగుదలతో పాటు వ్యర్థాలు కూడా పెరుగుతూనే ఉంటాయి. చెత్తసేకరణ, నిర్వహణపై అధికారులు దృష్టి పెట్టకుంటే ప్రభుత్వ ఆశయం నీరుగారుతుంది.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ సరికాదు

ఆర్ఎస్పీ నేత జానకిరాములు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): ప్రభుత్వ మెడికల్ కాలేజీలను పీపీపీ పద్ధతిలో ప్రైవేటుకు కట్టబెట్టడం ప్రజల ఆరోగ్య హక్కుపై ప్రత్యక్ష దాడి చేయడమేనని రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ(ఆర్ఎస్పీ) రాష్ట్ర కార్యదర్శి జె.జానకిరాములు విమర్శించారు. విజయవాడ గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జానకిరాములు మాట్లాడుతూ వైద్య సీట్లకు సంబంధించి జగన్ ప్రభుత్వం తెచ్చిన 107, 108 జీవోలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ జీవోలపై నాడు చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ నాడు పదేపదే విమర్శలు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. తాజాగా కూటమి ప్రభుత్వం 590 జీవో ద్వారా వైద్య కళాశాలలను ప్రైవేటుకు కట్టబెడుతోందని జానకిరాములు విమర్శించారు. ఆర్టికల్ 21 ప్రకారం ప్రజలకు జీవించే హక్కును రాష్ట్ర ప్రభుత్వం కాలరాస్తోందన్నారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై మాట్లాడితే బెదిరింపులకు దిగుతోందన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను తమ పార్టీ పూర్తిగా వ్యతిరేకిస్తోందని స్పష్టంచేశారు. 17 వైద్య కళాశాలలను ప్రభుత్వ ఆధీనంలోనే నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రగతిశీల విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, ఆర్‌వైఎఫ్ రాష్ట్ర కన్వీనర్ ఓబులేసు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది పేద, దళిత, గిరిజన, బీసీ, మైనారిటీ విద్యార్థులకు సంబంధించిన రూ.6,500 కోట్ల ఫీజురీయింబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బకాయిలు విడుదల చేయకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని చెప్పారు. ఆర్ఎస్పీ నాయకులు తిమ్మక్క ప్రేమ్, శ్రీనివాసులు, నరేంద్ర, హరి తదితరులు పాల్గొన్నారు.

విట్ ఏపీ వర్సిటీలో నూతన జెన్ జీ తపాలా కార్యాలయం

ప్రారంభించిన కేంద్ర మంత్రి పెమ్మసాని

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: భారతదేశం అంతటా విద్యాలయాల్లో ఉన్న తపాలా కార్యాలయాలను విద్యార్థుల అభిరుచికి అనుగుణంగా ఆధునికీకరించే క్రమంలో విట్ ఏపీ విశ్వవిద్యాలయంలోని అధునాతన తపాలా కార్యాలయాన్ని కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని విట్ జెన్ జీ పోస్ట్ ఆఫీస్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ అనే కాన్సెప్ట్‌తో ఒక ప్రత్యేక తపాలా కవరును కూడా ఆవిష్కరించారు. అనంతరం పెమ్మసాని మాట్లాడుతూ యువతరం అభిరుచులకు అనుగుణంగా తపాలా శాఖ తన రూపు రేఖలను, సేవలను మార్చుకుంటోందని, ఇందులో భాగంగా అంకిత భావాన్ని ప్రదర్శిస్తూ, తపాలా కార్యాలయాలను ఆధునీకరిస్తోందని తెలిపారు. నూతన జెన్ జెడ్ తపాలా కార్యాలయంలో అందించే సేవలను అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, ఆంధ్ర ప్రదేశ్ సర్కిల్ ముఖ్య పోస్ట్ మాస్టర్ జనరల్ బి.పి.శ్రీదేవి, విట్ వర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ పి.అరుళ్మోళివర్మన్, గుంటూరు జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా, వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ చంద్ర ముదిగంటి, విజయవాడ రీజియన్ పోస్ట్‌మాస్టర్ జనరల్ డాక్టర్ వెన్నం ఉపేందర్, ఆంధ్ర ప్రదేశ్ సర్కిల్ జనరల్ మేనేజర్ (ఫైనాన్స్) కె.వినోద్ కుమార్ పాల్గొన్నారు.

వ్యాకరణ దిగ్గజం చిన్నయ సూరి

జయంతి సభలో వక్తలు

విశాలాంధ్ర-విశాఖపట్టణం: వ్యాకరణ దిగ్గజం పరవస్తు చిన్నయ సూరి అని, వ్యాకరణ పండితుడు, సాహితీ సంపన్నుడని వక్తలు కొనియాడారు. ఆంధ్ర విశ్వకళా పరిషత్ తెలుగు శాఖ సమావేశ మందిరంలో శనివారం చిన్నయసూరి జయంతి ఘనంగా జరిగింది. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహాచారి, తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు ఈ సందర్భంగా చిన్నయసూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు అధ్యక్షత వహించిన తెలుగు శాఖాధిపతి జర్రా అప్పారావు వ్యాకరణం గొప్పదనం గురించి వివరించారు. లోకానికి సూర్యునికి ఎలా అలంకరణో, భాషకు అలంకరణ వ్యాకరణం అని తెలిపారు. గొప్ప వ్యాకరణం రాయడంలో చిన్నయసూరిని మించినవారు లేరని అన్నారు. తెలుగు వ్యాకరణాల్లో బాల వ్యాకరణం నేటికీ ఏకఛత్రాధిపత్యం వహిస్తోందని తెలిపారు. 'పద్యానికి నన్నయ... గద్యానికి చిన్నయ' అని ప్రశంసించారు. ఇలాంటి గొప్ప వ్యాకరణవేత్త గురించిన జయంతిని తెలుగు శాఖలో జరపడం గొప్ప విశేషమని అన్నారు. ఆచార్య ఎ.నరసింహారావు మాట్లాడుతూ భాష గొప్పదనం తెలియాలంటే బాల వ్యాకరణంను, అలాగే నీతిచంద్రికను ప్రతి విద్యార్థి చదవాలని సూచించారు. చిన్నయ సూరి వ్యాకరణ పండితుడు, సాహితీ సంపన్నుడని ప్రశంసించారు. ఆచార్య గజ్జా యోహాన్ బాబు మాట్లాడుతూ చిన్నయసూరి ఆధునిక తెలుగు వ్యాకర్తలందరిలో గొప్పవాడని, నేటి వ్యాకరణాలన్నిటికీ బాల వ్యాకరణం ఆదర్శంగా నిలుస్తుందని చెప్పారు. డాక్టర్ డి.ప్రవీణ మాట్లాడుతూ చిన్నయసూరి జీవితం స్ఫూర్తిదాయకమని, ఆయన జీవితంలో అనుభవించిన కష్టాలను, ఆయన సాధించిన ఉన్నతిని, సూరి అనే బిరుదు ఎలా వచ్చిందో వివరించారు. చిన్నయసూరి తల్లిదండ్రులు బహుభాషా కోవిదులని, అందువల్ల ఆ పాండిత్యం అబ్బిందని తెలిపారు. డాక్టర్ దామెర వేంకట సూర్యారావు మాట్లాడుతూ నీతిచంద్రికలో ప్రతి కథ సందేశాత్మకంగా ఉంటుందని చెబుతూ, అందులో సూరి చెప్పిన మిత్రలాభం, మిత్రభేదం గురించి విశ్లేషించారు. ఆధునిక సాహిత్యంలో నీతిచంద్రిక అనే గ్రంథం వచనానికి పెద్ద పీట వేసింది. నీతిచంద్రికలో చిన్నయసూరి పక్షులు, జంతువుల పేర్లతో మానవ మనస్తత్వాన్ని తన కథల్లో చిత్రీకరించడానికి ప్రయత్నం చేసిన మహనీయుడు సూరి అని తెలిపారు. ఆచార్య వెలమల సిమ్మన్న మాట్లాడుతూ జీవితాన్ని వ్యాకరణం కోసం త్యాగం చేసిన వ్యాకరణ దిగ్గజం పరవస్తు చిన్నయసూరి అని అన్నారు. వ్యాకరణ బోధనా విషయంలో తీవ్ర మార్పులు జరగవలసిన అవసరం ఉందని, ఎందుకంటే వ్యాకరణాన్ని కావ్యాలులాగా, ప్రబంధంలాగా, పురాణంలాగా బోధిస్తున్నారని తెలిపారు. ఈ పద్ధతి మంచిది కాదన్నారు. ఎక్కువ మంది అధ్యాపకులు శాస్త్రీయ పద్ధతిలో వ్యాకరణాన్ని బోధించకపోవడం వల్ల విద్యార్థులకు వ్యాకరణం అర్థం కావడం లేదని అన్నారు. ఈరోజుకీ తెలుగు వ్యాకరణాల్లో చిన్నయసూరి పెద్దరికం కొనసాగుతుందంటే బాల వ్యాకరణం ఎంత విశిష్టమైందో మనకు అర్థమవుతుందని చెప్పారు. వ్యాకరణాచార్యులు చిన్నయసూరి అని ఆచార్య సిమ్మన్న అన్నారు. ప్రథమ సంవత్సర విద్యార్థి పి.ఇస్లాం ఆహ్వానంతో ప్రారంభమైన ఈ కార్యక్రమం జె.పవన్ కల్యాణ్ వందన సమర్పణతో ముగిసింది. ఈ కార్యక్రమంలో తెలుగు శాఖ అధ్యాపకులు డా. ఎం.కృష్ణవేణి, డా. ఎం.దాసు, డా.బి.సూర్యనారాయణ, డా.ఎం.ప్రతాప్, డా.పి.శ్రీనివాసరావు, డా.ఎల్.గిరీష్ కుమార్, డా.ఆర్.శివయ్య, డా.పితానిప్రసాద్, గంట్ల శ్రీనుబాబు, సాహితీవేత్తలు, పుర ప్రముఖులు, భాషాభిమానులు, పరిశోధకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సీపీఐ వందేళ్ల పండుగను

జయప్రదం చేద్దాం

తాటిపాక మధు పిలుపు

విశాలాంధ్ర- కాకినాడ: సీపీఐ వందేళ్ల పండుగ ముగింపు సందర్భంగా జనవరి 18న ఖమ్మంలో జరిగే బహిరంగ సభ, జనసేవాదళ్ కవాతును జయప్రదం చేయాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తాటిపాక మధు పిలుపునిచ్చారు. బహిరంగ సభకు కాకినాడ జిల్లా నుండి విద్యార్థులు, యువజనలు, కార్మికులు, కర్షకులు భారీ ఎత్తున తరలి రావాలని కోరారు. చలో ఖమ్మం పేరుతో శనివారం స్థానిక పొన్నామండ రామచంద్రరావు పీఆర్ భవన్‌లో కరపత్రాలను తాటిపాక మధు ఆవిష్కరించారు. అనంతరం మధు మాట్లాడుతూ డిసెంబర్ 20 నుండి 26 వరకు వాడవాడలా సీపీఐ జెండావిష్కరణలు, ప్రదర్శనలు, ఉత్సవాలు జరుగుతున్నాయన్నారు. 2026 పార్టీ సభ్యత్వ పునరుద్ధరణను వేగవంతం చేయాలని కోరారు. సీపీఐ శత వార్షికోత్సవ ముగింపు బహిరంగ సభ ఈనెల 27న సామర్లకోటలో జరగనుందని, దీనికి కాకినాడ జిల్లాలో ఉన్న అన్ని వర్గాల ప్రజలు హాజరై జయప్రదం చేయాలని మధు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఇంటింటి ప్రచారం చేయాలని మధు పిలుపునిచ్చారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో మహాత్మాగాంధీ పేరు మార్చడమే కాకుండా పేదలకు నష్టం జరిగేలా మార్గదర్శకాలు రూపొందించిన మోదీ సర్కారుపై ఆయన నిప్పులు చెరిగారు. ప్రధాని మోదీ నిరంకుశ, ఏకపక్ష విధానాలను ప్రజలకు వివరించాలన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై విద్యార్థి యువజన సంఘాలను కలుపుకొని... విద్యాలయాల్లో సెమినార్లు, ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని మధు కోరారు. కాకినాడ జిల్లా కార్యదర్శి కె.బోడకొండ, సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు శాఖ రామకృష్ణ, పప్పు ఆదినారాయణ, బొబ్బిలి శ్రీనివాస్, జిల్లా నాయకులు ఆనందరావు, కిషోర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి: నాసర్ జీ

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: రాష్ట్రవ్యాప్తంగా విద్యా రంగంలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జీ డిమాండ్ చేశారు. సీపీఐ కార్యాలయంలో శనివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం అధికారంలోకి వస్తే పేద విద్యార్థుల కష్టాలు తీరుస్తామని ఎన్నికల సమయంలో చెప్పిన నారా లోకేశ్... అధికారం చేపట్టి విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నా... విద్యార్థులకు ఇచ్చిన హామీ ఏ ఒక్కటి అమలు చేయలేదని మండిపడ్డారు. 90 రోజుల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.6,400 కోట్లు విడుదల చేస్తామని హామీ ఇచ్చిన లోకేశ్... ఏడాదిన్నర పాలన పూర్తవుతున్నా... కేవలం హామీగానే మిగిలిపోయిందన్నారు. నాడు జగన్ ప్రభుత్వం... వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేసిందని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు గగ్గోలు పెట్టిన లోకేశ్, చంద్రబాబునాయుడు... నేడు అధికారంలోకి వచ్చి... మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణ చేస్తున్నామని ప్రకటించడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని ధ్వజమెత్తారు. పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ వసతి గృహాలలో నాణ్యమైన వసతులు, ఆహారం లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విద్యార్థులకు సరిపడ గదులు... బాత్రూములు లేవన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ , కాస్మోటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. ఉన్నత విద్యను దూరం చేసే విధంగా ఉన్న జీవో 77ను అధికారంలోకి వస్తే వందరోజుల్లో రద్దు చేస్తామని హామీ ఇచ్చి ఎందుకు రద్దు చేయలేదని నిలదీశారు. రాష్ట్రవ్యాప్తంగా కళాశాలలు, విశ్వవిద్యాలయాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక, ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేయాలని అన్నారు. విద్యార్థులతో పెట్టుకుంటే ప్రభుత్వాలు కూలిపోయిన చరిత్ర ఉందని గుర్తు చేశారు. గత వైసీపీ ప్రభుత్వం కూలిపోవడానికి విద్యార్థులు , నిరుద్యోగులు ప్రధాన పాత్ర వహించారని, కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలు విడనాడకుంటే ప్రభుత్వం మనజాలడం కష్టమని, రానున్న రోజుల్లో విద్యార్థులను సమీకరించి సమరశీల పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఏఐఎస్ఎఫ్, జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్, అమర్నాథ్, గణేష్, ప్రకాష్, సూర్య పాల్గొన్నారు.

గాంధీ పేరు తొలగింపుపై

చంద్రబాబు మౌనం బాధాకరం

- పేదల కడుపు కొట్టేందుకు ప్రభుత్వాల కుట్ర
- 'ఉపాధి'ని యథావిధిగా కొనసాగించాలి: జగదీశ్

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం: జాతీయ ఉపాధి హామీ పథకాన్ని పేరు మార్చి పేదల కడుపు కొట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర చేస్తున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డి.జగదీశ్ విమర్శించారు. 'ఉపాధి హామీ'ని యథావిధిగా కొనసాగించాలని, ఈ విషయంలో అఖిలపక్ష బృందాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శనివారం మీడియా సమావేశంలో జగదీశ్ మాట్లాడుతూ ఉపాధి హామీకి ప్రతి ఏడాది కేంద్రం రూ.ఎనిమిది వేల కోట్లు రాష్ట్రానికి కేటాయించేదని, ఆ నిధులను పక్కదారి పట్టించేందుకు ప్రభుత్వాలు ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు. కూలీల జీవనాధారాన్ని దెబ్బతీసే కుట్ర జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో రాష్ట్ర వాటాగా రూ.200 కోట్లు చెల్లించిన ప్రభుత్వం, ఇప్పుడు ఒక్కసారిగా రూ.3,200 కోట్లు చెల్లించాలని కేంద్రం మెలిక పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మహాత్మా గాంధీ పేరు తొలగింపుపై ముఖ్యమంత్రి చంద్రబాబు మౌనం వహించడం బాధాకరమన్నారు. ఈ విషయమై ప్రతిపక్ష నేత జగన్ స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అరటి, మొక్కజొన్న, పప్పు, సెనగ, వరి పంటల ధరలు పడిపోతున్న సమయంలో దిగుమతులు కొనసాగించడం రైతులను మరింత నష్టపరిచే చర్య అని విమర్శించారు. ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని, లేదంటే రైతులు క్రాప్ హాలిడే ప్రకటించే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి మాట్లాడుతూ ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ... ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు. స్త్రీనిధి పథకం ద్వారా మహిళలను ఆదుకోవాలని, ఇప్పటివరకు ఎంతమందికి ఉద్యోగాలు కల్పించారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మల్లికార్జున, రాజారెడ్డి, గోపాల్, నరసింహులు, ఓంకార్, రామాంజనేయులు పాల్గొన్నారు.

ఉపాధి పథకం రద్దుకు కేంద్రం కుట్ర

ఆవుల శేఖర్ విమర్శ

విశాలాంధ్ర-పత్తికొండ: ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తే సహించేది లేదని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ అన్నారు. కర్నూలు జిల్లా పత్తికొండ చదువుల రామయ్య భవనంలో వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ సమావేశం వెంకటరామిరెడ్డి అధ్యక్షతన శనివారం జరిగింది. ఆవుల శేఖర్ మాట్లాడుతూ దేశ ఆర్థికాభివృద్ధిలో ఉపాధి హామీ చట్టం, వ్యవసాయ కార్మికులదే ప్రధానపాత్ర అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో వలసలు నివారించాలనే ఉద్దేశంతో యూపీఏ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టం తీసుకొచ్చిందని, ఈ చట్టం రావడానికి వామపక్షాలే ప్రధాన కారణమన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మహాత్మాగాంధీ పేరును మోదీ సర్కారు తొలగించి...జి రామ్ జి అంటూ కొత్త చట్టం తీసుకురావడం దుర్మార్గమన్నారు. పథకాలకు పేరు మార్చడమే బీజేపీ ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోందన్నారు. మోదీ సర్కారు తీసుకొచ్చే కొత్త చట్టం వలన ఉపాధి హామీ కూలీలకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. భవిష్యత్తులో ఈ పథకాన్ని రద్దు చేయడానికి కేంద్రం కుట్ర చేస్తోందని విమర్శించారు. పథకంలో మహాత్మాగాంధీ పేరు మార్పుపై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ నోరు మెదపకపోవడం దుర్మార్గమన్నారు. కర్నూలు జిల్లాలో ఉపాధి హామీ కూలీలకు 8 వారాల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకం రద్దుపై వామపక్ష పార్టీలతో కలిసి వ్యవసాయ కార్మిక సంఘాలు ఈనెల 22వ తేదీన పెద్దఎత్తున ఆందోళనలు చేపడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నబీ రసూల్, వర్కింగ్ ప్రెసిడెంట్ భూపేష్, సీపీఐ మండల కార్యదర్శి యు.కారుమంచి, తుగ్గలి మండల కార్యదర్శి సుల్తాన్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నాగరాజు, నెట్టికంటయ్య, కోదండ, బాబా, సోమేశ్ రెడ్డి, ఉరుకుందు, శేషు కుమార్, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల పక్షాన పోరాడేది ఎర్రజెండానే

నందిగామలో సీపీఐ శత వార్షిక ఉత్సవాల బైక్ ర్యాలీ

విశాలాంధ్ర-నందిగామ: దేశంలో రైతులు, కార్మికులు, పేదలు, సామాన్య ప్రజల పక్షాన నిరంతరం పోరాడేది కేవలం ఎర్రజెండా మాత్రమేనని సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) శత వార్షిక వేడుకలను పురస్కరించుకుని నందిగామలో సీపీఐ అధ్వర్యంలో శనివారం బైక్ ర్యాలీని ఘనంగా నిర్వహించారు. తొలుత నందిగామ రైతుపేట చంద్ర రాజేశ్వరరావు భవన్ వద్ద పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి... అమరజీవి సూర్యదేవర నాగేశ్వరరావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ జెండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభించారు. రైతుపేట, సీఎం రోడ్, మునిసిపల్ ఆఫీస్, గాంధీ సెంటర్, మెయిన్ బజారు, రథం సెంటర్ పాత బస్టాండ్, మయూరి టాకీస్ మీదుగా ర్యాలీ కొనసాగింది. గాంధీ సెంటర్‌లో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పరుచూరి రాజేంద్రబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దోనేపూడి శంకర్ మాట్లాడుతూ దేశంలో పేదలు, కార్మికులు, సామాన్య ప్రజల పక్షాన నిరంతరం పోరాడేది కేవలం ఎర్రజెండా మాత్రమేనని స్పష్టం చేశారు. సీపీఐ 100 ఏళ్ల ప్రస్థానంలో ఎన్నో త్యాగాలు చేసిందని, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తోందని గుర్తు చేశారు. రైతులు, కార్మికులు, పేదల అభ్యున్నతి కోసం శతాబ్ద కాలం పోరాటం చేసిన పార్టీ సీపీఐకి 2025 డిసెంబరు 26 నాటికి వందేళ్లు పూర్తవుతుందని తెలిపారు. ఈ సందర్భంలో శత వార్షిక ఉత్సవాలు జరుపుకుంటోందన్నారు. ఈ వందేళ్ల ప్రయాణంలో సీపీఐ ప్రజల సమస్యల పరిష్కారం కోసం ముందుండి పోరాటం చేసిందన్నారు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో మొట్టమొదటిసారి నందిగామ శాసన సభ్యులుగా పిల్లలమర్రి వెంకటేశ్వర్లు పని చేశారని, విశాఖ ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కోసం పదవీ త్యాగాలు చేసిన మహనీయుల పార్టీ సీపీఐ అని దోనేపూడి కొనియాడారు. సీపీఐ ఆవిర్భావం నుంచే రైతాంగ సమస్యలను తన ప్రధాన అజెండాగా తీసుకుందని, భూమి లేని పేద రైతులకు భూమి హక్కులు, కౌలుదారులకు రక్షణ, సాగు నీరు, విత్తనాలు, ఎరువులు, పంటలకు గిట్టుబాటు ధర కోసం ఎన్నో ఉద్యమాలు చేసిందని గుర్తు చేశారు. రైతులు ఆకలితో అలమటించకూడదనే లక్ష్యంతో భూసంస్కరణలు, రుణ మాఫీ, ప్రభుత్వ మద్దతు ధర పోరాడింది... పోరాడుతోందని తెలిపారు. కార్మికుల హక్కుల కోసం సీపీఐ చేసిన పోరాటాలు ఈ దేశ చరిత్రలో నిలిచిపోయాయని అన్నారు. అశేష పోరాటల ఫలితమైన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంను బీజేపీ ప్రభుత్వం నీరుగారుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రోజుకు 8 గంటల పని, కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత, ట్రేడ్ యూనియన్ హక్కులు సాధించడంలో సీపీఐ కీలక పాత్ర పోషించిందన్నారు. కార్మికులను మనుషుల్లా చూడని పరిస్థితుల్లో యజమానుల దోపిడీని ఎదిరించి ధైర్యంగా పోరాడిందని, ఈ పోరాటాల మార్గంలో సీపీఐ వేలాది మంది నాయకులు కార్యకర్తలు జైళ్ల పాలయ్యారు... లాఠీచార్జీలు ఎదుర్కొన్నారని, ప్రాణ త్యాగాలు చేశారని ఆయన తెలిపారు. దేశ స్వాతంత్ర్యం కోసం, ప్రజల కోసం త్యాగాలు చేసిందన్నారు. ఎర్ర జెండా కేవలం ఒక జెండా కాదని, అది త్యాగానికి, పోరాటానికి, ప్రజల పక్షానికి చిహ్నమని కొనియాడారు. నేటికీ రైతాంగం సంక్షోభంలో ఉందని, కార్మికులు ఉపాధి లేక ఇబ్బంది పడుతున్నారని దోనేపూడి ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగం, ధరల పెరుగుదల, ప్రైవేటీకరణ ప్రజల జీవితాలను కుదిపేస్తున్నాయని, ఈ పరిస్థితులపై సీపీఐ పోరాటాలకు పిలుపునిస్తోందని తెలిపారు. సీపీఐ శత వార్షిక వేడుకల సందర్భంగా జరుగుతున్న కార్యక్రమాలను విజయవంతం చేసి రైతు-కార్మిక ఐక్యతను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత పాలకులు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టడంలోనూ, బడుగు బలహీన వర్గాలకు న్యాయం చేయడంలోనూ కమ్యూనిస్టులే ముందుంటారని తెలిపారు. శత వార్షిక ఉత్సవాల స్ఫూర్తితో రాబోయే రోజుల్లో ప్రజా పోరాటాలను మరింత ఉధృతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ బైక్ ర్యాలీలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన, విద్యార్థి సంఘాల ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొని, సీపీఐ నినాదాలతో హోరెత్తించారు. దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి బుట్టి రాయప్ప, సీపీఐ నియోజక వర్గ కార్యదర్శి చుండూరు సుబ్బారావు, సహాయ కార్యదర్శులు షేక్ గులాం మహమ్మద్, కట్టా చామంతి, సీపీఐ సీనియర్ నాయకులు, షేక్ సర్దార్, బొలుసుపాటి రాంబాబు, మన్నే హనుమంతురావు, వాసిరెడ్డి నవీన్, పేర్ని వెంకట రమణ, ఏఐటీయూసీ నాయకులు పెతూరు, చిన్నముసిలి, యేసోబు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ యువజన మాసపత్రిక ఆవిష్కరించిన ఎంపీ లక్ష్మినారాయణ

విశాలాంధ్ర-అనంతపురం: ఆంధ్ర ప్రదేశ్ యువతలో చైతన్యం, సామాజిక బాధ్యత, సృజనాత్మక ఆలోచనలు పెంపొందించాలనే లక్ష్యంతో ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి అధ్వర్యంలో ప్రచురితమైన యువజన మాస పత్రిక తాజా సంచికను శనివారం ఉదయం అనంతపురం నగరంలోని తన క్యాంపు కార్యాలయంలో లోక్‌సభ సభ్యులు అంబిక లక్ష్మినారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ యువతలోని ప్రతిభ, నాయకత్వ లక్షణాలు, సృజనాత్మక ఆలోచనలను వెలికి తీసేందుకు ఇటువంటి పత్రికలు దోహదపడతాయని అన్నారు. యువతలో సామాజిక బాధ్యత, ప్రజాసేవా భావన, క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నాయని తెలిపారు. యువత భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, క్రీడా మౌలిక వసతుల అభివృద్ధి, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను కూడా ఆయన వివరించారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి జి.సంతోశ్ కుమార్ మాట్లాడుతూ యువజన మాస పత్రిక యువత సమస్యలపై చర్చలు, విశ్లేషణలు, చైతన్యపరచే కథనాలకు, యువతకు దిశానిర్దేశం చేసే వేదికగా నిలుస్తుందన్నారు. సామాజిక అన్యాయాలపై పోరాటం చేయడంలో, ప్రజాస్వామ్య విలువలను కాపాడడంలో, సమానత్వం కోసం కృషి చేయడంలో యువత ముందుండాలని పిలుపునిచ్చారు. విద్య, నిరుద్యోగం, క్రీడా అవకాశాలు కొరవడటం వంటి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పత్రిక సిద్ధత, సంపాదక వర్గం శ్రమ, పాఠకుల స్పందనతో పాటు భవిష్యత్ సంచికల రూపకల్పనపై కూడా చర్చ జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు ఆనంద్, శ్రీనివాస్, సురేంద్రబాబు, బండారు తేజ, ఎర్రప్ప, అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో స్థానిక సంస్థలకు 15వ ఆర్థిక సంఘం నిధులు

పీఎంవో అధికారులకు జాస్తి వినతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలకు, మండల పరిషత్‌లకు 15వ ఆర్థిక సంఘం రెండవ విడత నిధులు విడుదల చేయాలని అఖిల భారత పంచాయతీ పరిషత్ (ఢిల్లీ) ఉపాధ్యక్షులు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు కోరారు. ఈ మేరకు శనివారం పీఎంవో కార్యాలయంలో అధికారులకు వినతి పత్రాన్ని అందించారు. అక్టోబరులో రావలసిన 15వ ఆర్థిక సంఘం రెండో విడత నిధులు రూ.1,000 కోట్లు త్వరగా విడుదల చేస్తే పెండింగ్ బిల్లులు, గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా జరుగుతాయని అన్నారు.

సంపాదకీయం

విద్వేషానికి కర్నాటక అడ్డుకట్ట

దాదాపు నరేంద్రమోదీ ప్రధానమంత్రి అయిన సందర్భంలోనే విద్వేష ప్రసంగాలను నిరోధించడం కోసం సుప్రీంకోర్టు మార్గదర్శక సూత్రాలు జారీ చేసింది. విద్వేష ప్రసంగాలు చేసిన వారిని అరెస్టు చేయడానికి ఉండవలసిన ప్రాతిపదిక, విధించదగిన శిక్ష ఏమిటో కూడా ఈ మార్గదర్శక సూత్రాలలో నిర్దేశించారు. 2014లో జారీచేసిన ఈ మార్గదర్శక సూత్రాలను అర్నేష్ కుమార్ గైడ్‌లైన్స్ అంటారు. విద్వేష ప్రసంగాలు చేసినప్పుడు ఆ వ్యక్తి పారిపోతాడనో, సాక్ష్యాలను ధ్వంసం చేస్తాడోనని అనుమానం ఉన్నప్పుడు మాత్రమే అరెస్టు చేయాలని కూడా స్పష్టంగా చెప్పారు. విద్వేష ప్రసంగం చేసినందుకు ఎవరినైనా అరెస్టు చేస్తే ఆ వ్యక్తిని ఎందుకు అరెస్టు చేశారో చెప్పాలని కూడా సుప్రీంకోర్టు నిర్దేశించింది. ఈ మార్గదర్శక సూత్రాలలో అరెస్టు చేసే అధికారాన్ని దుర్వినియోగం చేయకూడదన్నది అత్యున్నత న్యాయస్థానం ఉద్దేశం. విద్వేష ప్రసంగాలు చేసిన వారికి అత్యధికంగా ఏడేళ్ల జైలు శిక్ష విధించవచ్చునని కూడా ఉంది. అయితే మోదీ అధికారంలోకి వచ్చిన తరవాత ఈ మార్గదర్శక సూత్రాలను మార్గదర్శక్ మండల్‌లో పడేసినట్టున్నారు. మోదీ అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి తమ మీద చేయి వేసేవారు ఎవరూ లేరన్న ధైర్యం వచ్చినందువల్ల విద్వేష ప్రసంగాలు రోజువారీ కార్యక్రమాలు అయిపోయాయి. అనురాగ్ ఠాకూర్, గిరిరాజ్ కిశోర్, నిశికాంత్ దుబే లాంటి వారైతే విద్వేష ప్రసంగాలలో డాక్టరేట్లు సాధించినట్టున్నారు. ఈ మార్గదర్శకాలు జారీ చేసిన దాదాపు పదకొండేళ్లకు కర్నాటక శాసనసభ శుక్రవారం విద్వేష ప్రసంగాలను నిరోధించడానికి బిల్లు ఆమోదించింది. కర్నాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంది. సహజంగానే ప్రతిపక్ష బీజేపీ ఈ బిల్లును గట్టిగా వ్యతిరేకించడమే కాక ఆమోదించే సమయంలో వాకౌట్ కూడా చేసింది. గత పదో తేదీన ఈ బిల్లును శాసనసభలో ప్రతిపాదించారు. కర్నాటక సముద్ర తీర ప్రాంతంలో గత రెండు నెలలుగా వరసగా మతపరమైన హత్యలు జరుగుతున్నందువల్ల, విద్వేష ప్రసంగాలు విచ్చలవిడిగా కొనసాగుతున్నందు వల్ల ఈ బిల్లు ప్రతిపాదించవలసి వచ్చింది. గత ఏప్రిల్‌లో అష్రాఫ్‌ను హతమార్చడం విద్వేష హత్యలకు తాజా ఉదాహరణ. హోం మంత్రి జి.పరమేశ్వర ఈ బిల్లు ప్రవేశ పెట్టారు. ఆ దశలోనే ప్రతిపక్ష బీజేపీ గట్టిగా వ్యతిరేకించింది. సభ వాయిదా వేయాల్సి వచ్చింది. ఈ బిల్లు ఆమోదిస్తే దీనిని హిందూ సంస్థల మీద కసి తీర్చుకుంటారని బీజేపీ వాదించింది. ఆమోదంపొందిన ఈ బిల్లులో ఆన్‌లైన్లో ప్రచురితమయ్యే విద్వేష ప్రచారాన్ని తొలగించే అధికారం కూడా ప్రభుత్వానికి ఉంటుంది. ఒక వ్యక్తికి లేదా ఒక సమూహానికి హాని చేసే ఉద్దేశంతో చేసే వ్యాఖ్యలను విద్వేష ప్రసంగంగా పరిగణిస్తారు. ఈ విద్వేషం జాతిని, మతాన్ని, ఒక నిర్దిష్ట సమూహాన్ని, పుట్టిన చోటును, స్త్రీనో పురుషుడినో నిందించడాన్ని విద్వేషంగా ఈ బిల్లు పరిగణిస్తుంది. అంటే ఇది కేవలం మత విద్వేషాలను రెచ్చగొట్టడానికే పరిమితమైంది కాదు. ఈ బిల్లు ప్రకారం విద్వేషానికి పాల్పడే వారు కేవలం వ్యక్తులే కానక్కర్లేదు, వ్యవస్థలు, సంస్థలు కూడా కావొచ్చు. ఆ వ్యవస్థలు, సంస్థలతో సంబంధం ఉన్న వారి మీద చర్య తీసుకోవడానికి ఈ బిల్లు అవకాశం కల్పిస్తుంది. విద్వేషం రెచ్చగొట్టే సంస్థ మీద కూడా చర్య తీసుకోవడానికి అవకాశం ఉంటుంది. అయితే ఒక సంస్థ లేదా వ్యవస్థ విద్వేషం రెచ్చగొట్టినప్పుడు ఆ సంస్థ సభ్యులకు తెలియకుండా ఉంటే ఆ వ్యక్తుల మీద చర్య తీసుకోవడానికి అవకాశం ఉండదు. ఈ వెసులుబాటు ఇంతకు ముందు వెలువడ్డ ముసాయిదా బిల్లులో ఉండేది కాదు. అయితే ప్రజా శ్రేయస్సు కోసం వెల్లడించే సమాచారం విద్వేష ప్రసంగంగా కనిపించినా చర్య తీసుకోవడానికి వీలుండదు. విజ్ఞాన శాస్త్రం, కళలు, పాఠ్యాంశాలు, మతపరమైన వ్యవహారాలు, వారసత్వానికి సంబంధించిన అంశాలలో విద్వేషంలా కనిపించే విషయాలపై చర్య తీసుకునే అవకాశం ఉండదు. విద్వేష ప్రసంగాలు చేసే వారికి ఒక సంవత్సరం నుంచి ఏడేళ్లదాకా జైలు శిక్ష విధించవచ్చు. రూ. 50,000 జరిమానా కూడా విధించవచ్చు. మొదటిసారి శిక్ష అనుభవించినప్పటికీ రెండోసారి అదే పని చేస్తే 2 నుంచి పదేళ్ల దాకా జైలు శిక్ష విధించవచ్చు. లక్ష రూపాయల జరిమానా కూడా విధించే అవకాశం ఉంటుంది. మునుపటి ముసాయిదా బిల్లు ప్రకారం అయితే నిందితులకు, విద్వేష ప్రసంగాన్ని రెచ్చగొట్టడానికి తోడ్పడే వారికి మూడేళ్ల జైలు శిక్ష విధించే అవకాశం ఉండేది. అయితే ఈ ముసాయిదా బిల్లుపై న్యాయ నిపుణుల నుంచి వ్యతిరేకత వ్యక్తం అయింది. పదేళ్ల శిక్ష విధించే అవకాశం ఉండడం అర్నేష్ కుమార్ మార్గదర్శక సూత్రాల పరిధిని ఉల్లంఘించడమేనని విమర్శకులు అభిప్రాయపడ్డారు. అంతేకాక పోలీసులు అరెస్టు చేయడానికి అపరిమితమైన అవకాశాలు కల్పించే ప్రమాదమూ ఉంటుంది.

శుక్రవారం ఆమోదించిన బిల్లులో విద్వేష ప్రసంగానికి గురైన బాధితులకు పరిహారం చెల్లించే అవకాశమూ కల్పించారు. ఈ బిల్లు విద్వేష ప్రసంగాలను నిరోధించే చర్య తీసుకోవడానికి ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్లకు, డిప్యూటీ పోలీసు సూపరింటెండెంట్ స్థాయికి తగ్గని పోలీసు సిబ్బందికి అధికారాలు ఇస్తోంది. విద్వేషాన్ని రెచ్చగొట్టే క్రమంలో చర్య తీసుకునే అధికారుల మీద బాధితులు లేదా వారి తరఫు వారు కల్పించుకోకుండా వెసులుబాటు కల్పించారు. ఇంతకు ముందు జూన్‌లో బయటికొచ్చిన ముసాయిదాలో ఈ అవకాశం లేదు. విద్వేష ప్రసంగాలను కట్టడి చేయడానికి ప్రత్యేక చట్టం రూపొందించిన ఖ్యాతి కర్నాటక శాసనసభకే దక్కుతుంది. విద్వేష ప్రసంగాలు చేసినప్పుడు ఎవరూ ఫిర్యాదు చేయకపోయినా పోలీసులు తమంత తాముగా చర్య తీసుకునే అవకాశం కల్పించారు. ఈ బిల్లు వాక్ స్వాతంత్ర్యాన్ని, పత్రికా స్వేచ్ఛను అతిక్రమిస్తుందని ప్రతిపక్ష బీజేపీ నాయకుడు ఆర్. అశోక ఆవేదన వ్యక్తం చేశారు. విద్వేషాన్ని రెచ్చగొట్టేవారు చేస్తున్న పని ఇదే అని ఆయన గుర్తించినట్టు లేదు. ఎమర్జెన్సీ విధించిన కాంగ్రెస్ పార్టీ నుంచి ఇంతకన్నా ఏం ఆశించగలం అని కూడా గతాన్ని తవ్వే ప్రయత్నం గట్టిగానే చేశారు. నిజానికి ఈ బిల్లులో ఉన్న అంశాలన్నీ భారతీయ న్యాయ సంహితలో ఉన్నాయి. కర్నాటక శాసనసభ ఆ అంశాల ఆధారంగా మాత్రమే బిల్లు రూపొందించింది తప్ప వాక్ స్వాతంత్ర్యాన్ని, పత్రికా స్వేచ్ఛను హరించడానికి ఎలాంటి ప్రయత్నమూ చేయలేదు. రాజకీయ కక్షలు తీర్చుకోవడానికి ఈ బిల్లును వినియోగించుకోవచ్చునని, అది ఎన్నటికైనా మీ మీదే ప్రయోగించే ప్రమాదం ఉందని అశోక్ దెప్పి పొడిచారు. నిజానికి కర్నాటక కోస్తా ప్రాంతంలో విద్వేష ప్రసంగాలకు అడ్డూ ఆపూ లేకుండా పోయింది. మతపరమైన విద్వేషాలను ఆపాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు గత మేలో అభిప్రాయపడింది. అయితే చట్టాలు విద్వేష ప్రసంగాలను ఆపుతాయని అనుకోలేం. కానీ ప్రభుత్వం చర్య తీసుకోవడానికి అవకాశం కలుగుతుంది.

విద్యా వ్యవస్థలో వెలుగుతున్న 'చీకటి' వైరుధ్యం

వెంకగారి భూమయ్య, 9848559863

వ్యంగ్యానికి అంటూ ఒక శాశ్వత చిరునామా కావాలంటే అది ఏ రాజమార్గాల్లోనో లేదా ప్రభుత్వ అధికారిక బంగ్లాల్లోనో కాకుండా, ఒక భారతీయ పాఠశాల స్టాఫ్ రూమ్‌లో స్పష్టంగా కనిపిస్తుంది. అది చిరిగిపోతున్న హాజరు పట్టికలకు, వ్యవస్థను సజీవంగా ఉంచే నిలువెత్తు విద్యావేత్తల వేలిముద్రలను సైతం గుర్తించడంలో పదేపదే విఫలమయ్యే మొండి బయోమెట్రిక్ యంత్రాలకు మధ్య ఒక నిశ్శబ్ద రోదనలా కూర్చుని ఉంటుంది. జ్ఞానాన్నిపూజించే సంస్కృతిగల ఈ దేశంలో, ఉపాధ్యాయులను 'గురుబ్రహ్మ' అని కొనియాడుతూనే, వారిని నిశ్శబ్దంగా 'ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన క్లర్కులు'గా మార్చే కుట్రపూరిత ప్రక్రియ నిర్విరామంగా కొనసాగుతోంది. శిక్షణపొందిన ఒక మేధావిని బోధన అనే 'అసౌకర్యం'తో ఎందుకు ఇబ్బంది పెట్టాలి? అనే ధోరణి నేడు పాలకుల్లో బలంగా పాతుకుపోయింది. అందుకే వారిని ఫారాలు నింపడం, లెక్కలేనన్ని పోర్టల్స్‌లో పొంతన లేని సమాచారాన్ని నమోదు చేయడం, సంతకాల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ యాచకుల్లా తిరగడం వంటి పనుల్లో బందీలను చేస్తున్నారు. ఫలితంగా, విద్యార్థులతో గడపాల్సిన విలువైన సమయం డేటా అప్‌లోడ్ల పేరుతో గాలిలో కలిసిపోతోంది. అక్షరాలను దిద్దించాల్సిన చేతులు స్మార్ట్‌ఫోన్లలో ఓటీపీల కోసం వెతుక్కుంటున్నాయి. ఒకప్పుడు ఉపాధ్యాయుడి వృత్తి అంటే సమాజానికి దిశానిర్దేశం చేసే ఒక ఉన్నత గౌరవం, కానీ నేడు అది అటెండెన్స్ యాప్‌లో ఫోటోలు దిగడానికి తాపత్రయపడే ఒక నిస్సహాయ వేతన జీవి స్థాయికి దిగజారిపోయింది. ఇది వ్యవస్థీకృత నిర్లక్ష్యం కాదు, ఒక మేధోపరమైన దోపిడీ ఎందుకంటే ఆలోచించే మెదళ్లను తయారుచేసే గురువును, కేవలం గణాంకాలను సేకరించే గణాంక యంత్రంగా మార్చివేస్తే, ఆ దేశం భవిష్యత్తు అంధకారంలోకి వెళ్లక తప్పదు.

ఒకప్పుడు ఉపాధ్యాయుడి వృత్తిపరమైన పరికరాలు అంటే కేవలం చాక్‌పీస్, పుస్తకాలు, జిజ్ఞాసతో కూడిన మనసు మాత్రమే. కానీ నేడు, అది ఒక జూనియర్ బ్యూరోక్రాట్ పరికరాల వలే ఉంది. ఉపాధ్యాయులు కార్పొరేట్ ఎగ్జిక్యూటివ్‌ల వంటి పనితనాన్ని, క్లరికల్ సిబ్బంది వంటి విధేయతను ప్రదర్శించాలని ఆశిస్తున్నారు, కానీ వారికి ఇచ్చే గౌరవం, వేతనం మాత్రం సులభంగా భర్తీ చేయగల ఒక సామాగ్రి వలే ఉంటుంది. భవిష్యత్‌పౌరులను తీర్చిదిద్దేబాధ్యతను మనం ఉపాధ్యాయులకు అప్పగిస్తాం, కానీ విద్యార్థులతో అర్థవంతంగా మమేకమవ్వడానికి అవసరమైన సమయాన్ని, స్వయంప్రతిపత్తిని, గౌరవాన్ని వారికి నిరాకరిస్తాం. తరగతి గది ఒక నిశ్శబ్దమైన అణచివేతకు గురైంది. ఒకప్పుడు సంభాషణలకు, ఆవిష్కరణలకు నిలయంగా ఉన్న తరగతి గది, ఇప్పుడు పరిపాలనాపరమైన పనులమధ్య ఒక అంతరాయంగా మారింది. ఉపాధ్యాయులు ఆలోచనలను పెంపొందించడం కంటే డేటాను ధృవీకరించడానికే ఎక్కువ సమయం గడుపుతున్నారు. విలువలరూపకల్పన కంటే నివేదికలను సిద్ధం చేయడానికే ప్రాధాన్యత ఇస్తున్నారు. జనాభా గణన నుంచి ఎన్నికల విధుల వరకు, ఉపాధ్యాయులు ప్రభుత్వ యంత్రాంగానికి ఒక సాధనంగా మారిపోయారు. ఉపాధ్యాయుడు తరగతి గదిలో ఉండాల్సిన సమయంలో సర్వేల కోసం వీధుల్లో తిరగాల్సి రావడం విద్యా వ్యవస్థ వైఫల్యానికి పరాకాష్ట.

ఈ వ్యవస్థ ఒక విచిత్రమైన సందిగ్ధంలో పయనిస్తోంది. వెలుగును పంచాల్సిన దీపం కేవలం తన చుట్టూ ఉన్న నీడలను లెక్కించడానికే పరిమితమైతే, అది వెలుగునిస్తుందా లేక చీకటిని కొలుస్తుందా అనే ప్రశ్నార్థకంలో విద్యార్థుల భవిష్యత్తు కొట్టుమిట్టాడుతోంది. గొడ్డలి వేటుకు గురవుతున్న చెట్టులో చివరి శ్వాసలా విద్యా వ్యవస్థ ఊపిరి పోసుకుంటుంటే, అంధకారమే ఒక అధికారిక విధానంగా చలామణీ అవుతున్న చోట దీపాన్ని వెలిగించడమా లేక ఆరిపోతున్న దానిని ఆర్పేయడమా అనే సంశయంలోనే నేటి విధానకర్తలు చిక్కుకుపోయారు. ఆ గందరగోళమే ఇప్పుడు ఒక క్రమశిక్షణగా, ఆ అస్తవ్యస్తతలే ఒక అభివృద్ధిగా భ్రమింపజేస్తున్న ఈ కాలంలో, జ్ఞానం ఒక డేటా పాయింట్‌గా మారి సమాధి అవుతోంది. అసలు ఉపాధ్యాయుడు బోధిస్తున్నాడా లేక డేటాను పోషిస్తున్నాడా? విద్యార్థి నేర్చుకుంటున్నాడా లేక కేవలం అటెండెన్స్ యాప్‌లో అంకెలా మిగిలిపోతున్నాడా? అనే నిజం తేలని ఈ మాయాజాలంలో, అక్షరం ముక్కరాని అజ్ఞాని కంటే, అక్షరాన్ని కేవలం గణాంకాల కోసం వాడే మేధావే ప్రమాదకరమనే నిజాన్ని ఈ వ్యవస్థ ఎప్పుడు గుర్తించాలో ఎవరికీ ఎరుక లేని ఒక వింత పరిస్థితి నెలకొంది. దీపం వెలుగునివ్వడం మరచిపోయి నీడలను లెక్కపెట్టడంలో నిమగ్నమైనప్పుడు, మనం వెతుకుతున్నది దారియా లేక పాతాళమా అనే గందరగోళంలోనే విద్యా వ్యవస్థ తన అంతిమ ప్రయాణాన్ని సాగిస్తోంది. నిర్మాణమే విచ్ఛిన్నంగా, సంస్కరణలే సంకెళ్లుగా మారుతున్న వేళ, నిశ్శబ్దాన్ని నిరసనగా మార్చుకున్న ఉపాధ్యాయుడు రేపటి తరానికి ఏ పాఠం చెబుతాడు? అసలు తరగతి గది అనే నాలుగు గోడల మధ్య మిగిలింది జ్ఞానమా లేక కేవలం సర్కారు ఆదేశాల కాగితపు కుప్పా? అంకెలు పెరుగుతున్నా ఆలోచనలు ఆగిపోతున్న ఈ వైరుధ్యాన్ని అభివృద్ధి అనుకోవాలా లేక మేధోపరమైన ఆత్మహత్యగా భావించాలా? గమ్యం లేని ప్రయాణంలో దారిచూపే వాడే దారి తప్పితే, ఆ ప్రయాణమే ఒక గందరగోళ ప్రహసనం అవుతుంది.

దామాషా పద్ధతిలో ప్రాతినిధ్యం అవశ్యం

కె. సుబ్బరాయన్, తిర్పూర్ ఎంపీ

భారత ప్రజాస్వామ్య వ్యవస్థ నేడు సంక్షోభంలో ఉంది. దానిని పరిష్కరించేందుకు ఎన్నికల సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఎంతగానో ఉంది. ఓట్ల శాతానికి అనుగుణంగా దామాషా పద్ధతిలో ప్రాతినిధ్యం కల్పించడం అత్యవసరం. ఎన్నికల సంస్కరణలపై ఈ నెల 10 వ తేదీన లోక్‌సభలో జరిగిన చర్చలో సీపీఐ తరఫున చర్చలో పాల్గొనే అవకాశం నాకు కలిగింది. ఆ ప్రసంగంలోని ముఖ్యాంశాలు. ఎన్నికల సంస్కరణలపై భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) తరఫున నా అభిప్రాయాలను సభ ముందు ఉంచాను. స్వతంత్ర భారతదేశంలో అనేక సంవత్సరాలుగా జరుగుతున్న ఎన్నికలు మనకు ఎన్నో అనుభవాలను ఇచ్చాయి. వాటి నుంచి నేటి పాలకులు పాఠాలు నేర్చుకొని ఈ దిశగా ఆలోచిస్తారో లేదో నాకు తెలియదు.

ఇప్పుడు అవసరమైన మొదటి సంస్కరణ ఏమిటంటే, ఓట్ల శాతానికి అనుగుణంగా దామాషా పద్ధతిలో ప్రాతినిధ్యాన్ని కల్పించాలి. నిజంగా ప్రజాస్వామ్యాన్ని ప్రేమించే, దానిపట్ల శ్రద్ధ వహించే వారు చేయవలసిన గొప్ప సంస్కరణ ఇది. అప్పుడే ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుంది. జాతీయ స్థాయిలో ప్రతి పార్టీకి వచ్చిన ఓట్లు, ఓటింగ్ శాతాన్ని మీరు చూడాలి. ఆ శాతం ఆధారంగా, ప్రతి పార్టీకి ఎంపీలు, ఎమ్మెల్యేల సంఖ్యను నిర్ణయించాలి. ఇది అత్యంత అవసరమైనది. కానీ నేటి పాలకులు అలా చేసేందుకు సుముఖంగా లేరు. అధికార పార్టీ, ప్రభుత్వం పనితీరును దగ్గరగా గమనిస్తే, వారిలో అలాంటి ఆలోచన లేదా ఆలోచనా విధానం ఏమాత్రం లేదని స్పష్టంగా తెలుస్తోంది. తప్పు ఎక్కడ జరిగింది? ప్రజాస్వామ్య పాలనా వ్యవస్థకు నాయకత్వం వహించే నైతిక బాధ్యత ఈ ప్రభుత్వానికి ఉందా? ఎన్నికల కమిషనర్ ఎంపిక కోసం ముగ్గురు సభ్యుల ప్యానెల్ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తిని మీరు (ప్రభుత్వం) ఎందుకు తొలగించారు? మీ ఉద్దేశం ఏమిటి?

గౌరవ ప్రతిపక్ష నాయకుడు మిమ్మల్ని నాలుగు ప్రశ్నలు అడిగారు. అవన్నీ చాలా అర్థవంతమైనవి. అధికారంలో ఉన్నవారు సమాధానం చెప్పాలి. వారు ఈ దేశ ప్రజలకు సమాధానం చెప్పాలి. ఈ నాలుగు

ప్రశ్నలలో కుట్ర దాగి ఉంది. వారు గంభీరంగా సమాధానం ఇస్తే, అది ప్రయోజనకరంగా ఉంటుంది. వారు మూడు ఏర్పాట్లు చేశారు. మొదటిది ఏమిటంటే, వారు 2011 జనాభా లెక్కలను వాయిదా వేశారు. ఈ ప్రభుత్వం ప్రకటించినట్లుగా, ఇది 2027 లో జరుగుతుంది. 2031 కి ప్రకటించాల్సిన జనాభా లెక్కలు ఇప్పుడు 2027 లో జరుగుతాయి. దీని వెనుక ఒక ఉద్దేశం ఉంది. మీరు ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను చూస్తే, ఆయన 2029 సంవత్సరం వరకు ఆ పదవిలో ఉంటారు. ప్రస్తుత ఎన్నికల కమిషనర్ 2029 వరకు ఆ పదవిలో కొనసాగేలా వారు ఒక పక్కా ఏర్పాటుచేశారు. వారు ఎంత కుట్రపూరితంగా ఉన్నారో చూడండి? వారు ఈ ఏర్పాటు ఎందుకు చేశారు? ఈ విషయంపై సామాన్య ప్రజలకు పాలకులు సమాధానం చెబుతారా? ఎందుకంటే వారిలో నిజాయితీ లేదు. ప్రజాస్వామ్యంలో వారు అనర్హులు. పాలకులకు ఆర్ఎస్ఎస్ సంస్థ నేర్పిన పాఠం ఇదే. మీరు చేస్తున్న పనిని ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడం అంటారు. మీరు ఒక శక్తిమంతమైన ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాల గొంతును అణచివేస్తున్నారు. మీరు అలా చేస్తే ఓడిపోతారు. ప్రజాస్వామ్యాన్ని అంగీకరించవద్దని వారికి ఆర్ఎస్ఎస్ నేర్పింది. నేను బహిరంగ సవాలు చేస్తున్నాను. ప్రజాస్వామ్యం ఒక విదేశీ వస్తువు, అది ఏ

ప్రస్తుత ఎన్నికల కమిషనర్ 2029 వరకు ఆ పదవిలో కొనసాగేలా వారు ఒక పక్కా ఏర్పాటు చేశారు. వారు ఎంత కుట్రపూరితంగా ఉన్నారో చూడండి? వారు ఈ ఏర్పాటు ఎందుకు చేశారు? ఈ విషయంపై సామాన్య ప్రజలకు పాలకులు సమాధానం చెబుతారా? ఎందుకంటే వారిలో నిజాయితీ లేదు. ప్రజాస్వామ్యంలో వారు అనర్హులు. పాలకులకు ఆర్ఎస్ఎస్ సంస్థ నేర్పిన పాఠం ఇదే. మీరు చేస్తున్న పనిని ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడం అంటారు. మీరు ఒక శక్తిమంతమైన ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాల గొంతును అణచివేస్తున్నారు. మీరు అలా చేస్తే ఓడిపోతారు. ప్రజాస్వామ్యాన్ని అంగీకరించవద్దని వారికి ఆర్ఎస్ఎస్ నేర్పింది. నేను బహిరంగ సవాలు చేస్తున్నాను. ప్రజాస్వామ్యం ఒక విదేశీ వస్తువు, అది ఏ విధంగానూ భారతీయ స్వభావం కలది కాదు గోల్వాల్కర్ వారికి నేర్పిన పాఠం ఇదే. గోల్వాల్కర్ నుంచి పాఠాలు నేర్చుకున్న తర్వాత, వాళ్లు (బిజెపి, ఆర్ఎస్ఎస్) రాజ్యాంగం, మతాన్ని ఉపయోగించి ప్రజాస్వామ్య వ్యవస్థను చేజిక్కించుకుని అధికారాన్ని ఆక్రమించారు. దీని ద్వారా, వారు ఆ సంస్థలలో ఉంటూనే ప్రజాస్వామ్య వ్యవస్థలను నాశనం చేస్తారు లేదా కూల్చివేస్తారు. అందుకే అన్ని విధాలుగా, వారు సైన్యం, న్యాయ వ్యవస్థ, అన్ని ఇతర సంస్థలలో చొరబడుతున్నారు.

విధంగానూ భారతీయ స్వభావం కలది కాదు గోల్వాల్కర్ వారికి నేర్పినపాఠం ఇదే. గోల్వాల్కర్‌నుంచి పాఠాలు నేర్చుకున్న తర్వాత, వాళ్లు (బిజెపి, ఆర్ఎస్ఎస్) రాజ్యాంగం, మతాన్ని ఉపయోగించి ప్రజాస్వామ్య వ్యవస్థను చేజిక్కించుకుని అధికారాన్ని ఆక్రమించారు. దీని ద్వారా, వారు ఆ సంస్థలలో ఉంటూనే ప్రజాస్వామ్య వ్యవస్థలను నాశనం చేస్తారు లేదా కూల్చివేస్తారు. అందుకే అన్ని విధాలుగా, వారు సైన్యం, న్యాయ వ్యవస్థ, అన్ని ఇతర సంస్థలలో చొరబడుతున్నారు. భారతదేశం ఒక కఠినమైన, అత్యంత దారుణమైన సమయాన్ని ఎదుర్కొంటోంది.

(న్యూయేజ్ నుంచి)

కార్పొరేటు వైద్యానికి 'దోపిడీ రోగం'

ప్రొఫెసర్ పీటాబాజీవర్ధన్

'వైద్యో నారాయణో హరి' అనేది నానుడి. వైద్యుడు దేవునితో సమానమని దానర్థం. అందుకే ఆ వృత్తికి అంత గౌరవం. కానీ ఇదంతా ఒకప్పటి మాట. ఇప్పుడు వైద్యం ఓ ఖరీదైన వ్యాపారం. కొందరు డాక్టర్లు ధనార్జనే ధ్యేయంగా నడిపే వ్యవహారం. ప్రభుత్వాస్పత్రుల్లో సరైన సౌకర్యాలు లేక ఎక్కువ మంది రోగులు ప్రైవేటు ఆస్పత్రులనే ఆశ్రయిస్తున్నారు. స్టార్ హోటళ్లను తలపించేలా, హంగులతో ఏర్పాటు చేసిన కార్పొరేట్ ఆస్పత్రులు జనాన్ని దోపిడీ చేస్తున్నాయి. జలగల్లా రక్తాన్ని తోడేస్తున్నాయి. మౌలిక సదుపాయాలు సాకుగా చూపించి ప్రభుత్వ వైద్యులు సైతం ప్రైవేటుగా సొంత ఆస్పత్రులు నడుపుతున్నారు. కొందరుడాక్టర్లు కొన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో కన్సల్టెంట్స్‌గా పనిచేస్తూ, ప్రభుత్వాసుపత్రులకు వచ్చిన రోగులను కార్పొరేట్ ఆస్పత్రుల్లో చేరమని సిఫార్సు చేస్తూ దోపిడీ దందాకు దారులు వేస్తున్నారు. పవిత్రమైన వైద్య వృత్తికి అన్యాయం చేస్తున్నారు. డబ్బు దండుకోవడమే ప్రధాన ధ్యేయంగా జనాన్ని దగా చేస్తున్నారు. ప్రభుత్వ వైద్యులు ప్రైవేటు ప్రాక్టీసు నిర్వహించకూడదన్న నిబంధనలు ఉన్నప్పటికీ బేఖాతరు చేస్తున్నారు. రాజకీయ నాయకుల అండదండలతో 'మూడు కార్పొరేట్లు, ఆరు కన్సల్టెన్సీలు' అన్న చందాన కోట్లకు పడగలెత్తుతున్నారు. దేశం మొత్తం మీద దాదాపు 75 వేలకు పైగా ఆస్పత్రులు ఉండగా, వీటిలో మూడో వంతు ప్రైవేటు ఆస్పత్రులే అంటే ఆశ్చర్యం కలిగిస్తోంది. కార్పొరేట్ ట్యాగ్ తగిలించుకుని, అద్దాల భవంతుల్లో ఆధునిక వసతుల పేరిట రోగుల నుంచి లక్షలు గుంజుతున్నారని తెలుస్తోంది. అవసరం వున్నా లేకున్నా, లేనిపోని 'పరీక్షలు'(టెస్టులు) చేసి జేబులు ఖాళీ చేస్తున్నారు. ఏసీ రూముల్లో రోగులను చేర్చి రోజుకి ఐదు నుంచి ఏడెనిమిది వేల దాకా అద్దె వసూలు చేస్తున్నారు. చిన్న చిన్న వ్యాధులకు సైతం లక్షల్లో ఫీజు వసూలు చేస్తున్నారు. నాకు తెలిసిన ఓ ప్రొఫెసర్ విరోచనాలు అవుతున్నాయని విశాఖ నగరంలోని ఓ పెద్ద కార్పొరేట్ ఆస్పత్రికి వెళ్లారు. ఎమర్జెన్సీ అని చెప్పి ఐసీయూలోకి తరలించారు. ఎక్కువ సార్లు విరోచనాలు అవ్వడం వల్ల మనిషి నీరసించి పోయారు. ఇదే అదనుగా ఆక్సిజన్ తగిలించారు. నానా హంగామా చేశారు. ఈ హైరానా అంతా చూసి కుటుంబ సభ్యులు భయపడ్డారు. ఆ బలహీనతను ఆసరా చేసుకుని దాదాపు ఇరవై దాకా 'టెస్టులు' రాశారు స్పెషలిస్టు వాళ్ల ల్యాబ్‌లోనే అన్ని పరీక్షలు నిర్వహించి పాతిక వేలదాకా బిల్లు వేశారు. ఇది పదిహేనేళ్ల నాటి సంగతి. చూడ్డానికి వెళ్లిన నాకు టెస్టుల రిపోర్టులు చూపించారు. ఆ లిస్టులో ఎయిడ్స్ వ్యాధి నిర్ధారణ కోసం చేసే హెచ్ఐవీ కూడా ఉంది. షాక్ గురయ్యాను నేనైతే. అదే విషయం డాక్టర్ని అడిగితే 'అనుమాన నివృత్తి' కోసం అలా రాస్తుంటామని తాపీగా సెలవిచ్చారు. మొత్తానికి లక్షపైనే బిల్లు కట్టించుకుని మూడు రోజుల తర్వాత 'వదిలి పెట్టారు' పెద్దాయన్ని. ఒక యూనివర్సిటీ ప్రొఫెసర్ నుంచే అంత మొత్తం గుంజిన కార్పొరేట్ జలగలు, ఇక సామాన్యుని విషయంలో ఎంత బరితెగిస్తాయో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు.

ఆరోగ్యశ్రీనే పెద్ద ఆదాయ వనరు: ముందే అనుకున్నట్టు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో నిపుణులైన వైద్యులు వున్నా, సరైన సదుపాయాలు లేక జనం కార్పొరేట్ ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం కూడా ఆరోగ్యశ్రీ పథకం కింద రోగులు ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్య సేవలు పొందేందుకు అవకాశం కల్పిస్తోంది. దీని కోసం కొన్ని కార్పొరేట్ ఆస్పత్రులను రెఫరల్స్‌గా గుర్తించి, పేద రోగులకు వైద్య సేవలు పొందే అవకాశం కల్పిస్తోంది. ఇదే అవకాశంగా భావించిన కార్పొ'రేట్లు' దోపిడీకి తెరతీస్తున్నాయి. తెల్లకార్డులు ఉన్న రోగులకు పూర్తి బిల్లును ప్రభుత్వమే చెల్లిస్తుంది కనుక కార్పొరేటు ఆస్పత్రుల దందాకు మార్గం సుగమం అవుతోంది. ఒక అంచనా మేరకు దేశంలో ఎనభై శాతం మంది రోగులు కార్పొరేట్ ఆస్పత్రులకే వైద్యం కోసం వెళ్తున్నారు. దీంతో ఏడాదికి ఒక్కో ప్రైవేటు ఆస్పత్రి కోట్లలో ఆర్జిస్తోంది. ఇది ప్రభుత్వాలు చెల్లించే సొమ్ము. ఇది గాక మిగతా రోగుల నుంచి గుంజుకునే సొమ్ముకు అవధులే లేవు. ప్రభుత్వ రెఫరల్ ఆస్పత్రుల జాబితాలో పేరు సంపాదించుకోవడం కోసం నానా 'తిప్పలు' పడతారు. ప్రభుత్వ 'పెద్దల'అండతో విజయం సాధిస్తారు. ఈ క్రమంలో కోట్లు చేతులు మారతాయన్నది బహిరంగ రహస్యం. చాలా సందర్భాల్లో ఆరోగ్యశ్రీ దుర్వినియోగం అవుతోంది. అవసరం వున్నా లేకున్నా కొందరు అర్హత వుంది కదాని చిన్న చిన్న రోగాలకే ఆస్పత్రిలో చేరిపోతుంటారు. కనీసం ఐదు రోజులు ఎలాగోలా ఉంచి లక్షల్లో బిల్లులు వేస్తున్నారు ఆస్పత్రి నిర్వాహకులు. ఇంకొందరైతే ఏమీ లేకున్నా బిల్లుల్ని 'తయారు'చేయించి భవిష్యత్‌లో చెల్లింపులు జరిగాక' వాటాలు' తీసుకుంటున్న సంఘటనలు కూడా వెలుగు చూస్తున్నాయి. కొన్ని ప్రైవేటు ఆస్పత్రులకు అనుబంధంగా వైద్య కళాశాలలు కూడా ఉంటాయి. కోట్లలో ఫీజులు చెల్లించి సీట్లు సంపాదించిన వైద్య విద్యార్థులు భవిష్యత్‌లో డాక్టర్లు అయ్యాక వృత్తిని వ్యాపారంలా చూడడం సర్వసాధారణమైన అంశమే. వైద్య కళాశాలకు అనుమతుల విషయంలోనూ బోలెడంత అవినీతి జరుగుతున్నదన్నది వాస్తవం. మెడికల్ కౌన్సిల్ అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నాక పరిశీలన కోసం వచ్చే కేంద్ర బృందానికి లంచాలు మేపి, బహుమతులు అందజేసి అనుమతి తీసుకుంటున్న వైద్య కళాశాలలు కోకొల్లలుగా ఉన్నాయి. కమిటీ సందర్శన సమయంలో డాక్టర్లు, నర్సులు, ఇతర వైద్య సిబ్బందిని'అద్దెకు' తెచ్చి, అనుమతులు పొందిన కళాశాలలు కూడా దేశంలో ఉన్నాయంటే ఆశ్చర్యం కలగక మానదు. కొన్ని కేసుల్లో మంచాలు, రోగులను కూడా అద్దెకు తెస్తున్నారంటే పరిస్థితి ఎంత భయంకరంగా ఉందో సులభంగానే అర్థమవుతుంది. కోట్లలో లంచాలు ఇచ్చిన కళాశాలల యాజమాన్యాలు, సీట్లను కోట్లకు అమ్ముకుంటున్నారు. కోట్లు కట్టి సీట్లు 'కొనుక్కున్న' వైద్య విద్యార్థులు రేపు డాక్టర్లు అయ్యాక వడ్డీతో సహా రోగుల నుంచి పిండుకోక మిన్నకుంటారా! ఇదో విషవలయం. దోపిడీ రాజ్యానికి కేంద్రాలయం.

సేవ పునాదిగా విరాజిల్లాల్సిన పవిత్ర వృత్తి వైద్యం. కానీ కార్పొరేటీకరణ ముసుగు తగిలించు కొని, ధనార్జనే ధ్యేయంగా ఫక్తు వ్యాపారంగా మారింది. ఖరీదైన వ్యాపకంగా అవతరించింది. అనారోగ్య పోటీతో జనం ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతోంది. తక్కువ జీతాలు చెల్లించి అనుభవం లేని వైద్యులను ఎంపిక చేసుకుని, అరకొర వైద్యం చేస్తున్నాయి కొన్ని కార్పొరేట్ ఆస్పత్రులు. శిక్షణ లేని నర్సులు, ఇతర సిబ్బంది చాలా సందర్భాల్లో 'తప్పుడు వైద్యం' చేసి రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. వార్డుబోయ్‌లు, ఆయాలు కార్పొరేట్ల దోపిడీలో బలిపశువులే ! చాలా ఆస్పత్రులు సరైన వైద్యులు లేకపోయినా రోగులను చేర్పించుకుంటాయి. మరేదో ఆస్పత్రి నుంచి డాక్టరుని పిలిపించుకుంటాయి. కొన్నిసార్లు ఈ తతంగంలో ఆలస్యం వల్ల రోగి ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లినప్పుడు లేనిపోని హడావుడి చేస్తారు. అనుభవం లేని డాక్టరుతోనో, నర్సులతోనో వైద్యం చేయిస్తారు. దీంతో రోగులు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఈమధ్య ఎక్కువగానే సంభవిస్తున్నాయి. దీంతో రోగి కుటుంబ సభ్యులు, బంధువులు ధర్నాకు దిగడం, కొన్ని సందర్భాల్లో కొట్లాటకు దిగడం పరిపాటిగా మారింది. అవసరం వున్నా లేకున్నా సిజేరియన్ కాన్పులు చేసి లక్షలు గుంజడంతో పాటు కొన్నిసార్లు తల్లిని చంపి పసికందును అనాథను చేస్తున్న సంఘటనలు కూడా జరుగుతుండడం విషాదం. కుడికంటికి బదులు ఎడమ కంటికి సర్జరీ చేయడం, పైపళ్లకు బదులు కింది పళ్లు పీకేయడం వంటి సంఘటనలు కూడా అక్కడక్కడా జరుగుతున్నాయి. కొన్ని కేసుల్లో రోగిని లేవనీయక, అలాగని చావనీయక 'సాగదీత' వైద్యంతో వారాల తరబడి ఆస్పత్రిలోనే ఉంచి లక్షలు దండుకోవడం కూడా చూస్తున్నాం. దేశంలోని వివిధ కార్పొరేట్ ఆస్పత్రులు ఏడాదికి సుమారు లక్ష కోట్ల రూపాయలు ఆర్జిస్తున్నాయంటే దోపిడీ ఏ స్థాయిలో వుందో అర్థం చేసుకోవొచ్చు.

మనిషికి రోగం వస్తే మొక్కేది ఇద్దరికే. ఒకటి కనిపించని దేవుడు, రెండు కళ్లెదుట కనిపించే దైవ సమానుడైన వైద్యుడు. ఎలాంటి వ్యాధి వచ్చినా ప్రాణాలు కాపాడుతాడన్న నమ్మకంతో వైద్యుల దగ్గరకు వెళ్తారు. కానీ వైద్యాన్ని పవిత్రమైన వృత్తిగా భావించి సేవలు అందించేందుకు ప్రయత్నించే వైద్యులు నూటికో, కోటికో ఒకడు అన్నట్టు ఎక్కడో కానీ కన్పించడం లేదు. చార్వాకుడు, శుశ్రూషుడు వంటి మహావైద్యుల వారసులుగా చెప్పుకునే డాక్టర్లు, నైతిక విలువలకు తిలోదకాలు ఇచ్చి ధనార్జనే ధ్యేయంగా కొనసాగుతున్నారు. అలాగని అందరినీ ఓకేగాట కట్టడం భావ్యం కాదు. రోగి ప్రాణాలను ఎలాగైనా నిలపాలన్న సంకల్పంతో అహర్నిశలు కృషి చేసే సేవా 'గుణవంతులు' కూడా అక్కడక్కడా లేకపోలేదు. అటువంటి వారినే ప్రత్యక్ష దైవాలుగా భావిస్తారు జనం. అటువంటి సేవామూర్తులకు శతకోటి దండాలు. కానీ ఎక్కువ మంది వైద్యులు రోగి ప్రాణాలు కంటే డబ్బుకే ఎక్కువ ప్రాధాన్యత నీయడం శోచనీయం. కమీషన్లకు కక్కుర్తి పడి బారెడు మందుల చీటీ రాసిచ్చే వాళ్లు, పోటీతత్వం వల్ల, రోగిని పరీక్షించకుండానే మందులు, టెస్టులు రాసే డాక్టర్లు లేకపోలేదు. మరికొన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఆరోగ్య బీమా విషయంలో పేచీలు పెడుతున్నారు. కార్డు చూసి జాయిన్ చేసుకుని, వైద్యం అందించి, తీరా లక్షల్లో బిల్లు వేశాక, కార్డు చెల్లదు సొమ్ము కట్టాల్సిందేనని రభస చేసే వాళ్లూ వున్నారు. బిల్లులో పారదర్శకత లేకపోవడం, అర్థం కాని పదాలతో తప్పుడు బిల్లులు రూపొందించి దోచుకోవడం కూడా మరో మార్గంగా కనిపిస్తోంది. వైద్య వృత్తికి సంబంధించి ప్రత్యేక నైతిక నియమావళి ఉంది. పేద, పెద్ద తేడా లేకుండా రోగులందరిని ఒకేలా చూడాలని వైద్యశాస్త్ర నైతిక విలువలు చెబుతున్నాయి. ఏ ఒక్కరోగికి హాని చేయకూడదని, ప్రజా విశ్వాసం పొందేందుకు అహర్నిశలు కృషి చేయాలని, వైద్య వృత్తి పవిత్రతను కాపాడేందుకు అంకితం కావాలని నియమావళి పేర్కొన్నది. అన్నిటికంటే ముఖ్యమైది. రోగి ఆరోగ్యసమాచారాన్ని కుటుంబంలోని ముఖ్య సభ్యులకు మినహా మరెవరికీ తెలియపర్చకూడదన్నది కూడా ఒకానొకనియమమే. అనుచితమార్గాల్లో ఆదాయం సమకూర్చుకోవడం కూడా అనైతికమే! ఫార్మాస్యూటికల్ కంపెనీలు, వైద్య పరికరాలు విక్రయించే సంస్థల నుంచి లంచాలు, బహుమతులు స్వీకరించకూడదన్నది కూడా నైతిక విలువలకు సంబంధించిన ముఖ్యాంశమే !!ఇలాంటి నియమాలను కొన్నింటినైనా పాటించే 'ఆదర్శ వైద్యులు' ఎక్కడున్నారో వెదుకుదాం.

మనిషి మనుగడకు జీవాధారమైన వైద్య వృత్తికి అంటిన కళంకాన్ని శుద్ధి చేయడం అందరి బాధ్యత. డొనేషన్ల చదువుల్ని ఆపేయడం సభ్యత. కోట్లు కుమ్మరించి అనుమతులు సంపాదించే ప్రైవేటు వైద్యకళాశాలల్ని బహిష్కరించాలి. ప్రభుత్వాలే ఎక్కువ సంఖ్యలో వైద్యకళాశాలలు ఏర్పాటు చేసి వైద్య విద్య అభివృద్ధికి తోడ్పాటునందించాలి. ఇప్పటికే వున్న ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరచడానికి కృషి చేయాలి. శాశ్విత ప్రాతిపదికన వైద్యుల, ఇతర సిబ్బంది నియామకం చేపట్టాలి. అప్పుడే వైద్యం 'సేవావృత్తి'గా మిగులుతుంది.

జర్నలిజం పూర్వపు విభాగాధిపతి డీన్,
ఆంధ్ర విశ్వవిద్యాలయం, 9393100566.

హిజాబ్ బాధితురాలికి జార్ఖండ్ ప్రభుత్వం బంపర్ ఆఫర్

రాంచీ: బీహార్‌లో హిజాబ్ వ్యవహారం తీవ్ర దుమారం రేపింది. డిసెంబర్ 15న పట్నాలో వైద్యులకు నియామక పత్రాలు అందజేస్తుండగా ఒక ముస్లిం వైద్యురాలి హిజాబ్‌ను ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ తొలగించారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ప్రతిపక్ష పార్టీలు దుమ్మెత్తిపోశాయి. నితీష్ కుమార్ మానసిక స్థితి బాగోలేదని ఆర్జేడీ ఆరోపించింది. పాకిస్థాన్ గ్యాంగ్‌స్టర్ అయితే క్షమాపణ చెప్పకపోతే చంపేస్తానంటూ నితీష్‌కుమార్‌ను బెదిరించాడు. తాజాగా హిజాబ్ బాధిత వైద్యురాలు నుస్రత్ పర్వీన్‌కు జార్ఖండ్ ప్రభుత్వం బంపర్ ఆఫర్ ప్రకటించింది. జార్ఖండ్‌లో మంచి ఉద్యోగం ఇస్తామని ఆరోగ్య మంత్రి ఇర్ఫాన్ అన్సారీ ప్రకటించారు. హెల్త్ సర్వీసులో నెలకు రూ.3 లక్షల జీతం, నచ్చిన పోస్టింగ్, ప్రభుత్వ వసతి, పూర్తి భద్రతతో కూడిన ఉద్యోగం ఇస్తామని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ నేతృత్వంలోనే ఉద్యోగ నియామకం జరుగుతుందని వెల్లడించారు. గౌరవంతో పాటు భద్రత హామీ ఇస్తామని తెలిపారు. బీహార్‌లో వైద్యురాలి విషయంలో అసభ్యకరమైన, అమానవీయమైన, హృదయ విదారక సంఘటన యావత్తు దేశ మనస్సాక్షిని బాధపరించిందన్నారు. హిజాబ్‌ను లాగడం అవమానకరమైన చర్యగా పేర్కొన్నారు. ఇది రాజ్యాంగంపై జరుగుతున్న దాడిగా తెలిపారు. తాను కూడా మొదట వైద్యుడినేనని, తర్వాతే మంత్రిని అయినట్లు ఇర్ఫాన్ అన్సారీ చెప్పారు.

కమ్ముకున్న పొగమంచు

100 విమానాలు రద్దు

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీని పొగమంచు కమ్మేసింది. ఢిల్లీ వీధులన్నీ శనివారం తెల్లవారుజామున పొగమంచుతో నిండిపోయాయి. దీంతో చూపు కనబడడమే కష్టమైంది. స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం ఎనిమిది గంటలకు ఏక్యూఐ 384గా ఉంది. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్రకారం కొన్ని ప్రాంతాల్లో కాలుష్యం తీవ్ర స్థాయిలో ఉన్నట్లు తెలిసింది. నగరంలోని అనేక ప్రాంతాల్లో కాలుష్యం స్థాయి ఆందోళనకరంగా ఉంది. సీపీసీబీ ప్రకారం సరాయి కాలే ఖాన్ వద్ద ఏక్యూఐ 428గా ఉంది. అక్షర్‌దామ్ వద్ద 420, తులారామ్ మార్గ్ వద్ద 403, ఆనంద్ విహార్ వద్ద 428, అశోక్ విహార్ వద్ద 407, ఐటీవో వద్ద ఏక్యూఐ 429గా నమోదయ్యాయి. వాయు నాణ్యత తగ్గిపోవడంతో ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ కమిషన్ కఠిన చర్యలు తీసుకుంది. గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ఢిల్లీతో పాటు ఎన్సీఆర్ ప్రాంతంలో స్టేజ్-4 ప్రణాళిక అమలు చేస్తోంది. గ్రాప్-4 ప్రకారం నిర్మాణ పనులను ఆపేస్తారు. డీజిల్ వాహనాలపై ఆంక్షలు విధించారు. తీవ్రమైన పొగమంచు ఉన్న కారణంగా... ఇందిరా గాంధీ విమానాశ్రయ ప్రయాణికులకు అడ్వైజరీ జారీ చేశారు. విమానాల తాజా సమాచారం కోసం సంబంధిత ఎయిర్‌లైన్ సంస్థలను సంప్రదించాలని ప్రయాణికులకు సూచన చేసింది. పొగమంచు వల్ల సుమారు 100 విమానాలు రద్దు అయ్యాయి. 50 రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి.

ఎంత బలమైన దేశమైనా ఇతరులపై ఇష్టాలు రుద్దొద్దు: జైశంకర్

పూణె: శక్తిమంతమైన దేశమైనా తన ఇష్టాలను ఇతరులపై రుద్దడం సరికాదని విదేశాంగమంత్రి ఎస్.జైశంకర్ స్పష్టం చేశారు. ప్రపంచీకరణ మన ఆలోచన, పనివిధానాల్లో ఎన్నో మార్పులు తీసుకువచ్చిందని అన్నారు. మహారాష్ట్ర పూణెలోని సింబయోసిస్ ఇంటర్నేషనల్ (డీమ్డ్ యూనివర్సిటీ)లో శనివారం జరిగిన స్నాతకోత్సవంలో కేంద్రమంత్రి మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక, రాజకీయ వ్యవస్థల్లో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయని, అనేక అధికార కేంద్రాలు ఉద్భవించాయని మంత్రి జైశంకర్ చెప్పారు. 'అధికారం అనేదానికి ఎన్నో అర్థాలు ఉంటాయి. వాణిజ్యం, మిలిటరీ, ఇంధనం, సాంకేతికత, ప్రతిభ ఆధారంగా ఇవి మారుతుంటాయి. ఈ అధికారం ఏ ఒక్కదేశానికి పరిమితం కాదు. ఈ విషయాన్ని గ్లోబల్ పవర్స్ గుర్తించాల్సిన అవసరం ఉంది. ఎంత శక్తిమంతమైన దేశమైనా తన ఇష్టాలను ఇతరులపై రుద్దలేదు. అంతేకాకుండా ప్రపంచ దేశాల మధ్య సహజమైన పోటీ ఉంది' అని మంత్రి పేర్కొన్నారు. భారత్ వంటి పెద్ద ఆర్థిక వ్యవస్థలు తయారీ రంగంలో దూసుకువెళ్లాల్సిన ఆవశ్యకతను గుర్తుచేశారు. ప్రస్తుతం భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం కోసం చర్చలు జరుగుతున్నాయి. ఇరుపక్షాల మధ్య చర్చలు జరుగుతుండగానే భారత వస్తువులపై టారిఫ్‌ను రెట్టింపు చేసి 50 శాతానికి ట్రంప్ చేర్చిన సంగతి తెలిసిందే. అమెరికా నుంచి వచ్చే వ్యవసాయ దిగుమతులపై భారత్ పన్నులు తగ్గించాలని అమెరికా కోరుతోంది. అందుకు భారత్ అంగీకరించడం లేదు. ఈ నేపథ్యంలోనే టారిఫ్‌లను ట్రంప్ ఆయుధంగా వాడుకుంటున్నారు.

పార్లమెంటులో అణు బిల్లు 'బుల్డోజ్'

స్నేహితుడు ట్రంప్ కోసమే 'శాంతి బిల్లు'

కాంగ్రెస్ నేత జైరాం రమేశ్

న్యూఢిల్లీ : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తన 'ఒకప్పుడు మంచి స్నేహితుడు' తో 'శాంతి'ని పునరుద్ధరించడానికి సహాయపడటానికి మాత్రమే శాంతి బిల్లును పార్లమెంటులో 'బుల్డోజర్' చేశారని కాంగ్రెస్ పార్టీ విమర్శించింది. 2026 కోసం అమెరికా జాతీయ రక్షణ అధికార చట్టంలో లేవనెత్తిన ఆందోళనకు పౌర బాధ్యత కోసం అణు నష్ట చట్టంలోని కీలక నిబంధనలను శాంతి బిల్లు తొలగిస్తుందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ తెలిపారు. 2026 ఆర్థిక సంవత్సరానికి గాను అమెరికా జాతీయ రక్షణ అధికార చట్టంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం చేశారని పేర్కొంటూ, 'చట్టం 3,100 పేజీల పొడవు ఉంది. పేజీ 1,912 అణు బాధ్యత నియమాలపై అమెరికా, భారతదేశం మధ్య ఉమ్మడి అంచనాకు సూచన ఉంది' అని 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. 'ఈ వారం ప్రారంభంలో పార్లమెంటు ద్వారా శాంతి బిల్లును ప్రధాన మంత్రి ఎందుకు బుల్డోజర్ చేశారో ఇప్పుడు మనకు కచ్చితంగా తెలుసు. ఇతర విషయాలతో పాటు పార్లమెంటు ఏకగ్రీవంగా ఆమోదించిన పౌర బాధ్యత చట్టం-2010 కి సంబంధించిన కీలక నిబంధనలను కూడా ఇది తొలగించింది. ఇది తన ఒకప్పటి మంచి స్నేహితుడితో శాంతిని పునరుద్ధరించడానికి' అని కాంగ్రెస్ నాయకుడు తన పోస్ట్‌లో అమెరికా చట్టం ప్రతిని పంచుకున్నారు. 'శాంతి చట్టాన్ని ట్రంప్ చట్టం - రియాక్టర్ వినియోగ, నిర్వహణా హామీ చట్టం' అని పిలుస్తారు' అని జైరాం రమేశ్ పేర్కొన్నారు.

రాజ్యసభలో ఈ బిల్లుపై మాట్లాడుతూ అణు విద్యుత్ మౌలిక సదుపాయాలను నిర్మించడంలో ప్రభుత్వ రంగాన్ని పణంగా పెట్టి ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహించవద్దని జైరాం రమేశ్ ప్రభుత్వాన్ని కోరారు. ఇంధన సామర్థ్యాన్ని పెంచడానికి అందుబాటులో ఉన్న స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థల పైకి ప్రైవేట్ సంస్థలు ప్రవేశించలేవని, అందువల్ల అవి అణు రంగం వృద్ధికి చోదకంగా ఉండలేవని కూడా ఆయన అన్నారు. గురువారం పార్లమెంటు అణు ఇంధన బిల్లును ఆమోదించింది. అయితే ప్రతిపాదిత చట్టాన్ని పార్లమెంటరీ కమిటీకి పంపాలని ప్రతిపక్ష సభ్యులు ప్రతిపాదించిన అనేక సవరణలను తిరస్కరించింది.

వాట్సాప్ గ్రూపులతో ముడుపులు

బొగ్గు కుంభకోణంలో విస్తుపోయే వాస్తవాలు

రాయ్‌పూర్: చత్తీస్‌గఢ్‌లో దాదాపు రూ.540 కోట్ల మేర జరిగిన భారీ బొగ్గు కుంభకోణం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఈ దోపిడీ వెనుక ఉన్న సిండికేట్ సభ్యులు అత్యంత తెలివిగా డిజిటల్ నెట్‌వర్క్‌ను వాడుకున్నట్లు దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. 'బిగ్ బాస్', 'జుగ్ను', 'టవర్' వంటి వింత పేర్లతో వాట్సాప్ గ్రూపులు సృష్టించి... అధికారుల కళ్లు గప్పి వసూళ్లకు పాల్పడ్డారు. డబ్బు అందినట్లు సూచించడానికి 'గిరా' లేదా 'ఇన్' వంటి కోడ్ వాడటం ఈ సిండికేట్ పక్కా ప్రణాళికకు నిదర్శనంగా నిలుస్తోంది. ఈ కుంభకోణంలో రాజకీయ ప్రముఖులు, ఉన్నతాధికారుల పాత్రపై విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. మాజీ ముఖ్యమంత్రి భూపేశ్ బాగెల్ డిప్యూటీ సెక్రటరీ సౌమ్య చౌరాసియా ఈ నెట్‌వర్క్‌లో కీలక సూత్రధారిగా ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఆమె ప్రైవేట్ కార్యదర్శి జయచంద్ కోస్లే ద్వారా ఫైళ్లు కదలండంతో పాటు నగదు వసూళ్లు జరిగినట్లు 1,000 పేజీల చార్జిషీట్‌లో అధికారులు పేర్కొన్నారు. ముఖ్యంగా ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంఓ) పేరు వాడుకుంటూ అధికార యంత్రాంగాన్ని ఈ సిండికేట్ శాసించిన తీరు చర్చనీయాంశంగా మారింది. వసూళ్ల కోసం ఈ సిండికేట్ ఒక ప్రత్యేకమైన 'డబుల్ లెవీ' వ్యవస్థను రూపొందించింది. ఎన్డీటీవీ కథనం ప్రకారం బొగ్గు రవాణా చేసే వ్యాపారుల నుండి టన్నుకు రూ.100 చొప్పున అక్రమంగా వసూలు చేసేవారు. ఇందుకోసం ఆన్‌లైన్ పర్మిట్ వ్యవస్థను కాదని, ఆఫ్‌లైన్ పర్మిట్‌లు ప్రవేశపెట్టి వ్యాపారులను బెదిరించినట్లు దర్యాప్తులో తేలింది. వసూలు చేసిన కోట్లాది రూపాయలను సిండికేట్ సభ్యులు పంచుకోవడమే కాకుండా... పెద్ద ఎత్తున స్థిరాస్తులు కొనుగోలు చేయడానికి మళ్లించారు. ఈ కేసులో ఈడీ, ఏసీబీ ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నాయి. ఇప్పటివరకు రూ.222 కోట్ల విలువైన ఆస్తులు జప్తు చేయగా... రాను సాహు, సమీర్ విష్ణోయ్ తదితర ఐఏఎస్ అధికారులతో పాటు 15 మందిని అరెస్ట్ చేశారు.

అధిష్ఠానం పిలుపు కోసం వేచి ఉన్నాం

నాయకత్వ సమస్యపై డీకే శివకుమార్

బెంగళూరు: రాష్ట్రంలో నాయకత్వ సమస్యపై కాంగ్రెస్ అధిష్ఠానం 'తగిన సమయంలో' మమ్మల్ని పిలుస్తుందని కర్నాటక ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ అన్నారు. తనకు, ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు మధ్య ఉన్న నాయకత్వ సమస్య మళ్లీ తెర పైకి వస్తున్న నేపథ్యంలో ఈ విషయంపై చర్చించడానికి ఎప్పుడు ఢిల్లీకి రావాలనే విషయాన్ని కాంగ్రెస్ అధిష్ఠానం ఇద్దరి నాయకులకు చెప్పిందని శనివారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ తెలిపారు. ఇటీవల ముగిసిన శాసన సభ సమావేశాల తర్వాత పార్టీ అధిష్ఠానాన్ని కలవడానికి మీరు, సిద్ధరామయ్య దేశ రాజధానికి వెళ్లే అవకాశం ఉందా ప్రశ్నించగా, 'నేను మీకు తెలియజేస్తాను. తెలియజేయకుండా నేను ఏమీ చేయను. నేను మీ నుంచి దాక్కునేందుకు వెళ్లను' అని అన్నారు. అధిష్ఠానం నుంచి ఆహ్వానం ఏదైనా ఉందా అని అడిగినప్పుడు... 'వారు (అధిష్ఠానం) మా ఇద్దరినీ తగిన సమయంలో పిలుస్తామని చెప్పారు. మేము పిలుపు కోసం వేచి ఉంటాము' అని కాంగ్రెస్ కర్నాటక అధ్యక్షుడు తెలిపారు. శివకుమార్ ప్రకటన చేసిన ఒక రోజు తర్వాత సిద్ధరామయ్య అసెంబ్లీలో తాను పదవిలో కొనసాగుతానని నొక్కి చెప్పారు. కాంగ్రెస్ అధిష్ఠానం 'నాకు అనుకూలంగా' ఉందని, తన డిప్యూటీతో అధికార భాగస్వామ్యంపై 2023 ఒప్పందం ప్రకారం, అతను రెండున్నర సంవత్సరాలు మాత్రమే అధికారంలో ఉండాలనే దానిపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని ఆయన నొక్కి చెప్పారు. ఇదిలాఉండగా కాంగ్రెస్ అధిష్ఠానం ప్రమేయంతో తాను, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఒక ఒప్పందానికి వచ్చామని, వారిద్దరూ దానికి కట్టుబడి ఉంటారని శివకుమార్ చెప్పారు. నవంబరు 20న కాంగ్రెస్ ప్రభుత్వం తన ఐదేళ్ల పదవీకాలం సగం పూర్తి చేసుకున్న తర్వాత, రాష్ట్రంలో ముఖ్యమంత్రి మార్పు గురించి ఊహాగానాలు చెలరేగుతున్న నేపథ్యంలో అధికార పార్టీలో అధికార పోరు తీవ్రమైంది. 2023లో సిద్ధరామయ్య, శివకుమార్ మధ్య జరిగిన 'అధికార భాగస్వామ్య' ఒప్పందం ఈ ఊహాగానాలకు ఆజ్యం పోసింది. కొంతమంది 'నాగ సాధువులు' డిప్యూటీ సీఎం నివాసాన్ని సందర్శించి ఆయనను ఆశీర్వదించారు. ఇదే సమయంలో కొంత మంది 'నాగ సాధువులు' ఉప ముఖ్యమంత్రి నివాసానికి వెళ్లి ఆయనను ఆశీర్వదించారు. మరోవైపు, మంగళవారం తాను ఢిల్లీ వెళ్లి కేంద్ర మంత్రులను కలవనున్నట్లు జలవనరుల శాఖ మంత్రి కూడా అయిన శివకుమార్ తెలిపారు. నదుల అనుసంధానం గురించి కేంద్ర జల వనరుల విభాగం తమను పిలిచిందని అన్నారు. 'నేను అక్కడికి వెళ్లి మహాదాయి, కృష్ణా జల అవార్డు, మేకెదాతు, అప్పర్ బద్ర వంటి రాష్ట్ర నదీ ప్రాజెక్టులకు సంబంధించిన విషయాలను చర్చిస్తాను' అని చెప్పారు. కేంద్ర జల వనరుల మంత్రి, అటవీ మంత్రి, పట్టణాభివృద్ధి మంత్రిని కూడా కలుస్తానని అన్నారు. 'చాలా సమస్యలు ఉన్నాయి. మేము వారిని రాష్ట్ర ఎంపీలతో కలిసి కలవాలనుకుంటున్నాము. అయినప్పటికీ నేను వెళ్లి కలుస్తాను. ఆ తర్వాత, అవసరమైతే, ప్రధాన మంత్రిని కూడా సమస్యలతో కలుస్తాము' అని శివకుమార్ తెలిపారు. ప్రస్తుత గ్రామీణ ఉపాధి చట్టం ఎంజీఎన్ఆర్ఈజీఏను భర్తీ చేసి దాని నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగించినందుకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వాన్ని విమర్శిస్తూ... ఇది జాతిపితను అవమానించిందని శివకుమార్ ఆరోపించారు. కరెన్సీ నోట్ల నుంచి గాంధీజీ చిత్రాన్ని తొలగించగలరా అని ఆయన ప్రభుత్వాన్ని సవాలు చేశారు. 'దేశం గాంధీని కోరుకుంటోంది. దేశ ప్రజలు దీనికి ప్రతిస్పందిస్తారు' అని తెలిపారు. 'వారు గాంధీ పేరును మార్చాలనుకుంటున్నారు... గాంధీ చిత్రాన్ని కూడా మార్చనివ్వండి' అని ఆయన కరెన్సీ నోటును చూపిస్తూ అన్నారు. 'గాంధీ పేరుతో మేము సోనియా గాంధీ, దివంగత మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ నాయకత్వంలో ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభించాము. వారు ఈ పథకాన్ని రద్దు చేయాలనుకుంటున్నారు. అందువల్ల వారు దాని పేరును మార్చారు. కర్నాటక నుంచే దీనికి వ్యతిరేకంగా పెద్ద ఉద్యమం ప్రారంభమవుతుంది' అని ఆయన తెలిపారు.

మలయాళ నటుడు శ్రీనివాసన్ మృతి

తిరువనంతపురం: మలయాళ చిత్ర పరిశ్రమలో విషాదం చోటుచేసుకుంది. సీనియర్ నటుడు, దర్శకుడు శ్రీనివాసన్ (69) మృతిచెందారు. అనారోగ్యం కారణంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన శనివారం ఉదయం తుదిశ్వాస విడిచారు. శుక్రవారం రాత్రి ఆయన తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో కుటుంబ సభ్యులు ఆయనను త్రిపునితురలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతున్న ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించడంతో చనిపోయారు.

శ్రీనివాసన్ మృతితో మలయాళ చిత్ర పరిశ్రమలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. సినీ, రాజకీయ ప్రముఖులు సంతాపం తెలియజేశారు. శ్రీనివాసన్ 1956 ఏప్రిల్ 6వ తేదీన కేరళలోని పట్యంలో జన్మించారు. సినిమాలపై ఆసక్తితో చెన్నైలోని ఫిల్మ్ స్కూల్‌లో శిక్షణ పొందారు. 1977లో విడుదలైన 'మని ములక్కమ్' సినిమాతో చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టారు. ఇప్పటి వరకు 225 సినిమాల్లో నటించారు. తనకంటూ ఓ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. కేవలం నటుడిగానే కాకుండా రచయితగా, డైరెక్టర్‌గా, నిర్మాతగా తన సత్తా చాటారు. రాష్ట్ర, జాతీయ అవార్డులు గెలుచుకున్నారు.

శ్రీనివాసన్ మృతికి సీఎం సహా ప్రముఖుల నివాళి

దర్శకుడు, రచయిత శ్రీనివాసన్ భౌతికకాయానికి పలువురు సినీ ప్రముఖులు నివాళులు అర్పించారు. స్టార్ హీరోలు మమ్ముట్టి, మోహన్ లాల్ శ్రీనివాసన్‌కు నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న శ్రీనివాసన్ చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఐదు దశాబ్దాలపాటు కేరళ చిత్ర పరిశ్రమకు ఆయన సేవలు అందించారు. 'వడక్కునోక్కియంత్రం', 'చింతవిశిష్టాయ శ్యామల' వంటి చిత్రాలకు ఆయన దర్శకత్వం వహించడమే కాకుండా రాష్ట్ర, జాతీయ అవార్డులను కూడా అందుకున్నారు. ఆయనకు ఇద్దరు కుమారులు వినీత్ శ్రీనివాసన్, ధ్యాన్ శ్రీనివాసన్ . వీరు కూడా మలయాళ చిత్ర పరిశ్రమలో నటులుగా, దర్శకులుగా రాణిస్తున్నారు. శీనివాసన్ మృతికి కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ సహా పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు ప్రగాఢ సంతాపం తెలిపారు.

రూ.40 లక్షలతో పని మనిషి పరారీ

న్యూఢిల్లీ: ఇంట్లో పనిమనిషిగా చేరిన ఓ వ్యక్తి రూ.40 లక్షల నగదు ఎత్తుకెళ్లిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పశ్చిమ ఢిల్లీలోని పంజాబీ బాగ్‌లో ఈ చోరీ జరిగింది. ఓ వ్యక్తి తన తండ్రిని చూసుకునేందుకు పనిమనిషిని ఇంట్లో పెట్టుకున్నాడు. అయితే పనిలో చేరిన 15 రోజులకే అతడు దొంగతనానికి పాల్పడ్డాడు. నవంబరు 29న ఈ ఘటనకు సంబంధించి ఫిర్యాదు నమోదైంది. బీఎన్ఎస్ చట్టం కింద కేసు రిజిస్టర్ చేశారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇంటి పరిసర ప్రాంతాలను విశ్లేషించారు. ధ్రువ్ అనే వ్యక్తి ఇంట్లో నుంచి ఖాళీ చేతులతో వెళ్తున్న దృశ్యాలు తొలుత కనిపించాయి. కానీ మరో ప్రాంతంలో అతడు తన మిత్రులు జతిన్, శివమ్‌తో కలిసి తిరగడం కనిపించింది. శివన్ అనే వ్యక్తి బ్లాక్ కలర్ బ్యాగు తీసుకెళ్తున్నట్లు ఓ క్లిప్‌లో గుర్తించారు. ఘటన తర్వాత ముగ్గురు వ్యక్తులు తమ ఫోన్లను స్విచాఫ్ చేశారు. ఢిల్లీలో వారి కోసం పోలీసులు గాలించారు. వారి జాడ గుర్తించలేకపోయారు. ఫోన్ కాల్ రికార్డులను పరిశీలించారు. వాళ్లు ఢిల్లీ దాటి వెళ్లినట్లు నిర్ధారించారు. జమ్మూకశ్మీర్‌లో ఉన్నట్లు గుర్తించారు. ధ్రువ్, జతిన్ కోర్టులో సరెండర్ అయ్యారు. శివమ్ అనే వ్యక్తి క్యాబ్‌లో హిమాచల్ ప్రదేశ్ వెళ్లినట్లు తేల్చారు. క్యాబ్ డ్రైవర్ సమాచారం ఆధారంగా శివమ్ ఉన్న లొకేషన్‌ను గుర్తించారు. శివమ్ ఉంటున్న హోటల్ చేరుకున్న పోలీసులు అతడిని బంధించారు. రూ. 36 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎత్తుకెళ్లిన సొమ్ముతో బ్రాండెడ్ షూలు, బట్టలు కొన్నట్లు గుర్తించారు.

రాష్ట్రాలపై భారం మోపేందుకే...

జీ రామ్ జీ బిల్లుపై ఒమర్ అబ్దుల్లా



శ్రీనగర్: 'సవరించబడిన ఎంజీఎన్ఆర్ఈజీఏ బిల్లు' హానికరమని, కేంద్రం ఈ పథకం భారాన్ని రాష్ట్రాలపై వేసిందని జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా అన్నారు. శనివారం ఇక్కడ విలేకరులతో ఆయన మాట్లాడుతూ కొత్త బిల్లు పేరు... వికసిత్ భారత్ - రోజ్‌గార్ గ్యారెంటీ... అజీవిక మిషన్ (గ్రామీణ్) (విబి-జి రామ్ జి) బిల్లు - దీనిని 'జి మమ్మీ జీ' అనే బాలీవుడ్ సినిమాతో పోల్చడంపై కేంద్రంపై విమర్శలు గుప్పించారు. 'ఈ పేరు ఎక్కడి నుంచి వచ్చింది? నన్ను క్షమించండి. కానీ వారు జాగ్రత్తగా ఆలోచించిన తర్వాతే బిల్లుకు పేరు పెట్టాలి. ఇది నాకు పాత బాలీవుడ్ సినిమా 'జి మమ్మీ జీ'ని గుర్తు చేస్తుంది. 'బహుశా, చాలామంది ఆ సినిమా చూసి ఉండకపోవచ్చు. కానీ నా మేనల్లుడు చూశాడు. 'జి రామ్ జి! ఇది బిల్లుకు పెట్టాల్సిన పేరేనా?' అని ఆయన అన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ పేరును పథకం నుంచి తొలగించడం తప్పు అని సీఎం అబ్దుల్లా అన్నారు. 'మొదట, మీరు మహాత్మా గాంధీ పేరును తొలగించారు. అది తప్పు తర్వాత మీరు ఈ పథకం భారాన్ని రాష్ట్రాలపై వేశారు. ఈ బిల్లులో మనలాంటి రాష్ట్రాలకు హాని కలిగించే, మనకు ప్రయోజనం చేకూర్చని అనేక మార్పులు ఉన్నాయి' అని తెలిపారు. ఢిల్లీలో ఉన్నప్పుడు తాను బీజేపీని ప్రశంసిస్తానని ప్రతిపక్షం చేసిన ఆరోపణ గురించి అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ, కేంద్రం ఏదైనా సరైనది చేసినప్పుడు తాను దానిని అభినందిస్తానని, కానీ తప్పులు జరిగినప్పుడల్లా తాను ఎల్లప్పుడూ ఎత్తి చూపుతానని' అబ్దుల్లా అన్నారు. 'నేను ఇక్కడ, ప్రతిచోటా అలా అంటున్నాను. ప్రజలను మోసం చేయడానికి రాజకీయాలు చేసే వారిలో నేను లేను. కేంద్రం ఎక్కడ సహాయం అందించినా నేను దానిని చెబుతాను. ఎక్కడ ఏవైనా లోపాలు ఉంటే, వాటిని కూడా నేను లేవనెత్తుతాను' అని ఆయన తెలిపారు. రాష్ట్ర హోదా విషయానికి వస్తే, కేంద్రం 'ఇతర విషయాలలో ఫిర్యాదుకు అవకాశం ఇవ్వలేదు. దాని గురించి ఫిర్యాదు చేయడానికి కారణాలు తప్ప మరేమీ ఇవ్వలేదు' అని అబ్దుల్లా అన్నారు. ఎవరినైనా బాధపెట్టకుండా అబద్ధం చెప్పడం తప్పు అని నొక్కి చెబుతూ, శ్రీనగర్‌లో, ఢిల్లీలో కేంద్రం చేసిన తప్పులను తాను ఎత్తి చూపానని ముఖ్యమంత్రి అన్నారు. 'నేను దీనిని ఢిల్లీలో మాత్రమే చెప్పను. నేను ఇక్కడ, సమావేశాలలో, బహిరంగ సభలలో, అసెంబ్లీలో చెబుతాను. నా అసెంబ్లీ ప్రసంగాలను పరిశీలించండి. కేంద్ర ప్రభుత్వం ఎక్కడ సరైనది చేసినా దానికి నా కృతజ్ఞతలు తెలియజేస్తానని నేను క్రమం తప్పకుండా చెప్పాను. తప్పులు ఎక్కడ ఉన్నా వాటిని నేను ఎత్తి చూపుతాను' అని ఆయన అన్నారు.

ఆటవిక పాలనకు స్వస్తి పలుకుదాం

చొరబాటుదారుల రక్షణకే ఎస్ఐఆర్‌పై వ్యతిరేకత

మమత సర్కారుపై మోదీ విమర్శలు

కోల్‌కతా: ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నేతృత్వంలోని అధికాం తృణమూల్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమబెంగాల్‌లో చొరబాటుదారులను కాపాడుతోందని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. అందువల్లే రాష్ట్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్)ను వ్యతిరేకిస్తోందన్నారు. మమత పాలనలో బెంగాల్లో అవినీతి, బంధుప్రీతి, బుజ్జగింపు రాజకీయాలు రాజ్యమేలుతున్నాయని, ఇటువంటి 'మహా జంగిల్ రాజ్'కు తగిన బుద్ధి చెప్పాలంటే డబుల్ ఇంజిన్ సర్కార్‌కు అవకాశం ఇవ్వాలని కోరారు. బెంగాల్‌లోని తాహెర్‌పూర్ ర్యాలీలో శనివారం వర్చువల్‌గా పాల్గొన్న ప్రధాని మోదీ ప్రసంగించారు. తృణమూల్ నేతలు తనను, బీజేపీని ఎంత వ్యతిరేకించినప్పటికీ బెంగాల్ అభివృద్ధిని మాత్రం తాము ఆపబోమని మోదీ అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి పనులను మమత ప్రభుత్వం అడ్డుకుంటోందని ఆరోపించారు. మమత పాలనలో ఉద్రిక్తతలు, అల్లర్లు, బెదిరింపులతో విసిగిపోయిన ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారని అన్నారు. బీహార్ ఎన్నికల ఫలితం బెంగాల్ ఎన్నికల్లో తమ విజయానికి బాటలు వేస్తుందన్న ఆశాభావం వ్యక్తంచేశారు.



వెనక్కి మళ్లిన మోదీ హెలికాప్టర్

ప్రతికూల వాతావరణం కారణంగా ప్రధాని మోదీ ప్రయాణిస్తోన్న హెలికాప్టర్ వెనక్కి మళ్లాల్సి వచ్చింది. పశ్చిమబెంగాల్‌లోని తాహెర్‌పూర్ హెలిప్యాడ్ వద్ద హెలికాప్టర్ దిగాల్సిఉండగా... వెలుతురు సరిగా లేక ల్యాండింగ్‌కు అంతరాయం ఏర్పడింది. ఉత్తర భారతాన్ని పొగమంచు కప్పేయడంతో ఈ పరిస్థితి తలెత్తిందని అధికారులు వెల్లడించారు. పశ్చిమబెంగాల్ పర్యటనలో భాగంగా శనివారం ఉదయం మోదీ కోల్‌కతా విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో తాహెర్‌పూర్ బయల్దేరారు. అయితే పొగమంచు కారణంగా హెలిప్యాడ్‌పై ల్యాండింగ్‌కు వీలు కాలేదు. దాంతో పైలట్ ల్యాండింగ్‌కు కొద్దిసేపు ప్రయత్నించి విఫలమవడంతో హెలికాప్టర్ తిరిగి కోల్‌కతా విమానాశ్రయం చేరుకుంది. వాతావరణ పరిస్థితి అనుకూలించేవరకు ప్రధాని అక్కడే వేచి చూశారని అధికారులు వెల్లడించారు. నాదియా జిల్లాలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మోదీ పాల్గొనాల్సి ఉంది. రోడ్డు మార్గంలో అక్కడికి వెళ్తే... ఇతర షెడ్యూళ్లకు అంతరాయం కలగనుండటంతో విమానాశ్రయంలోని వీఐపీ లాంజ్ నుంచే ఆయన వర్చువల్‌గా పాల్గొన్నారు.పశ్చిమబెంగాల్‌లోని నదియా జిల్లా రణఘాట్‌లో పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధానమంత్రి శంకుస్థాపన చేశారు. వీటిలో రూ.3,200 కోట్లతో నిర్మించనున్న రెండు జాతీయ రహదారి ప్రాజెక్టులు ఉన్నాయి. ఈ ప్రాజెక్టులు కోల్‌కతాను సిలిగురితో అనుసంధానిస్తూ సుమారు రెండు గంటల ప్రయాణ సమయం ఆదా చేస్తాయని పీఎంఓ తెలిపింది. ఈ ప్రాజెక్టులతో ఆర్థిక కార్యకలాపాలు విస్తృతం కావడంతో పాటు పర్యాటకం కూడా పెరుగుతుందని పేర్కొంది.

విజన్ లేని మోదీ ప్రసంగం

మతువా వర్గీయుల శ్రేయస్సుపై కనిపించని ఆందోళన: టీఎంసీ

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ తహేర్‌పూర్ ర్యాలీలో ప్రధాని మోదీ చేసిన ప్రసంగంలో విజన్ లోపించిందని తృణమూల్ కాంగ్రెస్ విమర్శించింది. ఆయన మాటల్లో ఎక్కడ కూడా మతువా వర్గీయుల ఊసే లేదని పేర్కొంది. ఎస్ఐఆర్ తర్వాత వెలువడిన ముసాయిదా ఓటర్ల జాబితాల నుంచి పేర్లు తొలగించబడి, అగమ్యగోచరంగా మారిన మతువా వర్గీయుల పరిస్థితిపై ఆయనలో ఏ మాత్రం ఆందోళన కనిపించలేదని వ్యాఖ్యానించింది. టీఎంసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కునాల్ ఘోష్ శనివారం విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ పాలిత రాష్ట్రాల్లో బెంగాలీ మాట్లాడే వారు వేధింపులకు గురవుతుండటం గురించీ మోదీ ఒక మాట కూడా మాట్లాడలేదన్నారు. ఆయన ప్రసంగంలో ముందుచూపు, బాధ్యత లోపించాయని విమర్శించారు. దళిత-హిందూ శరణార్థి 'మతువా' వర్గం బంగ్లాదేశ్ నుంచి వలస వచ్చింది. 2002 తర్వాత జరిగిన రాష్ట్రవ్యాప్త ఎస్ఐఆర్‌తో రాష్ట్ర ఓటర్లలో వారి గుర్తింపు, పౌరసత్వంపై భయాందోళన మొదలైంది. రాష్ట్రవ్యాప్తంగా 58,20,898 మంది పేర్లు ముసాయి జాబితా నుంచి తొలగించారు. దీంతో బెంగాల్ ఓటర్ల సంఖ్య 7.66 కోట్ల నుంచి 7.08 కోట్లకు తగ్గింది. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పోలీసుల ద్వారా దేశ పౌరులను బలవంతంగా బంగ్లాదేశ్‌కు పంపడంపైనా మోదీ మౌనం వహించారని ఘోష్ వ్యాఖ్యానించారు. న్యాయ వ్యవస్థ జోక్యంతో అలాంటి వారు స్వదేశానికి తిరిగి రాగలిగారని (జూన్‌లో బంగ్లాదేశ్‌కు తరలించిన సునాలీ ఖాతూన్ ఈనెల 6న భారత్‌కు తిరిగి రావడాన్ని ఉద్దేశించి) ఘోష్ అన్నారు. బెంగాల్‌లోని పేద ప్రజలకు సంబంధించి కేంద్ర ప్రాజెక్టులకు నిధులను ఎందుకు నిలిపివేశారో కూడా ప్రధాని వివరణ ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి లేదంటూ తప్పుడు కథనం వినిపించారని దుయ్యబట్టారు.గ్రామీణ ప్రాంతాల్లో సొంతిల్లు నిర్మించుకునే పరిస్థితిని పేదలకు ఎందుకు కల్పించలేదు? తాగునీటి ప్రాజెక్టును కేంద్రం ఎందుకు నిలిపి వేసింది? అని ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టుల కోసం మమత సర్కారు సొంతంగా నిధులు సమకూరుస్తోందని ఘోష్ తెలిపారు. మోదీ ర్యాలీ కోసం వస్తూ రైలు ప్రమాదంలో చనిపోయిన బీజేపీ కార్యకర్తల గురించీ మోదీ మాట్లాడలేదని అన్నారు. రద్దీని నియంత్రించడంలో మోదీ ప్రభుత్వ విధానం విఫలమైందని, అందుకే ప్రాణ నష్టం జరిగిందని ఘోష్ విమర్శించారు. వేదికకు వెళ్లే మార్గంలో సరైన ఏర్పాట్లు జరిగివుంటే ప్రాణ నష్టం జరిగేది కాదన్నారు. అయితే దట్టమైన పొగమంచు కారణంగా రైలు ఢీ కొని ముగ్గురు చనిపోగా, మరో ముగ్గురు గాయపడ్డారని రైల్వే అధికారుల ప్రకటన పేర్కొన్నారు. టీఎంసీ అధికార ప్రతినిధి అరూప్ చక్రవర్తి స్పందిస్తూ 'నరేంద్ర మోదీ గో బ్యాక్' వంటి పోస్టర్ల గురించి మోదీకి తెలిసింది. ప్రధాని, ఆయన పార్టీపై మతువా వర్గీయులు కోపంగా ఉన్నారు' అని అన్నారు. మతువా వర్గీయులకు న్యాయం చేసే చిత్తశుద్ధి మోదీకి లేదని విమర్శించారు.

ముగిసిన హదీ అంత్యక్రియలు

కిక్కిరిసిన అంతిమయాత్ర భారీ బందోబస్తు

ఢాకా: బంగ్లాదేశ్ యువ నేత, ఇంక్విలాబ్ మంచో సంస్థ కన్వీనర్ షరీఫ్ ఉస్మాన్ హదీ అంత్యక్రియలు శనివారం ముగిశాయి. రాజధాని ఢాకాలో అవాంఛనీయ ఘటనలు, ఆందోళనలు జరగకుండా అధికార యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించింది. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది. అంతిమ యాత్ర సాగే మార్గంలో బాడీ కెమెరాలు ధరించిన పోలీసులను భారీగా మోహరించింది. మధ్యాహ్నం 2 గంటల తర్వాత పార్లమెంటు హౌస్ సౌత్ ప్లాజా 'జాతీయ సంసద్ భవన్' వద్ద నుంచి అంతిమయాత్ర మొదలైంది. ఆ మార్గం ఇసుక వేస్తే రాలని చందంగా మారింది. అంతిమయాత్రలో విద్యార్థులు, యువజనులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఆపద్ధర్మ ప్రభుత్వాధినేత మహమ్మద్ యూనస్ కూడా పాల్గొన్నారు. హదీ మరణానికి సంతాప సూచకంగా బంగ్లాదేశ్ సంతాప దినాన్ని పాటించింది. అన్ని ప్రైవేటు, ప్రభుత్వ భవనాలపై బంగ్లాదేశ్ జెండాలు అవనతం చేశారు. 32 ఏళ్ల హదీ సింగపూర్‌లోని ఆసుపత్రిలో గురువారం కన్నుమూసిన విషయం విదితమే. అంతకుముందు హదీ అంత్యక్రియలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఫేస్‌బుక్ మాధ్యమంగా ఇంక్విలాబ్ మంచో పిలుపునిచ్చింది. సంయమం పాటించాలని హదీ అనుచరులకు, శ్రేయోభిలాషులకు, మద్దతుదారులకు సూచించింది. శుక్రవారం అర్ధరాత్రి వరకు అడపాదడపా ఘటనలు జరిగినప్పటికీ శనివారం బంగ్లాదేశ్ శాంతించినట్లు అధికారులు తెలిపారు.

హిందూ హత్య: ఏడుగురి అరెస్టు

బంగ్లాదేశ్ అల్లర్ల క్రమంలో హిందూ మతానికి చెందిన దీపూ చంద్రదాస్ (25) మూకదాడిలో చనిపోయారు. ఈ ఘటనపై యూనస్ ప్రభుత్వం స్పందించింది. ఇప్పటివరకు ఏడుగురిని అరెస్టు చేసింది. దోషులను కఠినంగా శిక్షిస్తామని పేర్కొంది. ప్రభుత్వ కమిషన్ అల్లర్లపై దర్యాప్తు చేస్తోందని అధికార వర్గాలు తెలిపాయి.

ఇమ్రాన్ ఖాన్‌కు మరో 17 ఏళ్ల జైలు

ఇస్లామాబాద్: పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు, ఆయన భార్య బుష్రాకు తోషఖానా కేసులో 17 ఏళ్ల శిక్ష పడింది. ఈ మేరకు శనివారం కోర్టు తీర్పు వెలువడింది. 2021లో ఇమ్రాన్, బుష్రా సౌదీలో పర్యటించారు. అక్కడి యువరాజు వీరికి ఖరీదైన బుల్గారి ఆభరణాలు బహుమతిగా ఇచ్చారు. ఇమ్రాన్ వాటిని తోషఖానాకు అప్పగించకుండా అమ్మేసుకున్నట్లు కేసు నమోదైంది. తాజా విచారణ క్రమంలో నేరం రుజువు అయి ఆయనకు శిక్ష ఖరారైంది. ఇమ్రాన్ రావల్పిండిలోని అడియాలా జైలులో ఉన్న సంగతి తెలిసిందే. ఆ జైలులోనే జడ్జి అర్జుమండ్ విచారణ జరిపారు, ఇమ్రాన్, బుష్రాకు 17ఏళ్ల శిక్ష, 1.64 కోట్ల పాకిస్థానీ రుపాయలు జరిమానా విధించారు. ఇమ్రాన్ వయస్సును, ఆయన భార్య మహిళ అనే అంశాలను పరిగణనలోకి తీసుకొని ఈ తీర్పు ఇచ్చినట్లు తెలిపారు. దీనిపై హైకోర్టుకు వెళతామని ఇమ్రాన్ ఖాన్ తరపు న్యాయవాది వెల్లడించారు.

సిరియాలో అమెరికా వైమానిక దాడులు

ఇస్లామిక్ స్టేట్ స్థావరాలే లక్ష్యం

న్యూయార్క్: సిరియాలోని ఇస్లామిక్ స్టేట్ స్థావరాలే లక్ష్యంగా అమెరికా భీకరంగా వైమానిక దాడులు చేసింది. సెంట్రల్ సిరియా వ్యాప్తంగా 70కుపైగా లక్ష్యాలపై యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు, క్షిపణులతో దాడి చేసినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) వెల్లడించింది. జోర్డాన్ విమానం కూడా దాడుల్లో పాల్గొన్నట్లు తెలిపింది. దీనిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందిస్తూ 'ఇస్లామిక్ స్టేట్ కు పట్టు ఉన్న ప్రాంతాల్లో భీకర దాడులు చేస్తున్నాం' అని అన్నారు. పాల్మైరా నగరంలో ఈనెల 13న ఇస్లామిక్ స్టేట్ జరిపిన దాడిలో ఇద్దరు అమెరికా సైనికులు, ఓ పౌరుడు ప్రాణాలు కోల్పోవడాన్ని గుర్తుచేస్తూ ఇది యుద్ధం కాదు ప్రతికార దాడి అని అమెరికా అధికారి ఒకరు వెల్లడించింది. ఇస్లామిక్ స్టేట్ యోధులు, మౌలిక వసతులు, ఆయుధ కేంద్రాలు లక్ష్యంగా తమ దాడులు జరిగాయని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్‌సేత్ తెలిపారు. 'ఆపరేషన్ హాక్‌ఐ'లో భాగంగా ఈ దాడి జరిగిందన్నారు. వత్రువులను వేటాడి చంపేశామని ప్రకటించారు. సెంట్రల్ సిరియాలోని ఇస్లామిక్ స్టేట్‌కు చెందిన అనేక లక్ష్యాలను ధ్వంసం చేసినట్లు ఇద్దరు అధికారులు తెలిపారు. అమెరికా సైనికులు సుమారు వెయ్యి మంది ఇంకా సిరియాలోనే ఉన్నారని అన్నారు.

అరబ్‌ను ముంచెత్తిన వర్షాలు

దుబాయి: యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో భారీ వర్షాలు కురిశాయి. అబుదాబీ, దుబాయితో పాటు అనేక ప్రాంతాలు జలమయమయ్యాయి. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. విమాన సేవలు నిలిచిపోయాయి. కొన్ని గంటల పాటు జనజీవనం స్తంభించింది. దాదాపు 24 ఏళ్ల తర్వాత ఎడారి దేశంలో ఇంత భారీ స్థాయిలో వర్షాలు కురిసినట్లు అధికారులు తెలిపారు. భారీ వర్షాలు, వరదలను ఎదుర్కోవడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అబుదాబీ, దుబాయిలో కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. ప్రభుత్వ ఉద్యోగులకు ఇంటి నుంచి పని చేసే వెసులుబాటును దుబాయి ప్రభుత్వం కల్పించింది. ప్రైవేటు కంపెనీలు సైతం ఇదే విధానాన్ని పాటించాలని కోరింది. అత్యవసరమైతే తప్ప గడప దాటొద్దని ఆదేశించింది. బీచ్‌లు, పార్కులు, పర్యాటక ప్రదేశాలను తాత్కాలికంగా మూసివేసింది.

నిలకడగా ఖలీదా జియా ఆరోగ్యం

ఢాకా: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని ఖలీదా జియా ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని ఆమె వ్యక్తిగత వైద్యుడు ఏజెడ్ఎం జాహిద్ హుస్సేన్ తెలిపారు. 80 ఏళ్ల జియా నవంబరు 23వ తేదీ నుంచి ఎవర్ కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆమెకు ఈనెల 11న వెంటిలేటర్ ఏర్పాటు చేశారు. గత నెల రోజులతో పోల్చుకుంటే జియా ఆరోగ్యంలో మెరుగుదల ఉన్నట్లు హుస్సేన్ వెల్లడించారు. ఆరోగ్యం మరింతగా క్షీణించే ముప్పు తప్పిందని చెప్పారు. శుక్రవారం ఆమెకు శస్త్రచికిత్స విజయవంతంగా జరిగిందని, కోలుకునే అవకాశాలు పెరిగాయని హుస్సేన్ తెలిపారు. కాగా, గత 17 ఏళ్లుగా లండన్‌కు పరిమితమైన జియా కుమారుడు తారిక్ రెహమాన్ ఈనెల 25న బంగ్లాదేశ్‌కు రానున్నట్లు వెల్లడించారు.

అమెరికాలో ఉండండి... ఉద్యోగులకు గూగుల్ ఆదేశం

వాషింగ్టన్: అనివార్యమైతే తప్ప అమెరికాను వీడొద్దని తమ ఉద్యోగులకు గూగుల్ సంస్థ ఆదేశించింది. విదేశాలకు వెళ్లాల్సిన పరిస్థితుల్లో ముందస్తుగానే మేనేజర్లకు, ఇమ్మిగ్రేషన్ బృందానికి సమాచారం ఇవ్వాలని సూచించింది. వీసా హోదా స్థిరంగా ఉండే వరకు అమెరికాలోనే ఉండటం సురక్షితమని పేర్కొంది. ఇతర టెక్ కంపెనీలు కూడా తమ ఉద్యోగులకు ఇదే తరహా ఆదేశాలు జారీ చేశాయి. కొత్త వీసా నిబంధనల నేపథ్యంలో ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని ఉద్యోగులను కోరాయి. అమెరికా ఎంబసీల్లో వీసా ప్రాసెసింగ్‌లో విపరీతమైన జాప్యం జరుగుతున్న నేపథ్యంలో, ఉద్యోగులంతా అమెరికాలోనే ఉండాలని, కాదని విదేశాలకు వెళ్లితే అక్కడే చిక్కుకుపోయే ప్రమాదం ఉంటుందని హెచ్చరించింది. ఈ మేరకు తన అంతర్గత విభాగాలకు ఈ-మెయిల్‌ను గూగుల్ పంపింది. అమెరికాలో హెచ్-1బి, ఎల్-1 వంటి వీసాలపై పనిచేసే వేలాది మంది భారతీయులతో పాటు ఇతర దేశస్థులు పండుగ సెలవులకు లేదా వ్యక్తిగత పనులపై స్వదేశాలకు వెళతారు. ప్రస్తుతం అమెరికా కాన్సులేట్లు, ఎంబసీల్లో వీసా అపాయింట్‌మెంట్లు దొరకడం కష్టసాధ్యంగా మారింది. బ్యాక్‌లాగ్ కారణంగా వీసా స్టాంపింగ్, రెన్యువల్ ప్రక్రియ చాలా ఆలస్యమవుతోంది. దీంతో ఉద్యోగులు తిరిగి అమెరికా రావాలంటే డాక్యుమెంట్లు సకాలంలో రాకపోవచ్చని గూగుల్ భావిస్తోంది. అమెరికా దాటి బయటకు వెళితే మళ్లీ తిరిగి రావడం ప్రశ్నార్థకమవుతుందని, వీసా జాప్యం వల్ల విదేశాల్లోనే చిక్కుకుపోతారని, పరిస్థితులు సాధారణ స్థాయికి చేరేంత వరకు ఎవరూ ప్రయాణాలు వద్దంటూ ఉద్యోగులకు గూగుల్ సూచించింది.

శోభన్‌బాబు నుంచే క్రమశిక్షణ నేర్చుకున్నాం

'సోగ్గాడు' స్వర్ణోత్సవంలో సీనియర్ కథానాయికలు

హైదరాబాద్: సినీ నటుడు శోభన్‌బాబు నుంచి క్రమశిక్షణ నేర్చుకున్నట్టు సీనియర్ కథానియికలు వెల్లడించారు. శోభన్‌బాబు కథానాయకుడిగా నటించిన 'సోగ్గాడు' విడుదలై 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆ చిత్రాన్ని నిర్మించిన సురేశ్ ప్రొడక్షన్స్, అఖిల భారత శోభన్‌బాబు సేవా సమితి సంయుక్తంగా హైదరాబాద్‌లో స్వర్ణోత్సవాన్ని నిర్వహించాయి. శోభన్‌బాబుతో కలిసి నటించిన కథానాయికలతోపాటు, ఆయనతో సినిమాలు చేసిన నిర్మాతలు, దర్శకులు, రచయితలు, గాయనీ గాయకులు ఈ వేడుకకు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీనియర్ గాయని పి.సుశీలను సన్మానించారు. ఆమె మాట్లాడుతూ 'శోభన్‌బాబు సినిమాల్లో పాడిన ప్రతి పాట నా మదిలో మెదులుతూనే ఉంది. అప్పట్లో 'సోగ్గాడు' సినిమాతో నాకు మంచి పేరు వచ్చింది. ఆ సినిమా స్వర్ణోత్సవంలో పాల్గొనడం ఆనందంగా ఉంది. ఇలాంటి గొప్ప కార్యక్రమాలన్నీ చూసి ఆ జ్ఞాపకాల్ని పోగేసుకోవాలని ఉంది' అన్నారు. ప్రముఖ రచయిత పరుచూరి గోపాలకృష్ణ మాట్లాడుతూ... 'ఎంతోమందికి అభిమానులు ఉంటారు కానీ...శోభన్‌బాబు అభిమానులు మాత్రం ప్రత్యేకం. ఆయన నేడు మన మధ్య లేకపోయినా... ఇప్పటికీ జీవించే ఉన్నారనిపించేలా అభిమానులు సేవా కార్యక్రమాలు చేస్తుంటారు. అప్పట్లో ప్రతి ఇంట్లో భర్త ఎవరినైనా అభిమానించేవాడేమో కానీ, భార్య మాత్రం శోభన్‌బాబునే ఇష్టపడేది. అభిమానుల్లోనే కాదు, ప్రేక్షకుల హృదయాల్లోనూ సజీవంగా నిలిచిపోయిన గొప్ప నటుడు శోభన్‌బాబు. రీరిలీజ్‌గా ప్రేక్షకుల ముందుకొస్తున్న ఆయన నటించిన 'సోగ్గాడు' చిత్రం మళ్లీ వంద రోజులు ఆడాలని కోరుకుంటున్నా' అన్నారు. నిర్మాత అట్లూరి పూర్ణచంద్రరావు మాట్లాడుతూ 'శోభన్‌బాబు మన చిత్ర పరిశ్రమలో ఓ ఆర్థిక మంత్రిలా ఉండేవారు. ప్రతి సినిమానీ లెక్క వేసుకుని చేసేవారు. 'సోగ్గాడు' సినిమా సురేశ్ ప్రొడక్షన్స్ సంస్థకు గొప్ప పేరు, స్థిరత్వాన్ని తీసుకొచ్చింది' అన్నారు. నటి జయసుధ మాట్లాడుతూ 'నేనూ, శోభన్‌బాబు కలిసి 38 సినిమాల్లో నటించాం. ఆయన్నుంచి క్రమశిక్షణని నేర్చుకున్నా. మా హీరోయిన్స్ అందరికీ ఆయనంటే చాలా ఇష్టం. శోభన్‌బాబు మన మధ్య లేకపోయినా ఆయన అభిమానులు 'సోగ్గాడు' సినిమాకి స్వర్ణోత్సవం నిర్వహించడం గొప్ప విషయం' అన్నారు. నటి జయచిత్ర మాట్లాడుతూ 'ఈ సినిమా జ్ఞాపకాలు ఇంకా మదిలో మెదులుతున్నాయి. నటిగా నాకు మంచి అవకాశాల్ని తెచ్చిపెట్టింది. శోభన్‌బాబు కోప్పడటం నేనెప్పుడూ చూడలేదు. ఎప్పుడూ నవ్వుతూ, నవ్విస్తూ ఉండేవారు' అన్నారు. నటి రాధిక శరత్‌కుమార్ మాట్లాడుతూ 'శోభన్‌బాబు అందంగానే కాదు, అందమైన వ్యక్తిత్వంతోనూ ఉండేవారు. ఆయన తన సినిమా సెట్‌లో మరో సినిమా గురించి, మరొకరి గురించి మాట్లాడటం నేను వినలేదు. ఆయన క్రమశిక్షణే మా అందరికీ అలవాటైంది' అన్నారు. నిర్మాత డి.సురేశ్‌బాబు మాట్లాడుతూ... శోభన్‌బాబు కోసమే రాశారా అనిపించేలా ఉంటుంది 'సోగ్గాడు' చిత్రమని, అప్పట్లో మా సంస్థని మళ్లీ విజయాల బాట పట్టించింది ఈ చిత్రమే అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కథానాయికలు సుమలత, ప్రభ, రోజా రమణి, శోభన్‌బాబు మనవలు డాక్టర్ సురక్షిత్, సౌరభ్‌చంద్ర, మాజీ ఎమ్మెల్యే జేష్ఠ రమేశ్, రాశీ మూవీస్ నరసింహారావు, సుధాకర్‌బాబు, కె.ఎస్.రామారావు, బి.గోపాల్ తదితర సినీ ప్రముఖులు పాల్గొన్నారు.

అవతార్ 3ను బీట్ చేసిన ధురంధర్

హైదరాబాద్: కొన్ని రోజులుగా ఎక్కడ చూసినా 'ధురంధర్' పేరు వినిపిస్తోంది. ఇటీవల విడుదలైన ఈ సినిమా బ్లాక్‌బస్టర్ విజయాన్ని సొంతం చేసుకొని కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది. ఇప్పుడీ యాక్షన్ థ్రిల్లర్ ఇండియాలో ఏకంగా 'అవతార్ 3'ని బీట్ చేసినట్లు తెలుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూసిన చిత్రం 'అవతార్ ఫైర్ అండ్ యాష్' భారీ అంచనాల మధ్య డిసెంబర్ 19న విడుదలైంది. దీని మొదటి రోజు వసూళ్లను 'ధురంధర్' 15వ రోజు కలెక్షన్లతో బీట్ చేసినట్లు సినీ వర్గాలు పేర్కొన్నాయి. 'అవతార్ 3' మొదటిరోజు భారత్‌లో అన్ని భాషల్లో కలిపి రూ.20 కోట్లు వసూలు చేసిందని... 'ధురంధర్' 15వ రోజు కూడా రూ.22.50 కోట్లు వసూలు చేసినట్లు ట్రేడ్ వర్గాలు పేర్కొన్నాయి. దీంతో 'అవతార్ 3'ని ఈ సినిమా బీట్ చేసిందని ఈ కలెక్షన్లు ఇలానే కొనసాగితే మరిన్ని చిత్రాల రికార్డులు 'ధురంధర్' తిరగరాసే అవకాశం కనిపిస్తోంది. రణ్‌వీర్ సింగ్, మాధవన్, సంజయ్‌దత్, అక్షయ్ ఖన్నా నటించిన 'ధురంధర్' డిసెంబర్ 5న విడుదలైంది. ఇప్పటివరకూ ప్రపంచవ్యాప్తంగా రూ.730 కోట్లు వసూలు చేసింది. భారత్‌లో రూ.483 కోట్లు సాధించింది. ఈ వారాంతంలో ఇక్కడ రూ.500 కోట్ల క్లబ్‌లో చేరడం ఖాయమని అభిమానులు భావిస్తున్నారు.

మోగ్లీ... నిరుత్సాహపరచదు

హీరో రోషన్

హైదరాబాద్: 'మోగ్లీ'ని థియేటర్లలో తప్పకుండా చూడండి. ఇది ఎవర్నీ నిరుత్సాహపరచదు' అన్నారు హీరో రోషన్ కనకాల. టైటిల్ పాత్రలో రోషన్ నటించిన ఈ చిత్రాన్ని సందీప్ రాజ్ తెరకెక్కించారు. టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. సాక్షి మడోల్కర్ కథానాయిక. ఈ సినిమా విడుదలైన నేపథ్యంలో హైదరాబాద్‌లో 'థాంక్యూ మీట్' ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన హీరో సాయి దుర్గా తేజ్ మాట్లాడుతూ.. 'మనం చిన్నప్పటి నుంచి టీవీల్లో చూసిన టైటిల్ మోగ్లీ. ఇప్పుడది సినిమా అయింది. దాన్ని రోషన్ మనకి పరిచయం చేశాడు. సాక్షి, బండి సరోజ్, వైవా హర్ష... అందరూ అద్భుతంగా నటించారు. దర్శకుడు సందీప్ రాజ్ ఈ మధ్య బ్యాడ్‌లక్ అని ఓ ట్వీట్ వేశారు. ఈ ఇండస్ట్రీలో హార్డ్‌వర్క్ తప్ప బ్యాడ్‌లక్ అనేది ఉండదు. తనింకా బాగా కష్టపడి మరిన్ని మంచి స్క్రిప్ట్‌లు తెరపైకి తీసుకురావాలని కోరుకుంటున్నా. ఇలాంటి మంచి చిత్రాల్ని ప్రోత్సహిస్తున్న ప్రేక్షకులందరికీ కృతజ్ఞతలు' అన్నారు. 'మా చిన్న చిత్రాన్ని పెద్ద సినిమాలా ఆదరించినందుకు ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అన్నారు నిర్మాత టీజీ విశ్వప్రసాద్. రోషన్ మాట్లాడుతూ... 'ఈ మోగ్లీ గాణ్ని గెలిపించినందుకు... ఆదరించినందుకు ప్రేక్షకులందరికీ శిరస్సు వంచి నమస్కరిస్తున్నా. సాక్షి దీంట్లో అద్భుతంగా నటించింది. నిర్మాత విశ్వప్రసాద్ లేకపోతే ఈ చిత్రం లేదు' అన్నారు. సాక్షి, హేమంత్ మధుకర్ పాల్గొన్నారు.

గిల్‌కు దక్కని చోటు

ఇషాన్ కిషన్‌కు ఛాన్స్ | టీ20 ప్రపంచకప్‌కు భారత జట్టు ప్రకటన

భారత జట్టు: అభిషేక్ శర్మ, సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), సంజు శాంసన్, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్య, శివమ్ దూబె, అక్షర్ పటేల్ (వైస్ కెప్టెన్), రింకు సింగ్, బుమ్రా, అర్షదీప్ సింగ్, హర్షిత్ రాణా, వాషింగ్టన్ సుందర్, ఇషాన్ కిషన్, కుల్‌దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి.

ముంబై: టీ 20 వరల్డ్‌కప్ 2026కు సంబంధించి భారత జట్టును బీసీసీఐ శనివారం ప్రకటించింది. సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్‌గా, అక్షర్ పటేల్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. శుభ్‌మన్ గిల్‌కు వైస్ కెప్టెన్సీతోపాటు జట్టులో చోటు దక్కలేదు. యశస్వి జైస్వాల్ సైతం ఎంపిక కాలేదు. చాలాకాలంగా జట్టుకు దూరంగా ఉన్న ఇషాన్ కిషన్ అనూహ్యంగా జట్టులో స్థానం దక్కించుకున్నాడు. అతడు ఇటీవల ముగిసిన సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో రాణించడంతో సెలక్టర్ల దృష్టిలో పడ్డాడు. దీంతో సెలక్టర్లు ఇషాన్ వైపు మొగ్గు చూపారు. ఈ మెగా టోర్నీ భారత్, శ్రీలంక వేదికగా జరగనుంది. వరల్డ్‌కప్ మ్యాచ్‌లు 7 ఫిబ్రవరి 2026 నుంచి ప్రారంభం కానున్నాయి. తుది పోరు మార్చి 8న జరగనుంది. భారత్ గ్రూప్ స్టేజీలో తన తొలి మ్యాచ్‌ను ఫిబ్రవరి 7న యూఎస్‌ఏతో ఆడనుంది. ఫిబ్రవరి 12న నమీబియాతో మ్యాచ్ జరగనుంది. ఫిబ్రవరి 15న కొలంబోలోని ఆర్.ప్రేమదాస స్టేడియం వేదికగా టీమిండియా, పాకిస్థాన్ తలపడనున్నాయి. అనంతరం ఫిబ్రవరి 18న నెదర్లాండ్స్‌తో టీమిండియా పోటీ పడనుంది. ఫిబ్రవరి 21 నుంచి మార్చి 1 వరకు సూపర్ 8 మ్యాచ్‌లు జరగనున్నాయి. మార్చి 4న మొదటి సెమీఫైనల్, మార్చి 5న రెండో సెమీఫైనల్ జరగనుంది. టీ20 వరల్డ్ కప్‌నకు ముందు, జనవరి 11 నుంచి న్యూజిలాండ్... భారత్‌లో పర్యటించనుంది. ఇందులో భాగంగా మూడు వన్డేలు, అయిదు టీ20లు జరగనున్నాయి. న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్‌లోనూ వరల్డ్ కప్ కోసం ఎంపిక చేసిన భారత జట్టే ఆడనుంది.

గిల్ సామర్థ్యంపై అనుమానం లేదు: అగార్కర్

వాస్తవంగా మొన్నటివరకు వైస్‌కెప్టెన్‌గా ఉన్న శుభ్‌మన్ గిల్‌కు వరల్డ్ కప్ జట్టులో స్థానం కల్పించకపోవడం అందర్నీ ఆశ్చర్యానికి గురిచేసింది. అయితే, ఈ నిర్ణయం తీసుకోవడానికి గల కారణాన్ని చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ వెల్లడించాడు. శుభ్‌మన్ గిల్ సామర్థ్యం గురించి ఎటువంటి అనుమానం లేదని, దురదృష్టవశాత్తు జట్టు కాంబినేషన్‌లో భాగంగా గత టీ20 ప్రపంచ కప్‌తోపాటు ఈసారి కూడా అతడికి చోటు దక్కలేదని అగార్కర్ చెప్పాడు. 'శుభ్‌మన్ గిల్ ఆట గురించి ఎటువంటి సందేహం లేదు.

అతను ఇటీవల ఎక్కువ పరుగులు చేసి ఉండకపోవచ్చు. కానీ అతను ఎంత విలువైన ఆటగాడో మాకు తెలుసు. మేం డిఫరెంట్ కాంబినేషన్‌తో జట్టును ఎంపిక చేయడంతో దురదృష్టవశాత్తు గత టీ20 ప్రపంచ కప్‌లో గిల్‌కు చోటు దక్కలేదు. వ్యక్తిగత సామర్థ్యాన్ని బట్టి కాకుండా ఈసారి కూడా జట్టు సమతుల్యత గురించి ఆలోచించి టాప్ ఆర్డర్‌లో ఇద్దరు వికెట్‌కీపర్లను తీసుకున్నాం' అని అగార్కర్ వివరించాడు.

కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ కూడా గిల్‌ను ఎంపిక చేయకపోడంపై మాట్లాడాడు. 'గిల్ ఫామ్‌లో లేకపోవడంతో అతడిని పక్కనపెట్టలేదు. జట్టు కాంబినేషన్‌లో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నారు. టాప్ ఆర్డర్‌లో వికెట్‌కీపర్ ఉండాలనేది మా ఆలోచన. గిల్ సామర్థ్యం విషయంలో మాకు ఎలాంటి అనుమానాలు లేవు. అతను అద్భుతమైన ఆటగాడు. లోయర్ ఆర్డర్‌లో ఓ ఫినిషర్ ఉండాలని రింకు సింగ్‌ను తీసుకున్నాం' అని సూర్యకుమార్ అన్నాడు.

సూర్యకుమార్‌కు తిలక్ వర్మ మద్దతు

అహ్మదాబాద్: టీ 20 సిరీస్‌లో కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ విఫలం కావడంపై సంచలన బ్యాటర్ తిలక్‌వర్మ స్పందించాడు. సూర్యకుమార్ ఒక్క మంచి ఇన్నింగ్స్ ఆడితే తిరిగి ఫామ్‌లోకి వస్తాడని ఆశాభావం వ్యక్తంచేశాడు. 'నేను ఒకటే చెబుతున్నా.. అతడు ఓపికగా కొన్ని బంతులు ఆడి... క్రీజులో కుదురుకోవడానికి కాస్త సమయం తీసుకోవాలి. అతడు ఆత్మవిశ్వాసం పొందితే, ఎలాంటి విధ్వంసం సృష్టిస్తాడో అందరికీ తెలిసిందే. ఫీల్డర్ల మధ్య ఖాళీల్లోకి బంతిని పంపించి, పరుగులు రాబట్టడానికి ప్రయత్నించాలి. ఆ తర్వాత హిట్టింగ్‌కు వెళ్లాలి' అని తిలక్ వర్మ మ్యాచ్ అనంతరం విలేకరులతో అన్నాడు. అహ్మదాబాద్ మ్యాచ్‌లో తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యతో కలిసి కేవలం 45 బంతుల్లోనే 105 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. దీంతో టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 231 పరుగులు చేయగలిగింది. దీంతో దక్షిణాఫ్రికాపై భారత్ 30 పరుగుల తేడాతో విజయం సాధించి... సిరీస్‌ను 3-1 తేడాతో కైవసం చేసుకుంది. ఈ మ్యాచ్‌లో తిలక్‌వర్మ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. 42 బంతుల్లో 72 పరుగులు చేసి, చివరి ఓవర్లో రనౌట్‌గా వెనుదిరిగాడు. సూర్యకుమార్ యాదవ్ 7 బంతులు ఎదుర్కొని కేవలం 5 పరుగులే చేశాడు. అతడు తన చివరి 19 ఇన్నింగ్స్‌ల్లో 13.62 సగటుతో 218 పరుగులు మాత్రమే చేశాడు. ఇందులో కనీసం ఒక్క హాఫ్ సెంచరీ కూడా లేదు. సూర్యకుమార్ యాదవ్ చివరిసారిగా అక్టోబర్ 2024లో అర్ధశతకం సాధించాడు.

ఓటమి దిశగా ఇంగ్లండ్

నాలుగో రోజు ఆట ముగిసేసరికి 207/6

అడిలైడ్: యాషెస్ సిరీస్‌లో భాగంగా అడిలైడ్ వేదికగా మూడో టెస్ట్‌లో ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ తలపడుతున్నాయి. నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి ఇంగ్లాండ్ 63 ఓవర్లకు 6 వికెట్లు నష్టపోయి 207 పరుగులు చేసింది. ఇంకా 228 పరుగులు వెనుకబడి ఉంది. 435 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లాండ్ జట్టు రెండో ఇన్నింగ్స్‌లోనూ తడబాటుకు గురైంది. ఇన్నింగ్స్ ప్రారంభమైన కాసేపటికే 4 పరుగుల వద్ద తన తొలి వికెట్‌ను ఇంగ్లండ్ కోల్పోయింది. ఆ తర్వాత ఇదే ఒరవడి కొనసాగింది. దీంతో ఇంగ్లాండ్ జట్టు ఓటమి అంచున నిలిచింది. ఆ టీమ్ విజయం సాధించాలంటే ఏదైనా అద్భుతం జరగాల్సిందే. ఇంగ్లాండ్ బ్యాటర్లలో జాక్ క్రాలీ (85, 151 బంతుల్లో, 8 ఫోర్లు) ఒక్కడే రాణించాడు. జోరూట్ (39) తన స్థాయికి తగ్గ పరుగులు చేయలేకపోయాడు. హ్యారీ బ్రూక్ 30 పరుగులు మాత్రమే చేశాడు. బెన్ డకెట్ (4), ఓలీ పోప్ (17), బెన్‌స్టోక్స్ (5) బ్యాటింగ్‌లో విఫలమయ్యారు. ఆట ముగిసే సమయానికి... జెమ్మీ స్మిత్ 2 (30 బంతుల్లో), విల్ జాక్స్ 11 (31 బంతుల్లో, 2 ఫోర్లు) పరుగులతో క్రీజులో ఉన్నారు.

ప్రయాణికుడిని కొట్టిన పైలట్ సస్పెన్షన్

న్యూఢిల్లీ: ఢిల్లీ ఎయిర్‌పోర్టులో ఓ ప్రయాణికుడిపై పైలట్ దాడి చేశాడు. ఈ ఘటనలో ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సంస్థ ఆ పైలట్‌ను సస్పెండ్ చేసింది. ఆ ఘటనపై దర్యాప్తు చేపట్టనున్నట్లు పేర్కొంది. ఘటనపై క్షమాపణ కోరుతున్నట్లు ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ తన ఎక్స్ పోస్టులో తెలిపింది. మరో విమానంలో ఓ ప్రయాణికుడిగా తమ పైలట్ ప్రయాణిస్తున్న సమయంలో దాడి ఘటన జరిగినట్లు ఎయిర్ ఇండియా చెప్పింది. పైలట్ ప్రవర్తనను ఖండిస్తున్నట్లు పేర్కొంది. అయితే తక్షణమే సంబంధిత వ్యక్తిని అధికారిక విధుల నుంచి తప్పిస్తున్నట్లు ఆ సంస్థ తన పోస్టులో వెల్లడించింది. దర్యాప్తు తర్వాత సరైన చర్యలు తీసుకుంటామన్నారు. పైలట్ తనపై దాడి చేసినట్లు ప్రయాణికుడు తన సోషల్ మీడియా పోస్టులో రాశాడు. రక్తం నిండిన ముఖం ఫొటోను ఆ పోస్టుకు జత చేశాడు. పైలట్ ఫొటో కూడా పోస్టు చేయడంతో వివాదం మరింత ముదిరింది. అంకిత్ దివాన్ అనే వ్యక్తి స్పైస్‌జెట్‌లో ప్రయాణం చేస్తున్న సమయంలో ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ పైలట్ దాడి చేశాడు. కెప్టెన్ వీరేందర్ సెజ్వాల్ బోర్డింగ్ క్యూలైన్ వద్ద మధ్యలో దూరాడని, దాన్ని అడ్డుకోవడంతో అతడు దాడి చేసినట్లు దివాన్ పేర్కొన్నారు. సెక్యూరిటీ చెక్ లైన్‌లో ఈ ఘటన జరిగినట్లు అతడు చెప్పాడు.

యోగాంధ్రపై జగన్ తప్పుడు ఆరోపణలు: మంత్రి దుర్గేశ్

విశాలాంధ్ర -సచివాలయం: యోగాంధ్రపై వందల కోట్లు ఖర్చు చేశారంటూ కూటమి ప్రభుత్వంపై మాజీ సీఎం జగన్ చేసిన వ్యాఖ్యలు తప్పని మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. ఇటీవల రుషికొండ ప్యాలెస్ పై జగన్ చేసిన వ్యాఖ్యలకు మంత్రి ఘాటుగా సమాధానం ఇచ్చారు. ప్రభుత్వం ప్రజారోగ్య రక్షణకు పెద్దపీట వేస్తోందని అన్నారు. ఈ క్రమంలోనే రూ. 94 కోట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించి ప్రతి ఒక్కరి జీవనశైలిలో అది ఒక భాగం కావాలని పిలుపునిచ్చామన్నారు. రుషికొండపై రూ.500 కోట్లు ఖర్చు చేసి విలాసవంతమైన రాజప్రాసాదాలను నిర్మించిన జగన్... ప్రజా ఆరోగ్యం కోసం యోగాంధ్రను నిర్వహించడం తప్పు ఎలా అనిపించిందో అర్థం కావడం లేదన్నారు. గంజాయి, డ్రగ్స్ ప్రోత్సహించిన జగన్‌కి ప్రజల ఆరోగ్యంపై కనీస బాధ్యత లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పర్యాటక శాఖకు ఏటా రూ. 7.5 కోట్ల ఆదాయం తెచ్చిపెట్టే హరిత రిసార్ట్స్ స్థానంలో రుషికొండ ప్యాలెస్ ను నిర్మించడం వల్ల రెవెన్యూ కోల్పోయిందన్నారు. ప్రస్తుతం ప్రతి నెల విద్యుత్ చార్జీలు, నిర్వహణ రూపంలో పర్యాటకశాఖ పై రూ. 25 లక్షల భారం పడుతుందని, ఇది మాజీ సీఎం జగన్ నిర్వాకం కాదా అని నిలదీశారు. నేరస్తులు, ఖైదీలు, రౌడీలకు అండగా నిలిచే జగన్... కూటమి ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను సహించలేక పోతున్నారన్నారు. పీపీపీ విధానాన్ని వ్యతిరేకించే జగన్ నాడు 108, 104 సేవలు ఏ ప్రాతిపదికన నిర్వహించారనే విషయం స్పష్టం చేయాలని అన్నారు. ప్రజోపయోగ కార్యక్రమాలు ఏం చేశారో వివరించాలని డిమాండ్ చేశారు. జగన్ పాలనలో మెడికల్ కాలేజీల నిర్మాణాలకు కాంట్రాక్టర్ల కు చెల్లించినది రూ.1,550 కోట్లు... 17 మెడికల్ కాలేజీల నిర్మాణాలకు అవసరమయ్యే నిధులు మొత్తం రూ.8,480 కోట్లు... పీజీ మెడికల్ సీట్లకు అవసరమైన వసతులకు కేంద్రం ఇచ్చిన నిధులు రూ.700 కోట్లు దారి మళ్లించారని ఆరోపించారు.

యోగి ట్రీట్మెంట్ తప్పదు

- బెదిరింపులకు పాల్పడితే కీళ్లు విరగ్గొడతాం
- ప్రభుత్వం తలుచుకుంటే నక్సలిజమే కకావికలమైంది
- రాష్ట్ర ప్రజల దాహార్తి తీర్చే పథకం 'అమరజీవి జలధార'
- పెరవలిలో శంకుస్థాపన చేసిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

విశాలాంధ్ర-పెదవలి: 'రాష్ట్రంలో అభివృద్ధి పనులకు అడ్డుపడేలా పనులు చేపట్టే కాంట్రాక్టర్లను గత పాలకులు భయపెడుతున్నారు. మళ్లీ మేమే అధికారంలోకి వస్తాం... మీ అంతు చూస్తాం అంటూ బహిరంగంగా బెదిరింపులకు దిగుతున్నారు. జైల్లో పెడతామని హెచ్చరికలు చేస్తున్నారు. అలా బెదిరింపులకు దిగే రౌడీలు, గూండాలకు యోగి ఆదిత్యనాథ్ ట్రీట్మెంట్ ఇవ్వాలి' అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. రౌడీయిజం పేరు ఎత్తితే కీళ్లు విరగ్గొట్టి కూర్చోబెడతామని హెచ్చరించారు. ప్రభుత్వం తలుచుకుంటే బలమైన భావజాలం కలిగిన నక్సలిజమే కకావికలం అయిపోయిందని, బెదిరింపులకు దిగే కిరాయి రౌడీలపై బలమైన రాజకీయ నిర్ణయం తీసుకునే పరిస్థితి తెచ్చుకోవద్దన్నారు. గీత దాటి మాట్లాడతామంటే చేతిలో గీతలు మాయమయ్యేలా చేస్తామని గట్టిగా చెప్పారు. శనివారం తూర్పు గోదావరి జిల్లా, నిడదవోలు నియోజకవర్గం పెరవలిలో ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు తాగునీరు అందించే 'అమరజీవి జలధార' వాటర్ గ్రిడ్ పథకానికి పవన్ కల్యాణ్ శంకుస్థాపన చేశారు. రూ.3,050 కోట్ల అంచనా వ్యయంతో జల జీవన్ మిషన్ నిధులతో పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్, ఉప సభాపతి రఘురామ కృష్ణరాజు, సమాచార శాఖ మంత్రి కె.పార్థసారధి, ప్రజా ప్రతినిధులు, అధికారులు, కూటమి నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ వైసీపీ అధికారంలో ఉన్నప్పుడే వాళ్ల బెదిరింపులకు భయపడలేదని, ఇప్పుడు బాధ్యత లేకుండా మాట్లాడుతూ చంపేస్తాం, మళ్లీ మేము వస్తామంటే భయపడతామా అని ప్రశ్నించారు. పిఠాపురంలో చదువుకొనే చిన్న పిల్లల మధ్య కులాలు తీసుకువస్తున్నారంటే వాళ్ల దిగజారుడుతనం గురించి ఏం మాట్లాడతామన్నారు. పిల్లలకు కులాలు ఆపాదిస్తామా? రాజకీయాలు చేయడానికి వేరే దారి లేదా? అలా చేసే వారికి సిగ్గు ఉందా అని ప్రశ్నించారు. ఎవరి అండదండలు లేకుండా పార్టీ పెట్టి ఇక్కడకు వచ్చామంటే తమకు ఎంత నిబద్ధత ఉండాలని అన్నారు. మొన్నటి కలెక్టర్లు, ఎస్పీల సమావేశంలో దందాలు, గూండాగిరి చేసేవారిని ఉపేక్షించవద్దని చెప్పామన్నారు. అమరజీవి జలధార వస్తే ఒక్క కులానికే నీరు వస్తాయా? అందరికీ తాగు నీరు అందుతుందన్నారు. పది వేల మందికి పారదర్శకంగా ప్రమోషన్లు ఇచ్చామంటే వాళ్లంతా నాకులం వారని ఇచ్చానా అని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో ఒక్కో దానికి ఒక్కో రేటు కార్డు ఉండేదని విమర్శించారు. రాష్ట్ర భవిష్యత్ కోసం నన్ను నేను తగ్గించుకోకపోతే రూ.3,500 కోట్లతో పల్లె పండగ పనులు పూర్తి చేసే వాళ్లమా అని అన్నారు. 4 వేల కిలోమీటర్ల సీసీ రోడ్లు, లక్ష ఫారం పాండ్లు, 22,500 మినీ గోకులాలు నిర్మించగలిగే వాళ్లమా? 10 వేల ఎకరాలలో ఉద్యానవన పంటలు పండేవా? 8 వేల కిలోమీటర్లు బీటీ, సీసీ రోడ్లు వస్తాయా? అని ప్రశ్నించారు. 'అమరజీవి జలధార' ద్వారా చేపట్టిన వాటర్ గ్రిడ్ ప్రాజెక్టుల నిర్మాణం కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఐదు ఉమ్మడి జిల్లాల పరిధిలో రూ.7,910 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టుల ద్వారా వచ్చే 35 ఏళ్లలో 1.21 కోట్ల మంది దాహార్తి తీర్చాలని సంకల్పించామన్నారు. ముఖ్యంగా ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో తీర ప్రాంతం వెంబడి నివసించే మత్స్యకార సోదరులకు మేలు చేయాలన్న ఉద్దేశంతో ఎక్కువ తీర ప్రాంతాలు కలిపేలా ఈ ప్రాజెక్టు ఉందన్నారు. 2027 నాటికి పనులు పూర్తి చేయాలన్న లక్ష్యంతో ముందుకు వెళుతున్నట్లు వివరించారు. అమరజీవి జలధార అని పెట్టడానికి కారణాన్ని వివరించారు. తాగే నీటి సాక్షిగా చెబుతున్నా... పొట్టి శ్రీరాములును, బూర్గుల రామకృష్ణారావును, చంద్రశేఖర్ ఆజాద్‌ని ఆరాధించాను అని తెలిపారు. నేను క్రిమినల్స్‌ని ఆరాధించ లేదని, దోపిడీ చేసే వారిని, దగా చేసే వారిని ఆరాధించలేదని స్పష్టం చేశారు. దానివల్లే నేను సీట్ల విషయంలో తగ్గితే రకరకాలుగా తిట్టారని తెలిపారు. ఒకరు పార్టీని అమ్మేశానంటూ... దిగజారిపోయానని ఒకరన్నారని చెప్పారు. రాష్ట్ర ప్రజలకు, రాష్ట్రానికి మంచి జరగాలనే తాను తగ్గానని స్పష్టం చేశారు. జల జీవన్ మిషన్ లక్ష్యాలకు గత పాలకులు పాతరేశారని విమర్శించారు. ఈ రోజు ఈ ప్రాజెక్టుకి ఇన్ని వేల కోట్లు రావడానికి కారణం అయిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి ధన్యవాదాలు తెలియజేశారు. అడవి తల్లిబాట కార్యక్రమాన్ని నిజాయితీగా పూర్తి చేసిన తర్వాత నమ్మకం వచ్చి ఇన్ని వేల కోట్ల నిధులు ఇచ్చారని అన్నారు. రూ.1,005 కోట్లతో 625 గిరిజన గ్రామాలకు 1,069 కిలోమీటర్ల రోడ్లకు శ్రీకారం చుట్టామని పవన్ కల్యాణ్ వివరించారు. ప్రధాన మంత్రి సహకారం, చంద్రబాబు అపార అనుభవంతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లగలుగుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్‌లు పిడుగు హరిప్రసాద్, బొమ్మిడి నాయకర్, బొలిశెట్టి శ్రీనివాస్, పీఆర్ ఆర్డీ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, కమిషనర్ కృష్ణ తేజ తదితరులు పాల్గొన్నారు.

నేడు పల్స్ పోలియో

ఉండవల్లి క్యాంప్ కార్యాలయంలో ప్రారంభించనున్న సీఎం

విశాలాంధ్ర - సచివాలయం: రాష్ట్ర వ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జి.వీరపాండియన్ శనివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఉండవల్లి క్యాంప్ కార్యాలయంలో సీఎం చంద్రబాబు, కాకినాడ పట్టణ ఆరోగ్య కేంద్రంలో వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ దీన్ని ప్రారంభిస్తారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 54,07,663 మంది ఐదేళ్ల లోపు పిల్లలకు 38,267 బూత్ లలో పోలియో చుక్కలు వేసేందుకు 98,99,300 డోస్ లను అన్ని జిల్లాలకు పంపించామని తెలిపారు. పల్స్ పోలియోను పర్యవేక్షించేందుకు అన్ని జిల్లాలకు నోడల్ ఆఫీసర్లను నియమించామన్నారు. తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించేందుకు తల్లిదండ్రులు భాగస్వాములు కావాలని కోరారు. వైద్య శాఖ అధికారులు, సిబ్బందికి సహకరించాలన్నారు. ఈనెల 22, 23 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి 76,534 బృందాలు పరిశీలిస్తాయి. 1,704 మెడికల్ అధికారులు, 39,494 ఇతరులు (ఫార్మసిస్టులు, నర్సింగ్ విద్యార్థులు, ఇతర సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఉపాధ్యాయులు), 4,206 మంది పర్యవేక్షకులు నేషనల్ ఇమ్యునైజేషన్ డేలో పాల్గొంటారన్నారు. మొబైల్ బృందాలనూ ఏర్పాటు చేశారు. వీటిలో ఒక మెడికల్ ఆఫీసర్ తో పాటు ఇద్దరు సభ్యులు ఉంటారు. ఈనెల 21 నుంచి 23 వరకు మొబైల్ బృందాలు పర్యటిస్తాయి. ఈనెల 22, 23 తేదీల్లో ఇంటింటికి వెళ్లి ఐదేళ్లలోపు పిల్లలందరినీ పరిశీలించి, వారికి పోలియో చుక్కలు వేస్తారు. 1,854 మొబైల్ బృందాలు పనిచేస్తాయి. బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లు, విమానాశ్రయాలు, మేళాలు, బజార్‌లు, పర్యాటక ప్రదేశాలలో 1,140 ట్రాన్సిట్ బూత్‌లను ఏర్పాటు చేశారు.

ఐటీ కంపెనీలను అడ్డుకుంటున్న వైసీపీ

పంచుమర్తి అనురాధ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విశాఖను, ఉత్తరాంధ్రను రాష్ట్రానికి 'ఆర్థిక రాజధాని'గా మార్చాలనే విజన్‌తో 2014-19 మధ్య ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నో ఐటీ పరిశ్రమలు తీసుకువచ్చారని శాసనమండలిలో చీఫ్‌విప్ పంచుమర్తి అనురాధ అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ దురదృష్టవశాత్తూ 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం... ఉన్న కంపెనీలను తరిమికొట్టి, ఉత్తరాంధ్ర యువత భవిష్యత్తును అంధకారం చేసిందని, అందుకే 2024 ఎన్నికల్లో ఈ ప్రాంత ప్రజలు వైసీపీని చిత్తుగా ఓడించి ఒక్క సీటు కూడా రాకుండా బుద్ధి చెప్పారని విమర్శించారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఐటీ ఉద్యోగాలకు బదులు, యువత గంజాయి, డ్రగ్స్ బారిన పడి నిర్వీర్యమయ్యేలా చేశారన్నారు. అభివృద్ధిని వదిలేసి, భూకబ్జాలు, అరాచకాలకే ప్రాధాన్యత ఇచ్చారన్నారు. ఐటీ శాఖ మంత్రిగా నారా లోకేష్ విశాఖను ఐటీ హబ్‌గా మార్చేందుకు 5 లక్షల ఉద్యోగాల కల్పన అనే దృఢ సంకల్పంతో పనిచేస్తున్నారన్నారు. టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి దిగ్గజ జాతీయ, అంతర్జాతీయ కంపెనీలను వైజాగ్ రప్పిస్తున్నారన్నారు. ప్రభుత్వం కంపెనీలు తీసుకువస్తుంటే ఓర్వలేక వైసీపీ నేతలు కోర్టులకు వెళ్తూ అడ్డంకులు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. ఇటీవలే టీసీఎస్ విషయంలో వైసీపీకి హైకోర్టు మొట్టికాయలు వేసినా... ఇంకా సాక్షి పేపర్, సోషల్ మీడియా ద్వారా విషం కక్కుతూనే ఉన్నారన్నారు. చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ 18 నెలల పాటు శ్రమించి, పారిశ్రామికవేత్తల్లో నమ్మకాన్ని నింపి 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'ను స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'గా మార్చారన్నారు. 5 లక్షల ఉద్యోగాల లక్ష్యంతో కంపెనీలు తెస్తుంటే కోర్టుల ద్వారా అడ్డుకోవడం వైసీపీ నీచబుద్ధికి నిదర్శనమని విమర్శించారు.

దగ్గు మందు రాకెట్‌పై చర్యలేవి: అఖిలేశ్

లక్నో: అన్ని మాఫియాలపై బుల్డోజర్లు ప్రయోగించాలని సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ పిలుపునిచ్చారు. శనివారం ఇక్కడ విలేకరుల సమావేశంలో కోడైన్ సిరప్ వివాదంపై మాట్లాడుతూ ఈ రాకెట్ ప్రధాన మంత్రి నియోజకవర్గం నుంచే ఉద్భవించిందని అన్నారు. 'ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి అబద్ధాలు చెబుతారు. ఆయనతో ఉన్న వారు కూడా అబద్ధాలు చెబుతారు. ప్రధాన మంత్రి పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి అక్రమ దగ్గు సిరప్ వ్యాపారం జరుగుతుందని మీరు ఊహించలేరు. దాని విలువ వేల కోట్లు. ఇది అంతర్జాతీయ సమస్య' అని అఖిలేశ్ చెప్పారు. ఈ రాకెట్ అంచనా వేసిన దానికంటే చాలా పెద్దదని ఆయన ఆరోపించారు. 'సమాజ్‌వాదీ పార్టీకి చెందినవారైనా సరే, అన్ని 'మాఫియాల' పై బుల్డోజర్ తరహా చర్య తీసుకోవాలని కోరారు. ఈ వ్యాపారంలో పాల్గొన్న ప్రతి ఒక్కరినీ 'కోడైన్ భయ్యా' అని అభివర్ణించారు. 'ఇది రూ.100 లేదా 200 కోట్ల విషయం కాదు. ఇందులో దాదాపు 700 కంపెనీలు, అనేక వేల కోట్ల రూపాయల లావాదేవీలు జరిగాయని వినిపిస్తోంది' అని అన్నారు. దగ్గు సిరప్ రాకెట్ వ్యవహారంలో బీజేపీ ప్రభుత్వం కీలక విషయాలను దాచిపెట్టిందని, సమాజ్ వాదీ పార్టీని నిందించడానికి ఎంపిక చేసిన చిత్రాలను ఉపయోగిస్తోందని విమర్శించారు. 'ఒక చిత్రంలో నిలబడటం వల్ల ఎవరైనా మాఫియా అవుతారంటే, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులు, అనేక మంది బీజేపీ నాయకులతో ఉన్న ఫోటోలు కూడా నా దగ్గర ఉన్నాయి. నా ఫోటో, ముఖ్యమంత్రి ఫోటో కలిసి కనిపిస్తే అప్పుడు ఎవరిని మాఫియా అని పిలుస్తారు? అని ప్రభుత్వాన్ని నిలదీశారు.

టీవీ డిబేట్‌లో డిష్యూం...డిష్యూం

న్యూఢిల్లీ: యోగా గురువు బాబా రామ్‌దేవ్ ఓ టీవీ లైవ్ డిబేట్‌లో సహనం కోల్పోయారు. తోటి ప్యానలిస్ట్‌పై రామ్‌దేవ్ పిడిగుద్దులు కురిపించారు. అమర్ ఉజాలా లైవ్ డిబేట్ సందర్భంగా గందరగోళం జరిగింది. ఇది కాస్తా ముదిరి భౌతికదాడికి దారితీసింది. రామ్‌దేవ్ తోటి ప్యానలిస్ట్‌పై దాడికి దిగారు. అవతలి వ్యక్తి దానిని ప్రతిఘటించి రామ్‌దేవ్‌ను స్టూడియో ఫ్లోర్‌పై కొట్టాడు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. హర్యానాలో ఇది ఫ్యామస్ అంటూ రామ్‌దేవ్ కొన్ని వ్యాయామాలు చేశారు. ఆ తరువాత ఛాలెంజ్ అంటూ తోటి ప్యానలిస్ట్‌పై లంఘించారు. ఇలా కొద్ది క్షణాలు సాగిన తరువాత ఇది జోక్‌గానే... దీన్ని అంత సీరియస్‌గా తీసుకోవద్దు. అతనికి శక్తిలేదు ఒప్పుకున్నాడు... అతని కోసం చప్పట్లు అంటూ అక్కడున్నవారిని ఉత్సాహపరచడంతో ఈ వివాదం సద్దు మణిగింది. కాగా టెలివిజన్ చర్చల సమయంలో ఇలాంటి వింత ప్రవర్తనలతో రామ్‌దేవ్ ఆకర్షించడం ఇదే మొదటిసారి కాదు. దీనిపై నెటిజన్లు విభిన్నంగా స్పందించారు. ఈ ఘటనపై విమర్శలు గుప్పించారు. వార్తా వేదికలు 'కుస్తీ వేదికలు'గా మారాయని అనేక మంది వ్యాఖ్యానించారు.

బీఎస్ఎఫ్‌లో అగ్నివీరుల కోటా పెంపు

న్యూఢిల్లీ: సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) నియామకాల్లో నిబంధనలు సవరిస్తూ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. బీఎస్ఎఫ్ కానిస్టేబుళ్ల నియామకాల్లో గతంలో 10 శాతం ఉన్న అగ్నివీరుల కోటాను 50 శాతానికి పెంచినట్లు ప్రకటించింది. మొదటి దశలో మాజీ అగ్నివీరులకు కేటాయించిన 50 శాతం ఖాళీలకు, రెండో దశలో మాజీ అగ్నివీరులు కాకుండా మిగిలిన (పది శాతం మాజీ సైనికులతో సహా) ఖాళీలకు నియామకాలు నిర్వహిస్తామని నోటిఫికేషన్‌లో పేర్కొంది. మొదటి దశలోని ఒక నిర్దిష్ట విభాగంలో మాజీ అగ్నివీరులతో కాకుండా స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ద్వారా నియామకాలు చేపట్టనున్నట్లు తెలిపింది. త్రివిధ దళాల్లో నియామకాలకు సంబంధించి జూన్ 2022లో కేంద్ర ప్రభుత్వం అగ్నిపథ్ పథకాన్ని ప్రవేశపెట్టింది. అగ్నివీరులుగా వారి నాలుగేళ్ల సర్వీస్ ముగిసిన అనంతరం రిజర్వేషన్ ద్వారా కేంద్ర పారామిలటరీ బలగాల్లో నియమించుకుంటున్నారు. ఇందులోభాగంగానే గతంలో అన్ని కేంద్ర సాయుధ పోలీసు దళాలలోని కానిస్టేబుల్ (జనరల్ డ్యూటీ) ఖాళీలలో 10 శాతం కోటా మాజీ అగ్నివీరులకు కేటాయించారు. తాజా నోటిఫికేషన్‌లో ఇతర కేంద్ర పారామిలటరీ దళాల్లో కాకుండా కేవలం బీఎస్ఎఫ్ నియామకాల్లో మాత్రమే అగ్నివీరుల కోటాను 10 నుంచి 50 శాతానికి పెంచారు. ప్రస్తుత నిబంధనల ప్రకారం మాజీ అగ్నివీరులకు శారీరక సామర్థ్య పరీక్ష నుంచి మినహాయింపు ఇవ్వగా... రాత పరీక్షలో వారు ఉత్తీర్ణులు కావాల్సి ఉంటుంది.

ముడిచమురు ధరలు తగ్గినా...

మారని పెట్రోల్, డీజిల్ రేట్లు

న్యూఢిల్లీ: అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గినప్పటికీ భారత్‌లో పెట్రోల్, డీజిల్ ధరలు ఆకాశాన్నంటాయి. అధికారిక గణాంకాలు, గత దశాబ్ద కాలపు విశ్లేషణను పరిశీలిస్తే దీని వెనుక ఉన్న ఆర్థిక, రాజకీయ కారణాలు వెలుగులోకి వస్తున్నాయి. డిసెంబర్ 2025 నాటికి అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు బ్యారెల్ ధర సుమారు 60-70 డాలర్ల మధ్య ఊగిసలాడుతోంది. అయినప్పటికీ దేశంలోని ప్రధాన నగరాల్లో పెట్రోల్ ధర లీటరుకు రూ.103-రూ.110 మధ్య, డీజిల్ రూ.90 నుంచి రూ.98 మధ్య ఉంది. మన దేశంలో పెట్రోల్, డీజిల్ ధరల్లో దాదాపు 50 శాతం నుంచి 55 శాతం వరకు పన్నులు ఉంటాయి. కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ డ్యూటీని, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యాట్ విధిస్తున్నాయి. చమురు ధరలు తగ్గినప్పుడు ప్రభుత్వం తన ఆదాయం పెంచుకోవడానికి లేదా ద్రవ్యలోటు పూడ్చుకోవడానికి పన్నులు పెంచుతోంది. కానీ ఆ ప్రయోజనాన్ని వినియోగదారులకు బదిలీ చేయడం లేదు. దీనికితోడు రూపాయి విలువ పతనం కావడం కూడా పెట్రోధరలు తగ్గకపోవడానికి కారణంగా కనిపిస్తోంది. పదేళ్ల కిందట డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ సుమారు రూ.45-50 ఉంటే... ప్రస్తుతం అది రూ.90కి చేరుకుంది. ముడి చమురును డాలర్లలోనే కొనుగోలు చేస్తారు కాబట్టి... అంతర్జాతీయంగా ధరలు తగ్గినా బలహీనపడిన రూపాయి వల్ల మనం చెల్లించే మొత్తం తగ్గడం లేదు. వీటికి తోడు గతంలో చమురు ధరలు విపరీతంగా పెరిగినప్పుడు ప్రభుత్వ రంగ చమురు సంస్థలు ప్రజలపై భారం పడకుండా ధరలు స్థిరంగా ఉంచేవి. అప్పుడు వాటికి కలిగిన నష్టాలను ఇలాంటి సమయాల్లో అంటే ముడిచమురు ధరలు తగ్గిన సమయంలో లాభాల రూపంలో భర్తీ చేసుకుంటున్నాయి. వీటన్నింటికీ మించి కేంద్ర ప్రభుత్వం వసూలు చేసే ఎక్సైజ్ డ్యూటీలో అధిక భాగం సెస్ రూపంలో ఉంటోంది. దీని వల్ల వచ్చే ఆదాయంలో రాష్ట్రాలకు వాటా ఇవ్వాల్సిన అవసరం ఉండదు. ఇది కేంద్ర ఖజానాకు అదనపు ఆదాయంగా మారుతోంది. 2010-2014 మధ్య కాలంలో ముడి చమురు ధరలు రికార్డు స్థాయిలో ఉన్నప్పటికీ... అప్పటి రిటైల్ ధరలు ఇప్పటికంటే తక్కువగా ఉండేవి. 2010లో పెట్రోల్ ధరలను, 2014లో డీజిల్ ధరలను ప్రభుత్వం నియంత్రించింది. అంతకుముందు ప్రభుత్వం రిఫైనరీ కంపెనీలకు భారీగా సబ్సిడీలు ఇచ్చేది. అందుకే అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు ఎక్కువగా ఉన్నా దేశీయంగా ధరలు తక్కువగా ఉండేవి. ప్రభుత్వం సంక్షేమ పథకాలు, మౌలిక సదుపాయాల కల్పన (రోడ్లు, హైవేలు) కోసం అవసరమైన నిధులను చమురుపై పన్నుల ద్వారా సేకరించడం ప్రారంభించింది. క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గినా సామాన్యుడికి ఉపశమనం లభించకపోవడానికి ప్రధాన అడ్డంకి ప్రభుత్వాల పన్ను విధానం, రూపాయి బలహీనపడటం. పెట్రోల్, డీజిల్‌ను జీఎస్టీ పరిధిలోకి తీసుకువస్తే ధరలు గణనీయంగా తగ్గే అవకాశం ఉన్నప్పటికీ... ఆదాయం కోల్పోవడానికి ఇటు కేంద్రం, అటు రాష్ట్రాలు సిద్ధంగా లేకపోవడమే ప్రస్తుత పరిస్థితికి మూలకారణంగా కనిపిస్తోంది.

శ్రమ దోపిడీకే 'ఉపాధి'లో మార్పులు

- ముఖ్యమంత్రి కేంద్రానికి లేఖ వ్రాయాలి
- సీపీఎం నేతలు రాఘవులు, శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: గ్రామీణ పేదలు, వ్యవసాయ కార్మికుల శ్రమను కార్పొరేట్లు దోచుకునేందుకే కొత్తగా జీ రాం జీ బిల్లు తీసుకొచ్చారని సీపీఎం పొలిట్‌బ్యూరోసభ్యులు బీవీ రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. దీనివల్ల పేదలకు ఎటువంటి ఉపయోగమూ లేదన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని, ఇందుకోసం దేశవ్యాప్త ఆందోళన చేపడతామని స్పష్టం చేశారు. శనివారం విజయవాడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారిద్దరూ మాట్లాడారు. బీవీ రాఘవులు మాట్లాడుతూ గతంలో ఉన్న ఉపాధిహామీ చట్టాన్ని రద్దుచేసి... కొత్తగా జీ రాం జీ పథకాన్ని తీసుకొచ్చారని, దీనిలో కార్మికులకుగానీ, రాష్ట్రాలకుగానీ ఎటువంటి హక్కులూ లేవని, ఉన్నవి కూడా పాక్షికమేనని తెలిపారు. గతంలో కనీసం 100 రోజులు పని పేరుతో 50 రోజులన్నా కార్మికులకు ఉపాధి లభించేదని, ఇప్పుడు కేంద్రం

దయాదాక్షిణ్యాలపై ఉండేలా చేశారని తెలిపారు. పథకంలో నిధుల వాటా గతంలో కేంద్రానికి 90 శాతం, రాష్ట్రానికి 10 శాతం వాటా ఉండేదని, ప్రస్తుతం 60:40గా మార్చారని తెలిపారు. ఆకలిచావులు, వలసలు నివారించేందుకు ఉపయోగపడిన ఈ చట్టాన్ని రద్దు చేయడం వల్ల మరలా ఆకలిచావులు పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పైగా దీనికి నిధుల కేటాయింపు డిమాండు ఆధారంగా కాకుండా రాజకీయ అవసరాలకు తగిన విధంగా కేటాయించేలా నిబంధనలు రూపొందించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో కేంద్రం ముందుగానే నిధులు ఇచ్చేదని, ఇప్పుడు పనిచేసిన తరువాత బిల్లు ఇచ్చేలా పథకాన్ని ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. దీనిపై రాష్ట్రంలో అధికారంలో ఉన్న టీడీపీ మాట్లాడటం లేదని, ప్రతిపక్షంలో ఉన్న వైసీపీ కూడా గట్టిగా ప్రశ్నించడం లేదని అన్నారు. సెలక్టు కమిటీకి పంపించాలని చెప్పి వైసీపీ చేతులు ముడుచుకు కూర్చుందన్నారు. రెండు పార్టీలూ మోదీని చూసి భయపడుతున్నాయని విమర్శించారు. మెడికల్ కళాశాలల విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం మరింత ప్రమాదకరమని రాఘవులు తెలిపారు. ప్రభుత్వం అనుసరిస్తున్న పద్ధతి వైద్యకళాశాలల పూర్తి ప్రైవేటీకరణకు మొదటి మెట్టని, దీన్ని తాము వ్యతిరేకిస్తున్నామని అన్నారు.

జీరాంజీతో దళితులు, బలహీనవర్గాలకు తీవ్రనష్టం: శ్రీనివాసరావు

ఉపాధిహామీ చట్టం స్థానంలో జీరాంజీ పథకం తీసుకురావడం సరికాదని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సూచించారు. రాష్ట్రంలో వ్యవసాయ కార్మికులు, పేదలు, గ్రామీణ కూలీలు ఎక్కువమంది ఉన్నారని, కొత్త పథకం వల్ల వారందరికీ ఉపాధి పోతుందని తెలిపారు. రాయలసీమలోనూ, ఏజెన్సీ ప్రాంతాల్లోనూ గతంలో ఆకలిచావులు ఉండేవని, ఉపాధిహామీ వల్ల తగ్గాయని తెలిపారు. ప్రస్తుతం 50 రోజులు దొరుకుతున్న పనికి గ్యారంటీ లేకుండా పోతుందని పేర్కొన్నారు. నూతన నిబంధనల వల్ల రాష్ట్రంపై రూ.3000 కోట్ల భారం పడుతుందని వివరించారు. అయినా టీడీపీ, వైసీపీ నాయకులు నోరెత్తడం లేదని విమర్శించారు. దీనిపై కేంద్రానికి లేఖ రాయడంతోపాటు రాష్ట్రం నుండి అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలని కోరారు. దీనికి వ్యతిరేకంగా వామపక్షాలు 22వ తేదీన ఆందోళనకు పిలుపునిచ్చాయని, దీనిలో అన్ని సంఘాలూ కలిసి రావాలని కోరారు. అమరావతిలో గతంలో భూములిచ్చిన రైతులకు ఇప్పటికీ న్యాయం జరగలేదని, వారి ప్లాట్లు ఎక్కడ ఉన్నాయో కూడా చూపించలేదని, ఇటువంటి సమయంలో రెండోదశ భూ సమీకరణ అనవసరమని శ్రీనివాసరావు తెలిపారు.

విద్యార్థులపైనే ఆశలు

- వారి బంగారు భవిష్యత్‌కు నాదే బాధ్యత
- చిన్న ఆలోచనలే అభివృద్ధికి మార్గాలు కాగలవు
- 'ముస్తాబు' ప్రారంభోత్సవంలో చంద్రబాబు

విశాలాంధ్ర–తాళ్లపాలెం (కసింకోట): విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాధ్యత తనదేనని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. విద్యార్థులు రాష్ట్రానికి ఆస్తివంటివారని, వారిపైనే ప్రభుత్వం ఆశలు పెట్టుకున్నదని చెప్పారు. చిన్న ఆలోచనలే అభివృద్ధికి మార్గాలు కాగలవన్నారు. సీఎం శనివారం అనకాపల్లి జిల్లా, కసింకోట మండలం, తాళ్లపాలెంలో పర్యటించారు. అక్కడి సామాజిక సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాల నుంచి 'ముస్తాబు' కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. ముస్తాబు వంటి కార్యక్రమాలు వినూత్న ఆలోచనల నుంచి వచ్చినవేనని చెప్పారు. ఖర్చు లేకుండా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తాం... విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తామని చంద్రబాబు తెలిపారు. దీనిని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో అమలు చేస్తున్నామన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఆలోచనతో రూపుదిద్దుకున్న ముస్తాబు కార్యక్రమాన్ని తాళ్లపాలెం నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్నట్లు సీఎం వెల్లడించారు. విద్యార్థుల్లో ఆరోగ్యం, ఆత్మవిశ్వాసం పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని చేపట్టాల్సిన అవసరం ఉందని సూచించారు. మన్యం జిల్లాలో ముస్తాబు కార్యక్రమం ప్రయోగాత్మకంగా చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లలో 75 లక్షల మంది ఇంటర్ వరకూ చదువుతున్నారని, 'ముస్తాబు' ద్వారా చక్కగా తలదువ్వుకోవటం, భోజనానికి ముందు చేతులు కడుక్కోవటం వంటివి వారికి నేర్పుతున్నట్లు వెల్లడించారు. తల్లితండ్రులతో పాటు ప్రభుత్వం కూడా విద్యార్థులపైనే ఆశలు పెట్టుకుందని అన్నారు. నాలెడ్జ్ ఎకానమీలో భాగం కావాలని విద్యార్థులకు సూచించారు. బాగా చదువుకొని మంచి ఉద్యోగాలు చేయాలన్నారు. రాష్ట్రంలో 75 లక్షల మంది విద్యార్థులకు త్వరలో ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. ఇప్పటికే విద్యార్థులకు పౌష్టికాహారం, పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు ఉచితంగా ఇస్తున్నామన్నారు. విద్య శాఖలో వినూత్న సంస్కరణలను మంత్రి లోకేశ్ తెస్తున్నారని చెప్పారు. వివిధ శాఖల మంత్రులు కూడా విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకే కృషి చేస్తున్నారని సీఎం అన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ విజయ్ కృష్ణన్, ఎంపీ సీఎం రమేశ్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

దళితులు... బహుజన శక్తులు ఏకం కావాలి

వడ్డే శోభనాద్రీశ్వరరావు

విశాలాంధ్ర–విజయవాడ (వన్‌టౌన్): దేశంలో దళిత, బహుజన, మైనార్టీ వర్గాలపై దాడులు, కుల వివక్షత సమస్య కొనసాగుతోందని, ఈ ఘటనలు దేశ వ్యాప్తంగా నమోదవుతున్నాయని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) ఏపీ రాష్ట్ర కన్వీనర్, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు తెలిపారు. విజయవాడ వన్‌టౌన్‌లోని వించిపేట సీఎస్‌ఐ చర్చి ఆవరణలో దేశంలో దళిత, గిరిజన, మైనార్టీ వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై (ఏపీడీజేఎస్) అధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షులు కంకిపాటి అనిల్ కుమార్ అధ్యక్షతన దళిత బహుజన శక్తుల ఐక్యతా సదస్సు జరిగింది. ముఖ్య వక్త వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ ఈ దాడులు, వివక్ష ఘటనలు 2021 సంవత్సరంలో పోలిస్తే 15 శాతం పెరిగాయని తెలిపారు. ఏలూరు, ప్రకాశం జిల్లాల్లో దళితులపై దాడులు జరిగాయని, ఇది అమానుషమని అన్నారు. ప్రభుత్వాలు స్పందించి నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. దళిత, బహుజన శక్తులు ఏకం కావాలని, వివక్షకు గురవుతున్న ఈ వర్గాలు సమాజంలో అన్యాయాలకు వ్యతిరేకంగా ఒక బలమైన శక్తిగా ఏర్పడి పోరాడాలని పిలుపునిచ్చారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన పాపులర్ షూమార్ట్ గ్రూప్ సంస్థల చైర్మన్ చుక్కపల్లి అరుణ్ కుమార్ తమ సంస్థ తరపు నుంచి మహిళలకు, వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం కార్పొరేటర్ బోయి సత్తిబాబు, టీడీపీ నాయకులు పేటేటి రాజశేఖర్, దళిత నాయకులు కండెల విజయ్ కుమార్, కరుణానిధి, దైవజనులు కంకిపాటి జాన్ ఆనంద్ కుమార్, చర్మకార సంఘం నాయకులు పల్లికంటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనకాపల్లి కనకరాజు వందన సమర్పణతో కార్యక్రమాన్ని ముగించారు.

కష్టపడుతున్నా... సస్పెన్షన్లా?

పలిశెట్టి దామోదరరావు ప్రశ్న

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్త్రీశక్తి పథకాన్ని విజయవంతం చేయడంలో ఆర్టీసీ సిబ్బంది అంకితభావంతో పనిచేస్తున్నప్పటికీ... ఈ పథకం కారణంగా కండక్టర్లు, డ్రైవర్లు పడుతున్న ఇబ్బందులపై గానీ, పెరిగిన ఒత్తిడిని గానీ పట్టించుకోవడం లేదని ఏపీపీటీడీ (ఆర్టీసీ) ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు ఆవేదన వెలిబుచ్చారు. మరోవైపు తనిఖీల పేరుతో తనిఖీ అధికారులు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ...విధినిర్వహణలో జరుగుతున్న చిన్నచిన్న పొరపాట్లను కూడా క్షమించకుండా కండక్టర్లపై కేసులు రాస్తున్నారని తెలిపారు. డిపో మేనేజర్లు అయినా నిజానిజాలు పరిశీలించకుండా... వాటి ఆధారంగా సస్పెన్షన్లు, పనిష్మెంట్లు ఇవ్వడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. ఇలా అయితే భవిష్యత్‌లో కండక్టర్లు, డ్రైవర్లు డ్యూటీలు చేయడమే కష్టమవుతుందని పలిశెట్టి దామోదరరావు అన్నారు. ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యాలయంలో యస్టీఆర్ జిల్లా విద్యాధరపురం డిపో యూనియన్ నిర్మాణ మహాసభ శనివారం జరిగింది. పలిశెట్టి దామోదరరావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఏడు ఉమ్మడి జిల్లాల్లోని 15 డివిజన్లలో న్యాయపరమైన చిక్కుల కారణంగా నిలిచిపోయిన పదోన్నతుల సమస్యను వెంటనే పరిష్కరించి... అర్హులైన ట్రాఫిక్ అండ్ మెయింటినెన్సు ఉద్యోగులకు, ఇతర కేటగిరి ఉద్యోగులకు పదోన్నతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈయూ రాష్ట్ర ఉపప్రధానకార్యదర్శి యండీ ప్రసాద్ మాట్లాడుతూ స్త్రీశక్తి పథకం అమలుతో ఉద్యోగులపై పెరిగిన పనిభారం తగ్గించాలంటే కనీసం 3,000 అదనపు బస్సులు పెంచాలని, అన్ని కేటగిరీల్లో 1000 ఖాళీ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కొత్త బస్సులు, కొత్త నియామకాలు లేకుండా ఇదే సిబ్బంది, బస్సులతో స్త్రీశక్తి పథకం ఎంతోకాలం నడవబోదని చెప్పారు. విజయవాడ జోన్–2 జోనల్ కార్యదర్శి వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యాధరపురం డిపో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు ఉద్యోగులకు అభినందనలు తెలియజేశారు. కొత్త కమిటీని ఆయన ప్రకటించారు. యస్టీఆర్ జిల్లాలో ఉన్న జోన్, జిల్లా కమిటీ సభ్యులు విద్యాధరపురం డిపో ఉద్యోగులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో విపరీత ధోరణులపై చర్చ జరగాలి

- ఏపీయూడబ్ల్యూజే అధ్వర్యంలో విజయవాడలో సెమినార్
- ముఖ్యఅతిథిగా హాజరుకానున్న మంత్రి నారా లోకేశ్

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: ఆంధ్ర ప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) అధ్వర్యాన జనవరిలో నిర్వహించే సెమినార్‌కు హాజరవుతానని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చారు. శనివారం ఉదయం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మంత్రి లోకేశ్‌ను ఐజేయూ జాతీయ అధ్యక్షులు, తెలంగాణ మీడియా అకాడమి చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి నేతృత్వంలో ఏపీయూడబ్ల్యూజే బృందం కలిసింది. ఈ సందర్భంగా వివిధ అంశాలపై మంత్రితో చర్చించారు. సోషల్ మీడియా, ప్రస్తుత ధోరణులు అనే అంశంపై ఏపీయూడబ్ల్యూజే అధ్వర్యంలో జనవరిలో రాష్ట్రస్థాయి సెమినార్ నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని మంత్రి లోకేశ్‌ను కోరగా, ఆయన అంగీకరించారు. సోషల్ మీడియాలో జరుగుతున్న విపరీత ధోరణులపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత యూనియన్‌లపై ఉందని మంత్రి అభిప్రాయపడ్డారు. జర్నలిస్టుల అభివృద్ధి, సంక్షేమం హక్కుల సాధన కోసం ఏపీయూడబ్ల్యూజే చేస్తున్న కృషిని లోకేశ్ ప్రశంసించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులకు సంబంధించిన సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురాగా, ఆయన సానుకూలంగా స్పందిస్తూ, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో విజయవాడలో ఐజేయూ ప్లీనరీ సమావేశాలు నిర్వహించనున్న విషయాన్ని శ్రీనివాస్ రెడ్డి మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై మంత్రి స్పందిస్తూ సమావేశాలు విజయవంతం కావాలని, ప్రభుత్వం తరపున తమ సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షులు ఐ.వి.సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి కంచల జయరాజ్, ఉపాధ్యక్షులు చావా రవి పాల్గొన్నారు.

డాక్టర్లు స్వేచ్ఛగా విదేశాలకు వెళ్లొచ్చు: నడ్డా

లక్నో: దేశంలో వైద్య సౌకర్యాలు సమృద్ధిగా లేవని యువ డాక్టర్లు ఇక ఫిర్యాదు చేయరాదని, విదేశాలకు వెళ్లాలనుకుంటే స్వేచ్ఛగా వెళ్లవచ్చు అని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డా అన్నారు. ముఖ్యంగా దేశంలో ఉన్న వనరులను, సంస్థలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కానీ విదేశాలకు వెళ్లే నెపంతో దేశంలో వైద్య సౌకర్యాలు సరిగా లేవని నిందలు మోపరాదని నడ్డా పేర్కొన్నారు.

లక్నోలో కింగ్ జార్జి మెడికల్ యూనివర్సిటీ 21వ స్నాతకోత్సవంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ నేతృత్వంలో దేశీయ వైద్య వ్యవస్థ పూర్తిగా మారిందన్నారు. దేశంలో ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ సంస్థల సంఖ్య ఇప్పుడు 23కు పెరిగిందన్నారు.

'ఏపోలిస్'తో క్షణాల్లో సంక్షేమ రుణాలు: డీజీపీ

విశాలాంధ్ర బ్యూరో – అమరావతి: ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ డిజిటల్ పాలన దిశగా కీలక ముందడుగు వేసింది. పోలీస్ సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని రూపొందించిన ఏపోలిస్ (ఆటోమేటెడ్ పోలీస్ ఆన్‌లైన్ ఇన్‌ఫర్‌మేషన్ సిస్టమ్) అనే పూర్తిస్థాయి ఆటోమేటెడ్ వెల్ఫేర్ లోన్ ప్రాసెసింగ్ వ్యవస్థతో పాటు మొబైల్ యాప్‌ను శనివారం డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా ప్రారంభించారు. ఈ సందర్భంగా డీజీపీ పోలీస్ ఉద్యోగికి రూ.మూడు లక్షల సంక్షేమ రుణాన్ని మంజూరు చేసి... డిజిటల్ వ్యవస్థ ద్వారా తక్షణమే నగదు విడుదల చేశారు. ఉద్యోగి కుమార్తె వివాహానికి అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందించారు. ఇంతకు ముందు మాన్యువల్ విధానంలో సంక్షేమ రుణాల మంజూరు, విడుదలకు సుమారు మూడు నెలల సమయం పట్టేదని, ప్రస్తుతం ఏపోలిస్ అమల్లోకి రావడంతో, అవసరమైన పత్రాల పరిశీలన అనంతరం ఒక రోజులోనే రుణ ప్రక్రియ పూర్తి అవుతోందని తెలిపారు. తాజాగా ఆవిష్కరించిన యాప్ ద్వారా సంక్షేమ రుణాలు, సెలవుల కోసం దరఖాస్తు, జీతభత్యాల స్లిప్‌లు, మెడికల్ రిపోర్టులు, తదితరల వివరాలను సులభంగా తెలుసుకోవచ్చన్నారు. అడిషనల్ డీజీపీ (శాంతి భద్రతలు) ఎన్.మధుసూదన్ రెడ్డి, ఐజీపీ (టెక్నికల్ సర్వీసెస్) శ్రీకాంత్, డీఐజీ (సంక్షేమం) అన్బు రాజన్ పలువురు సీనియర్ ఐపీఎస్ అధికారులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని ఏడు ఏనుగుల మృతి

గువహతి: అసోంలో శనివారం రైలు ప్రమాదం జరిగింది. సైరాంగ్ నుంచి ఢిల్లీ బయల్దేరిన రాజధాని ఎక్స్‌ప్రెస్ జాయ్ జిల్లాలో ఏనుగుల మందను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఏడు ఏనుగులు మృతిచెందగా... ప్రమాదం ధాటికి రైలు బోగీలు పట్టాలు తప్పాయి. రైలు ఇంజిన్‌తో పాటు ఐదు బోగీలు పట్టాలు తప్పినట్లు నార్త్‌ఈస్ట్ ఫ్రంటియర్ రైల్వే అధికార ప్రతినిధి వెల్లడించారు. అయితే, ప్రయాణికులెవరికీ ప్రమాదం జరగలేదని తెలిపారు. తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. రైలు ఢీకొనడంతో ఏడు ఏనుగులు మృతి చెందగా... మరో ఏనుగు గాయపడింది. రైల్వే, అటవీశాఖ అధికారులు ఘటనాస్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. ప్రమాదం కారణంగా ఈ మార్గంలోని రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగింది. పలు రైళ్లను దారి మళ్లించినట్లు అధికారులు వెల్లడించారు. ఘటన జరిగిన ప్రాంతం ఎలిఫెంట్ కారిడార్ కాదని రైల్వే అధికారులు తెలిపారు. పట్టాలపై ఏనుగుల మందను చూడగానే లోకో పైలట్ ఎమర్జెన్సీ బ్రేకులు వేశాడని, అయినప్పటికీ ప్రమాదం జరిగిందని వివరించారు. దీనిపై దర్యాప్తు జరుగుతోందన్నారు.

అశ్రునివాళి

కీ॥శే॥ శ్రీకుసుమ కృష్ణమూర్తి గారు

మాజీ పార్లమెంటు సభ్యులు-అమలాపురం

ది.13-12-2025 శనివారం స్వర్గస్థులైనారు అని శోకతప్త హృదయంతో తెలియజేస్తున్నాము

ది.21-12-2025 ఆదివారం ఉదయం 10 గ॥లకు నుండి అమలాపురం -నల్లవంతెన దిగువున రాజ్‌కృష్ణ ఎంటర్‌ప్రైజస్ గొడౌన్ నందు సంతాపసభ జరుపబడునని తెలియజేయడమైనది

మరణం : 13-12-2025

శ్రీ కుసుమ సత్యనారాయణ (Rtd irrigation Eng.) శ్రీమతి జ్యోతిశ్వరి
శ్రీ (లేటు) గూడాలకృష్ణ (Rtd Ed.) శ్రీమతి వెంకటలక్ష్మి (కుమార్తె)
శ్రీ కుసుమ సునీల్ కుమార్ (ఇండియన్ ఆయిల్ డీలర్) శ్రీమతి లిల్లీ మంగేష్కర్ (సర్పంచ్ విలస)
శ్రీ కుసుమ రాజ్ కుమార్ (సివిల్ ఇంజనీర్) శ్రీమతి సూజాత
శ్రీ కుసుమ వెంకట్రావు (ఇండియన్ ఆయిల్ డీలర్) శ్రీమతి ఝాన్సీరాణి
శ్రీ కుసుమ విజయ్‌కుమార్ (ఇండియన్ ఆయిల్ డీలర్) శ్రీమతి లక్ష్మి కుమారి
శ్రీ కుసుమ అనిల్‌కుమార్ (భారత్ పెట్రోలియం డీలర్) శ్రీమతి అరుణశ్రీ
శ్రీ డా॥కుసుమ కిషోర్‌కుమార్ (MBBS MD) శ్రీమతి కృపా పాల్

మనమలు -మనుమరాలు:
మోహన్ కృష్ణ-రేఖ, శ్రావణి, కావ్య సంజన, సుదీప సాయి
అర్జున్ సాయిరాం - రేణి జాస్మి అనౌష్కా, కార్తిప్రేమ్, పూజ్యశ్రీ, ఆరోన్ పాల్ షీనా జాయ్

ఇట్లు: కుటుంబ సభ్యులు

విశాలాంధ్ర జాతీయ దినపత్రిక

సీనియర్ జర్నలిస్టులు, ట్రైనీ సబ్ ఎడిటర్లు **కావలెను**

74 సంవత్సరాల చరిత్ర కలిగిన విశాలాంధ్ర జాతీయ దినపత్రికలో పని చేయడానికి సీనియర్ జర్నలిస్టులు, ట్రైనీ సబ్ ఎడిటర్లు కావాలి.

సీనియర్ జర్నలిస్టులు

సీనియర్ జర్నలిస్టులకు అనుభవానికి తగిన వేతనం ఇవ్వబడును. ఆసక్తిగలవారు నేరుగా విశాలాంధ్ర ప్రధాన కార్యాలయం, చంద్రం బిల్డింగ్స్, విజయవాడలో 2025 డిసెంబరు 27వ తేదీ ఉదయం 10 గంటలకు హాజరుకావలెను. వారికి రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఉంటుంది.

ట్రైనీ సబ్ ఎడిటర్లు

అర్హతలు : తెలుగులో రాయగల నేర్పు, ఆంగ్లభాషపై అవగాహన కలిగి ఉండాలి. లోకజ్ఞానం, వర్తమాన వ్యవహారాలపై పట్టు, ప్రజల సంక్షేమం కోసం పాటుపడాలన్న తపన, పాత్రికేయ రంగం పట్ల ఆసక్తి కలిగి ఉండాలి. జనవరి 1, 2026 నాటికి 30 ఏళ్ళ వయసు మించనివారై, డిగ్రీ ఉత్తీర్ణత కలిగిన వారై ఉండాలి.

ట్రైనీ సబ్‌ఎడిటర్లకు శిక్షణకాలంలో మొదటి సంవత్సరం రూ. 14,000, ఆ తర్వాత ప్రొబేషన్ పీరియడ్‌లో రూ. 15,000 చొప్పున నెలవారీ భృతి ఇవ్వబడును. అనంతరం ప్రతిభ ఆధారంగా వేతనం నిర్ణయించబడును. దరఖాస్తును e-mail : editorvisalaandhra2026@gmail.com మెయిల్‌కు, లేదా ఈ క్రింది చిరునామాకు ఫొటోతో సహా పంపించవలెను.

చిరునామా : ఎడిటర్, విశాలాంధ్ర జాతీయ దినపత్రిక, చంద్రం బిల్డింగ్స్, చంద్ర రాజేశ్వరరావు రోడ్డు, చుట్టుగుంట, విజయవాడ - 520004,
వివరాలకు ఫోన్ నెంబర్ : 9590952106, 7997014006
e-mail : editorvisalaandhra2026@gmail.com

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 32299/79, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.